
బ్రహ్మర్షి పత్రీజీ దివ్య ఆశీస్సులతో...

# తెలుసుకోండి

తటవర్తి వీరరాఘవరావు




అనుబంధం :

## పరమయోగి కబీరు సందేశాలు

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...

# "తెలుసుకోండి!"





రచన & ప్రచురణ : **తటవర్తి వీరరాఘవరావు**

ప్రథమ ముద్రణ : డిశంబరు, 2012

ప్రతులు : 2,000

వెల : **రూ. 70/-లు**



**పుస్తకముల కొరకు**

**తటవర్తి వీర రాఘవరావు**

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201. ప॥గో॥జిల్లా.**

**ఫోన్ : 08816 - 234353, సెల్ : 9440309812**

email : balajipyramid.bvrm@gmail.com

# విషయ సూచిక

| | |
|---|---|
| ఆర్థిక సమస్యలకు కారణం ? | 3 |
| ఆర్థిక స్థితి పెరగాలంటే? | 4 |
| అత్యంత ధనవంతులు కావాలంటే? | 14 |
| ఎవరు గొప్ప? | 16 |
| గొప్పల కోసం తప్పలు | 26 |
| గుర్తింపు | 29 |
| అమరత్వం - అమర జీవి | 31 |
| బాధ్యత | 33 |
| మనస్సు వుంటే! | 35 |
| మైండ్ - ప్యూరిఫికేషన్ | 38 |
| మనశ్శుద్ధి వల్ల లాభాలు | 40 |
| మానవుని ఆలోచనా విధానం | 42 |
| గుణం ఎవరికి మారుతుంది? | 46 |
| హృదయంలో నింపవలసినవి | 46 |
| పవిత్ర కార్యం | 48 |
| పుట్టినది - పెట్టినది | 49 |
| ఆయుష్షు | 50 |
| శుభాకాంక్షలు | 51 |
| కాలం | 55 |
| ముక్తి - భుక్తి | 57 |
| ఋణవిముక్తుడైతేనే ముక్తి | 58 |
| ధనము - జ్ఞానము | 60 |
| ఎవరు చేసుకున్నది వారికే | 61 |
| ఆత్మను హత్య చేయగలమా? | 63 |
| సహజ మరణం - అసహజ మరణం | 66 |
| నెగెటివిటి | 67 |
| కోరికలు అణచకూడదా? | 80 |
| ఎందుకు ఈ వృద్ధులు? రోగగ్రస్తులు? ముష్టివాళ్ళు? | 83 |
| ఆదర్శగ్రామం | 85 |
| హింస | 87 |
| జీవించు - జీవించనివ్వు | 88 |
| రక్తమాంసాలు చూడగలరా? | 90 |
| జీవహింస | 91 |
| మొక్కు | 93 |
| బొమ్మ - అమ్మ | 96 |
| ప్రాణదానం | 99 |
| పాత్ర శుద్ధి - పదార్థ శుద్ధి - పాకశుద్ధి | 101 |
| **అనుబంధం** | |
| పరమయోగి కబీరు | 105 |

# ఆర్థిక సమస్యలకు కారణం ?

మానవునకు ఎన్ని వున్నా తృప్తి లేకపోవడం వల్ల, కోరరానిది కోరడమే కాదు, ఇంకా ఇంకా అని ఆశపడడం వల్ల, ఆశపడే మనస్సును తృప్తి పరచడానికి, మనస్సు కోరిన కోరికలు తీర్చడానికి ముఖ్యంగా ధనం అవసరం. అందుచేత ఆ ధనం సంపాదించడం కోసం ప్రతీ ఒక్కరూ చేయకూడని పనులు చేస్తున్నారు, మోసాలు చేస్తున్నారు, అబద్ధాలు చెపుతున్నారు, అధర్మమైన మార్గాలు అనుసరిస్తున్నారు. అన్యాయంగా, అక్రమంగా సంపాదిస్తున్నారు.

సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. దాని ఫలితంగా ఆర్థిక సమస్యలలో చిక్కుకుంటున్నారు. నేను ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాను అని వాపోతున్నారు.

పైగా న్యాయంగా వుంటే ఇప్పుడెవరు సంపాదించగలరు? అని చేసిన పనిని సమర్థించుకుంటున్నారు. అసలు ధర్మంగా వుంటే ప్రస్తుత కాలంలో జీవించగలమా? అని కూడా ప్రశ్నిస్తారు. కానీ అంతకన్నా ఆలోచించడం లేదు.

తెలుసుకోండి ఎవరైనా సరే వారు గతంలో చేసుకుని సంపాదించుకున్న అర్హతను బట్టే, వారి వారి ప్రస్తుత ఆర్థిక స్థితి ఆధారపడి వుంది. అందుచేత ఎవరైనా సరే వారికి ఇవ్వబడిన ఆర్థిక స్థితితో తృప్తి పడి అవసరాలకు పరిమితమవుతూ, అనవసరమైన కోరికలకు బానిస కాకుండా, సృష్టికి, సృష్టి ధర్మానికి అనుగుణంగా సంపాదిస్తే ఎవరికీ ఆర్థిక సమస్యలు రావు; ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని బాధపడవలసిన అవసరం కూడా రాదు. అందుచేత తెలుసుకోండి ఎవరైనా సరే అత్యాశతో ఇంకా ఇంకా అంటూ సంపాదించడానికి చేసే ప్రయత్నమే ఆర్థిక అనర్థాలకు కారణం.

అందుచేత తెలుసుకోండి ఆర్థిక సమస్యలకు కారణం కోరికలు, అత్యాశ. ఇవి మనస్సుకు సంబంధించినవి. అందుచేత మనస్సును అదుపు చేసుకుంటే కోరికలు అదుపులో వుంటాయి. మనస్సును శుద్ధి చేసుకుంటే అత్యాశపోతుంది. ఈ రెండూ సాధించాలంటే తప్పనిసరిగా 'ధ్యానం' చెయ్యాలి. ధ్యానం చేస్తే మెల్లిగా చెయ్యకూడని పనులు చెయ్యరు, అధర్మంగా ప్రవర్తించరు. అపుడు మీకు ఆర్థిక సమస్యలు రావు.

తెలుసుకోండి ఈ సృష్టిలో ఎవరి అర్హతను బట్టి వారికి ఆర్థిక స్థితి ఇవ్వ బడింది. అందుకే ఒకడు పుట్టుకతోనే కోటీశ్వరుడు, ఒకడు లక్షాధికారి, ఒకడు భిక్షాధికారి. కారణం వారు సంపాదించుకున్న అర్హతే. అందుచేత అర్హతకు మించి ఆశిస్తేనే అనర్థాలు, ఆర్థిక ఇబ్బందులు. అందుచేత సంపాదించడానికి అతిగా కష్టపడ వలసిన పని లేదు. మీరు అతిగా కష్టపడినా, మామూలుగా కృషి చేసినా... ఉండవల సింది ఉంటుంది, రావలసింది వచ్చితీరుతుంది, పోవలసింది పోతుంది కూడా.

# ఆర్థిక స్థితి పెరగాలంటే?

లోకంలో ఒక్కొక్కరు ఒక్కొక్కరకమైన ఆర్థిక స్థితిలో వుంటారు. కొంతమందికి కోట్లు వుంటాయి. కొంతమందికి లక్షలు వుంటాయి. కొంతమందికి వేలు వుంటాయి. కొంతమందికి ఏమీ వుండదు. ఇంకా కొంతమందికి ఎన్ని కోట్లు వుంటాయో వారికే తెలియదు. ఇలా ఒక్కొక్కరూ ఒక్కొక్క రకమైన ఆర్థిక స్థితిలో వుంటారు.

గమనిస్తే ఎవరు ఏ ఆర్థిక స్థితిలో వున్నా వారు ఇంకా... ఇంకా... సంపాదించాలని, తమ ఆర్థిక స్థితి పెంచుకోవాలని చూస్తూ వుంటారు, తాపత్రయపడుతూ వుంటారు. దాని కోసం రాత్రి, పగలు కష్టపడుతూ వుంటారు. చేయకూడని పనులు చేస్తూ వుంటారు. అధర్మంగా కూడా ప్రవర్తిస్తూ వుంటారు. గమనిస్తే ఎన్ని చేసినా కొంతమంది మాత్రమే తమ ఆర్థిక స్థితి పెంచుకోగలుగుతారు. చాలా మంది పెంచుకోలేరు. ఒక్కొక్కసారి వున్న స్థితి కూడా దిగజారిపోతుంది. అంటే వున్నది కూడా ఊడిపోతుంది. ఇలా ఎందుకు జరుగుతుందో వారికి అర్థం కాదు. ఏది ఏమైనా ఎవరికి వారు తమ ఆర్థిక స్థితి పెరగాలనే చూస్తారు, పెంచుకోవాలనే ప్రయత్నిస్తారు.

మరి ఆర్థిక స్థితి ఇలా వుండటానికి కారణమేమిటి? ఆర్థిక స్థితి పెరగాలంటే? ఏమి చెయ్యాలి? అన్నది తెలుసుకుందాం.

**"ఆర్థిక స్థితి అన్నది చేసే కృషిని బట్టి వుండదు. అర్హతను బట్టి వుంటుంది".**

ఇది అర్థం కావాలంటే ముందుగా మనం ఈ విషయాలు తెలుసుకోవాలి. (1) మనం ఈ సృష్టిలో వున్నాము. (2) ఈ సృష్టిని సృష్టి చేసిన సృష్టి కర్త వున్నాడు. (3) సృష్టి కర్త ఏర్పాటు చేసిన నియమాలు వున్నాయి. వాటినే 'ధర్మాలు' అని కూడా అంటారు. అంటే సృష్టి ధర్మాలు వున్నాయి.

అంటే ఎవరైనా సరే! ఏదైనా సరే! ఆఖరికి ఆర్థిక స్థితి అయినా సరే! ఈ సృష్టి నియమాలననుసరించి ప్రయత్నించాలి.

ధనం ఉన్న వాడిని చాలా మంది ఏమంటారంటే వాడు అదృష్టవంతుడు అంటారు. లేనివాడిని దురదృష్టవంతుడు అంటారు. అంతేకాదు చాలామంది భగవంతుడు నాకు ఈ అదృష్టం కల్పించాడు అని కలిసి వచ్చినవారు అనుకుంటూ వుంటారు. భగవంతుడు నన్ను దురదృష్టవంతుణ్ణి చేసాడని కలిసి రానివారు అనుకుంటారు. కానీ ఆలోచిస్తే ఇదంతా భగవంతుడు చేసింది కాదు. ఎవరికి వారు చేసుకున్నదే. ఎవరికి వారు చేసుకుని సంపాదించుకున్న అర్హతను బట్టే అలా వుంది.

అందుచేత కష్టపడడం, కృషి చెయ్యడం ప్రధానం కాదు, అర్హత సంపాదించడమే ప్రధానం. అందుకే చూడండి. రిలయన్స్ అంబానీలకు గానీ, టాటాలకు గానీ, బిర్లాలకు గానీ, కొడుకో... మనవడో... పుడితే వాడు పుట్టుకతోనే అపర కోటీశ్వరుడైపోతాడు. అలాగే ముష్టివాడికి కానీ, పేదవాడికి కానీ, కూలివాడికి కానీ పుడితే వాడు పుట్టుకతోనే దరిద్రుడవుతాడు. ఆలోచించండి రిలయన్స్ అంబానీల కొడుకు పుట్టగానే ఎందుకు కోటీశ్వరుడయ్యాడు? వాడు ఏమి కష్టపడ్డాడు? ఏమి కృషి చేసాడు? అప్పుడే కదా పుట్టింది? ఏ కష్టం లేకుండా, ఏ కృషి లేకుండా కోటీశ్వరుడయ్యాడు కదా? ఇక్కడ గమనిస్తే భగవంతునికి అందరూ సమానమే. ఆయనకు రాగద్వేషాలు లేవు. కొంతమందిని ధనవంతులుగా, కొంతమందిని పేదవారిగా చేస్తాడా? చెయ్యడు కదా?

అందుచేత తెలుసుకోండి కొంతమంది గతంలో అర్హత సంపాదించుకున్నారు కోటీశ్వరులయ్యారు. ముష్టివాడి కొడుకు అర్హత సంపాదించుకోలేదు. దరిద్రుడయ్యాడు. అందుచేత ఆర్థిక స్థితి అన్నది అర్హతను బట్టి వస్తుంది తప్ప రాత్రి, పగలు కష్టపడేదాన్ని బట్టి రాదు. మరి అర్హత ఎలా వస్తుంది? అంటే ఇస్తే వస్తుంది. ఇవ్వకపోతే రాదు. ఏది ఇస్తే అదే వస్తుంది. ఎంత ఇస్తే అంతే వస్తుంది. అందుచేత ఈ సృష్టిలో ఆర్థిక స్థితి పెరగాలనుకునేవారు కచ్చితంగా అర్హత సంపాదించుకోవాలి. అంటే ఇవ్వవలసిందే. ధనం పెరగాలంటే ధనం ఇవ్వాలి. ఎక్కువ స్థితి కలగాలంటే ఎక్కువ ఇవ్వాలి. కోట్లు కావాలంటే కోట్లు ఇవ్వాలి.

ఇక్కడ చిన్న సందేహం వస్తుంది. కోట్లు ఇచ్చి, కోట్లు పొందడమెందుకు? కోట్లు మనమే ఉంచుకోవచ్చు కదా? అని అనుకోవచ్చు. అలాగే కొంతమంది కోట్లు ఇవ్వాలంటే కోట్లు నా వద్ద వుండాలి కదా? అని అనవచ్చు. అంత ధనం లేని నేను కోట్లు ఎలా ఇవ్వగలను? నాకు కోట్లు సంపాదించే అర్హత ఎలా వస్తుంది? ఆ అవకాశం కోట్లు వున్నవారికే సాధ్యం కానీ లేని నాకు ఎలా సాధ్యం? అని అనిపిస్తుంది. కొంతమంది మా దగ్గర డబ్బు లేదు. సేవా కార్యక్రమాలు, దానాలు చేయలేకపోతున్నాం. అలాంటి అవకాశం డబ్బులున్న వారికే సాధ్యం, వారికే అన్ని రకాల అర్హతలు పొందగల అవకాశం వుంది. భగవంతుడు మమ్మల్ని పేదవారిని చేసి సేవ చేసే భాగ్యం లేకుండా చేసాడు. ధనవంతులలా సంపాదించుకునే అవకాశం మాకు లేదు అని బాధపడుతూ వుంటారు. అంతేకాదు ఈ సృష్టిలో కోటీశ్వరులే కోటీశ్వరులు కాగల అవకాశం వుంది కానీ పేద వారికి ఆ అవకాశం లేదేమోనని బాధపడేవారు వున్నారు.

కానీ భగవంతుడు ఈ సృష్టిలో, ధనవంతులకి, పేదవారికి కోట్లు

సంపాదించుకునే అవకాశం సమానంగా కల్పించాడు. కారణం ఆయనకు అందరూ సమానమే కనుక. అదెలాగో తెలుసుకుందాం.

ఇక్కడ మానవుల లెక్కకు, సృష్టిలోని లెక్కకు చాలా తేడా వుంది. మానవులు ఎంత ఇచ్చాడు? అన్నది చూస్తారు కానీ సృష్టిలో ఎంత శాతం ఇచ్చాడు? అన్నది చూడబడుతుంది.

అంటే కోటి రూపాయలు వున్నవాడు లక్ష దానం చేస్తే లోకంలో చాలా ఎక్కువ దానం ఇచ్చినట్టు లెక్కిస్తారు. కానీ వాడి కంటే రూ.1000/-లు వున్నవాడు రూ.900/-లు దానం చేస్తే లక్ష ఇచ్చిన వాడికంటే ఎక్కువ ఇచ్చినట్టు సృష్టిలో లెక్కించబడుతుంది. కారణం కోటి వున్నవాడు 1% ఇస్తే వెయ్యి వున్నవాడు 90% ఇచ్చినట్టు. అంటే వున్న వాడికంటే లేని వాడు ఎక్కువ ఇచ్చినట్టు. అందుచేత ఈ సృష్టిలో తనకు వున్న దాంట్లో అంటే సృష్టి నుంచి తనకు ఇవ్వబడిన దాంట్లో ఎంత ఎక్కువ ఇచ్చాడు? అన్నది లెక్కించబడుతుంది. కానీ ఇచ్చింది కాదు. అందుచేత భవిష్యత్తులో 900 ఇచ్చిన వాడు కోటీశ్వరుడవుతాడు. లక్ష ఇచ్చిన వాడు సామాన్యుడవుతాడు. అందుచేత ఎంత ఇచ్చాము? అన్నది కాదు. ఎంతశాతం ఇచ్చాము? అన్నదే ముఖ్యం.

దీనిని బట్టి తనకు ఉన్న దాంట్లో ఎంత ఎక్కువ ఇవ్వగలిగినా ఈ సృష్టిలో కోట్లు ఇచ్చినట్టే. అంతేకానీ కోట్లు ఇస్తేనే కోట్లు ఇచ్చినట్టు కాదు. అందుచేత సృష్టిలో అర్హత సంపాదించాలంటే మీకు వున్న దాంట్లో ఎక్కువ ఇవ్వగలిగితే చాలు. కోట్లే ఇవ్వవలసిన అవసరం లేదు. అలా వున్న దాంట్లో ఎక్కువ ఇచ్చిందే దానమవుతుంది. అలా ఇచ్చినవాడు గొప్పవాడవుతాడు. భవిష్యత్తులో లాభపడతాడు. అర్హత సంపాదించుకున్నవాడవుతాడు.

ఈ సృష్టిలోని పై విషయాన్ని మనకి అర్థమయ్యేటట్టు తెలియచెప్పటానికే పూర్వం పండితులు కొన్ని పురాణ కథల ద్వారా తెలియచేశారు.

భారత యుద్ధానంతరం ధర్మరాజు రాజ్యాన్ని పాలించే రోజులలో ఒక పెద్ద యాగాన్ని చేసాడు. యాగానంతరం ఆ రాజ్యంలోని వారందరికీ షడ్రసోపేతంగా విందు భోజనం ఏర్పాటు చేసాడు. విందు అనంతరం వచ్చిన వారందరికీ అడిగిన వారికి కాదనకుండా దానాలు ఇచ్చాడు. ఆ విందును, ఆయన ఇచ్చే దానాలు చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ధర్మరాజును వేనోళ్ళ పొడిగారు. అంతటి దానం ఇంతకు ముందు ఎవరూ చేసి వుండరు, తరువాత కూడా ఎవరూ చెయ్యలేరు అని ధర్మరాజును ప్రశంసించారు.

అలా అంతా ధర్మరాజును పొగుడుతుంటే! ధర్మరాజు తనలో తానే పొంగి

పోవడం మొదలు పెట్టాడు. అంతటి గొప్పదానాన్ని నేను చెయ్యగలిగానన్నమాట. నేను ఎంతటి అదృష్టవంతుణ్ణి? ఎంతటి గొప్పవాణ్ణి? నాకే ఇంతటి అదృష్టం కలిగింది అని తనలో తాను పొంగిపోవడం మొదలు పెట్టాడు. మెల్లిగా అతనిలో అహంకారం ప్రవేశించింది. కానీ ముఖ్యంగా మనం తెలుసుకోవలసింది **"ఎవరి లోనయితే అహంకారం ప్రవేశిస్తుందో వారు ఎంతటి గొప్పవారైనా మెల్లిగా వారి పతనం ప్రారంభమవుతుంది".**

ఆ సభలోనే శ్రీ కృష్ణుల వారు కూడా వున్నారు. సహజంగా అందరి మనస్సులలో ఏమి వుందో తెలుసుకోగల శక్తి వున్న శ్రీ కృష్ణుల వారికి ధర్మరాజు ఆలోచనలు తెలుసుకున్నారు. అలా అహంకారం బయలుదేరితే ధర్మరాజుకైనా పతనం తప్పదని గ్రహించి ధర్మరాజుకు బుద్ధి చెప్పడానికి అక్కడ ఒక చిన్న సంఘటన సృష్టించారు.

అందరికీ ఆశ్చర్యం గొలిపే విధంగా ఆ సభలోకి ఒక ముంగిస ప్రవేశించింది. ఆ ముంగీసను చూడగానే అందరూ ఆశ్చర్యపోయారు. కారణం ఆ ముంగిస సగం బంగారు రంగులోనూ, సగం మామూలుగానూ వుంది. అంతేకాదు ఆ ముంగిస చేసే పని చూసి అక్కడ వున్న వారందరికీ ఇంకా ఆశ్చర్యమేసింది. కారణం ఆ ముంగిస అక్కడ వున్న ఎంగిలి ఆకుల్లో మెతుకులు తింటూ, ఆకుల్లో దొర్లుతూ వుంది. అందరూ దానినే ఆశ్చర్యంగా చూస్తున్నారు. అలా దొర్లి, దొర్లి మాట్లాడటం మొదలు పెట్టింది. "అందరూ ధర్మరాజు చేసింది గొప్పదానమని ప్రశంసిస్తున్నారు. ఇంతకన్నా గొప్పదానం లేదని అంటున్నారు. కానీ అసలు ధర్మరాజు చేసింది గొప్పదానమే కాదు" అని అంది.

ఆ ముంగిస మాట్లాడటం, అందులోను అందరూ ప్రశంసిస్తున్న దానికి విరుద్ధంగా! ధర్మరాజు చేసింది గొప్పదానం కాదు అని అనడంతో ఆ సభలోని వారందరూ ఆశ్చర్యచకితులై చూడటం మొదలుపెట్టారు, సభ అంతా ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంది. అందరూ ఆ ముంగిస వంకే చూస్తున్నారు. ఆ సభలోనే వున్న ధర్మరాజు సోదరులకు ముంగిస మాటలు విపరీతమైన ఆగ్రహాన్ని తెప్పించాయి. వారు ఆ ముంగిసతో ఏమిటి? ధర్మరాజు చేసింది గొప్పదానం కాదా? అసలు ఇంతకన్నా గొప్పదానం ఎవరు చెయ్యగలరు? ఈ రాజ్యంలో ఇంతమంది ప్రశంసిస్తూ వుంటే నువ్వు కాదంటున్నావే? వారందరికంటే నువ్వు గొప్పదానివా? అసలు దానం గురించి నీకేం తెలుసు? అని కోపంతో ముంగిస మీదకు రాబోతుంటే ధర్మరాజు వారిని వారించి, ఆ ముంగిసతో ఇలా అన్నాడు.

"మహాత్మా! మీరు మాట్లాడుతున్నారంటే మీరు గొప్పవారని అర్థమవుతుంది.

మరి నేను చేసింది గొప్పదానం కాకపోతే! అసలు ఏది గొప్పదానం? అంతటి గొప్పదానం చేసిన వారు ఎవరైనా వున్నారా? కాస్త దయ వుంచి నాకు సెలవియ్యండి" అని ఆ  ముంగిసతో ధర్మరాజు అన్నాడు.

అపుడు ఆ ముంగిస ఇలా చెప్పడం మొదలు పెట్టింది. ఆ సభలోని వారంతా ఆసక్తిగా ఆ ముంగిస మాటలు వింటున్నారు. "ఓ ధర్మరాజా! నీ రాజ్యంలోనే ఫలానా గ్రామంలో ఒక పేద బ్రాహ్మణుడు వున్నాడు. ఆయన కుటుంబానికి కొద్దిపాటి భూమి వుంది. ఆ భూమిలో పండిన పంటతో కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చిన వారికి లేదనకుండా అన్నదానం చేసేవాడు. అలా వుంటుండగా ఒక సంవత్సరం వర్షాలు సరిగా లేని కారణంగా పంట సరిగా పండలేదు. అందుచేత వారి ఇంటిలో గింజలన్నీ తొందరగా అయిపోయాయి. వారికి ఎలాంటి పరిస్థితి వచ్చిందంటే వారు తినడానికి కూడా ఏమీ లేదు. నీరు త్రాగుతూ పస్తులు వుంటూ కొన్ని రోజులు కాలక్షేపం చేసారు. చివరకు ఆ కుటుంబ సభ్యులు ఆకలితో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చింది.

అపుడు ఆ బ్రాహ్మణుడు మరల తన పొలంలోకి వెళ్ళాడు. ఆ భూమిలో అక్కడక్కడ రాలిన గింజలు ఏరాడు. ఒక దోసెడు గింజలు వచ్చాయి. వాటిని దంచగా వచ్చిన బియ్యంతో అన్నం వండాడు. ఆ వండిన అన్నం ఆ కుటుంబంలోని వారందరికీ తలకో ఒక ముద్ద వచ్చింది. వారేమనుకున్నారంటే ఈ ముద్దను తిని మనం ప్రాణాలు నిలబెట్టుకుంటే రేపు భగవంతుడు ఏదో ఒక మార్గం చూపించకపోతాడా! అనే ఉద్దేశ్యంతో ఆకులలో తలకో ముద్ద వుంచుకుని తినటానికి సిద్ధమయ్యారు.

ఇంతలో అనుకోని రీతిలో ఒక అతిథి ఆ యింటికి వచ్చాడు. నాకు చాలా ఆకలిగా వుంది. ఏదైనా పెట్టమని ఆ బ్రాహ్మణుణ్ణి అర్థించాడు. అడిగిన వారికి లేదనకుండా ఆతిథ్యం ఇచ్చే ఆ బ్రాహ్మణుడు ఆలోచించాడు. ఉన్నది అతిథికి ఇస్తే తన ప్రాణాలు పోతాయి. ఇవ్వకపోతే ఇన్నాళ్ళు లేదనకుండా ఇచ్చి ఈ రోజు అతిథిని నిరాశపరచినవాడనవుతాను అని ఆలోచించాడు. ఆయన ఇంకా ఏమని ఆలోచించాడంటే. ఒకవేళ నేను అతిథిని నిరాశ పరచి నేను ఆహారం తిన్నా అది ఈ రోజు వరకే. రేపు ఎలాగూ ప్రాణాలు కోల్పోవలసిందే. అందుచేత రేపు పోయే ప్రాణం ఈరోజైనా పోతుంది అంతే కదా! కనీసం ప్రాణం పోయే ముందు ఒక అతిథిని తృప్తి పరచిన వాడినవుతాను అని అనుకుని తాను తిందామనుకున్న ముద్దను అతిథికి ఇచ్చాడు. ఆ అతిథి ఆ ముద్దను తిని నాకు ఇంకా ఆకలి తీరలేదన్నాడు.

అపుడు ఆ కుటుంబ సభ్యులంతా ఆలోచించారు. ఆ బ్రాహ్మణుడిలాగే

ఆలోచించి ఎలాగూ రేపు మనందరి ప్రాణం పోక తప్పదు. అందుచేత ఒక అతిథిని తృప్తిపరుద్దామని చెప్పి, వారు తినే ముద్దలు కూడా అతిథికి ఇచ్చారు. ఆ అతిథి అన్నీ తిని నా ఆకలి తీరింది అని సంతృప్తి చెంది, ఆ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపి వెళ్ళిపోయాడు.

సరిగ్గా అదే సమయంలో ఒక ముంగిస ఆకలితో ఆ ఇంటిలో ప్రవేశించింది. ఆ ఇల్లంతా తిరిగింది. దానికి ఏమీ కనిపించలేదు. చూస్తే ఆ అతిథి తిన్న ఆకులో కొన్ని మెతుకులు కనిపించాయి. ఆకలితో వున్న ఆ ముంగిస వెంటనే వెళ్ళి ఆ మెతుకులు తింది. ఆశ్చర్యం ఆ మెతుకులు తినగానే దాని శరీరం సగం బంగారు వర్ణంలోకి మారిపోయింది.

ఈ పరిణామానికి ముంగిస ఆశ్చర్యపోయింది. అపుడు ఆ ముంగిస "ఇదంతా ఈ బ్రాహ్మణుడు చేసిన దాన మహిమేనని అర్థం చేసుకుంది". ఆ బ్రాహ్మణుడు చేసింది అత్యంత గొప్పదానం అని అర్థం చేసుకుంది. అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

తరువాత ఆ ముంగిసకు ఇంకొక కోరిక కలిగింది. ఇలా సగం శరీరం బంగారు వర్ణంగా వుంటే ఏమి బాగుంది? మొత్తం శరీరమే బంగారంగా మారిపోతే ఎంత బాగుంటుంది? అని అనుకుని ఆ బ్రాహ్మణుని లాగే ఇంకా ఎవరైనా గొప్పగా దానం చేసేవారు వుంటే వారి ఇంటిలో కూడా అలా తిని మిగిలిన శరీరం కూడా బంగారంగా మార్చుకోవాలని భావించింది. దానాలు చేసే వారి ఇళ్ళకు తిరిగింది. అలా చాలా చోట్లకు తిరిగింది కానీ ఆ ముంగిస శరీరం మాత్రం బంగారంగా మారలేదు. ఎక్కడ గొప్పదానాలు జరుగుతున్నాయంటే అక్కడకు వెళ్ళింది కానీ ప్రయోజనం కనబడలేదు.

అలా తిరుగుతూంటే ఎవరో ఆ ముంగిసకు చెప్పారు. ఎందుకు అక్కడికి, ఇక్కడికి తిరుగుతావు. ధర్మరాజుల వారు అందరికంటే గొప్పదానం చేస్తున్నారని అందరూ చెప్పుకుంటున్నారు. నువ్వు కూడా ఒక్కసారి వెళ్ళి ప్రయత్నిస్తే నీ కోరిక నెరవేరవచ్చు కదా? ఒకసారి వెళ్ళి ప్రయత్నించు.. అని సలహా ఇవ్వగానే నేను ఇక్కడికి వచ్చాను. ఎంగిలి ఆకుల్లో మెతుకులు తిన్నాను, దొర్లాను. కానీ నా శరీరం బంగారంగా మారలేదు. అంటే నువ్వు చేసింది గొప్ప దానం కాదని అర్థం చేసుకున్నాను.

మరి చెప్పు ధర్మరాజా... నువ్వు చేసింది గొప్పదానమా? ఆ బ్రాహ్మణుడు చేసింది గొప్పదానమా? అని అడిగింది. ఆ బ్రాహ్మణుడు ఏమి లేకపోయినా! చావడానికి సిద్ధంగా వున్నా! తాను తినే ముద్దను దానం చేశాడు. మరి నువ్వు

చక్రవర్తివి, ఎన్ని దాన, ధర్మాలు చేసినా తరగనటువంటి అపార ధనరాసులు నీ దగ్గర వున్నాయి. అందులో కొంతమాత్రమే నువ్వు దానం చేసావు. అంతా చేసావా? అందుచేత ఆ బ్రాహ్మణుడి దానం ముందు నీది గొప్పదానం ఎలా అవుతుంది? చెప్పు? అని ముంగీస అడిగింది.

అలా అనగానే ధర్మరాజు అర్థం చేసుకున్నాడు. ఆ బ్రాహ్మణుడు చేసిన దానం ముందు తాను చేసింది చాలా తక్కువ అని తెలుసుకున్నాడు. అహంకారంతో గర్విస్తున్న తనకు ఈ రకంగా గుణపాఠం చెప్పబడిందని తెలుసుకున్నాడు. తనకు జ్ఞానోదయం కలిగిచినందుకు ఆ ముంగిసకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఇదంతా శ్రీ కృష్ణుల వారు ఆడించిన నాటకమేనని గ్రహించాడు. శ్రీ కృష్ణుల వారికి నమస్కరించాడు.

దీనిని బట్టి ఈ సృష్టిలో **"ఎంత ఇచ్చాము? అన్నది కాదు, వున్నదాంట్లో ఎంత ఎక్కువ ఇచ్చాము?"** అన్నదే లెక్కించబడుతుంది. అందుచేత దానం చెయ్యడానికి కోట్లే అవసరం లేదు. తన దగ్గర ఎంత వున్నా, దానిలో ఎంత ఎక్కువ ఇచ్చినా అది గొప్పదానమే. ఎందుచేతనంటే చాలా మంది మా దగ్గర ఎక్కువ ధనం లేదు. మేము దానం చేద్దామనుకున్నా చెయ్యలేకపోతున్నాము. వారికి చాలా ధనముంది. అందుకే వారు దానాలు చేస్తున్నారు, పుణ్యకార్యాలు చేస్తున్నారు. మాకు ఆ అదృష్టం లేదు అని బాధపడుతూ వుంటారు. దానం చెయ్యాలంటే ధనమే వుండాలనుకుంటారు. అలా అనుకుని చాలా మంది పుణ్యకార్యాలు చెయ్యడం కోసం ధనం సంపాదించే ప్రయత్నం చేసేవారు కూడా వున్నారు. బాగా సంపాదిస్తే బాగా దానాలు చెయ్యవచ్చని వారు భావిస్తూ వుంటారు.

అలా చాలా మంది పుణ్యం చెయ్యడం కోసమని పాపాలు చేస్తూ సంపాదించేవారు కూడా వున్నారు. ఇది చాలా తెలివి తక్కువ పని. ఎందుచేతనంటే వీరు సంపాదించే పుణ్యం తక్కువ. కానీ సంపాదించడానికి చేసే పాపాలే ఎక్కువ వుంటాయి. ఒకరకంగా పుణ్యం చెయ్యడం కోసం సంపాదించే పాపం వల్ల అంతా నష్టమే జరుగుతుంది తప్ప లాభమే వుండదు.

అందుచేత ఉన్న దానితో సంతృప్తి చెందండి. వున్న దానిలోనే ఇవ్వడానికి ప్రయత్నించండి. తెలుసుకోండి దానాలు చెయ్యడానికి ప్రత్యేకించి సంపాదించవలసిన పని లేదు. మీకు ఈ సృష్టిలో ఇవ్వబడినది చాలు. దాని నుంచే ఎంత ఇవ్వగలరో అంతా ఇవ్వండి. **"సంపాదించి ఎక్కువ ఇవ్వడం కాదు. వున్నదాంట్లో ఎక్కువ ఇవ్వండి"** అదే గొప్పదానమవుతుంది. వేలు వున్నవాడు వందలు ఇచ్చినా ఈ సృష్టిలో కోట్లు ఇచ్చినట్టే లెఖ్ఖ. వాడు భవిష్యత్తులో కచ్చితంగా కోటీశ్వరుడవుతాడు.

ఒకవేళ మీ దగ్గర ధనం లేకపోతే సమయం ఇవ్వండి, వాక్కును ఇవ్వండి, శ్రమను ఇవ్వండి. ఏది ఇచ్చినా ఈ సృష్టిలో మీరు అర్హత సంపాదించుకుంటారు. అంటే కొంత సమయాన్ని లోకకళ్యాణకరమైన పనులకు కేటాయించండి. వాక్కును ఇవ్వాలంటే అందరికీ ధ్యానాన్ని చెప్పండి, జ్ఞానాన్ని అందివ్వండి. అలాగే శ్రమను అంటే ధ్యాన సంబంధమైన కార్యక్రమాలలో పాల్గొనండి. అలాంటి కార్యక్రమాలు చేసే వారికి సహకరించండి. మీరు అంతులేని దానం చేసినవారవుతారు. భవిష్యత్తులో, భవిష్యత్తు జన్మలలో ధనవంతులు కాగలుగుతారు. మీ ఆర్థిక స్థితి బాగా పెరుగుతుంది.

అందుకే అంటారు, **"చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవ!"** అని.

లోకంలో గమనిస్తే మొదట్లో కొంతమందికి ఆర్థిక స్థితి బాగుండదు తక్కువగా వుంటుంది. కానీ తరువాత వారికి అనుకోకుండా కలిసి వస్తుంది. కోటీశ్వరులవుతారు. ఆర్థిక స్థితి అనూహ్యంగా మారిపోతుంది. మరి కొంతమందికి మొదట్లో ఆర్థిక స్థితి చాలా బాగుంటుంది. చాలా ధనవంతులుగా వుంటారు. కానీ మెల్లిగా వారి ఆర్థిక స్థితి మారిపోతుంది. వారి ఐశ్వర్యమంతా కోల్పోతారు. ఇంకా కొంతమంది ఎప్పుడూ ఒకే రకమైన ఆర్థిక స్థితిలో వుంటారు. ఇలాంటివి ఒక్కొక్కసారి అర్థం కావు. సామాన్యంగా ఏమంటారంటే కలిసి వచ్చినవాడిని అదృష్టవంతుడు అంటారు. కలిసి రాని వాడిని దురదృష్టవంతుడు అంటారు. కానీ ఇలా జరగడానికి కారణం లేకపోలేదు. చిన్న ఉదాహరణ చూద్దాం.

పూర్వకాలంలో ధాన్యం నిల్వ వుంచే గాదులలో, అంటే ధాన్యం కొట్టాలలో రకరకాల ధాన్యం నిల్వ వుంచేవారు. ఉదాహరణకు ముందు గాది అడుగున నాసిరకం ధాన్యం పోశారనుకుందాం. తరువాత మంచి రకం నాణ్యమైన ధాన్యం పోశారనుకుందాం. కొన్ని నెలల తరువాత ధాన్యం కోసం మీరు అడుగున వున్న తలుపు తీస్తే.. ముందు నాశిరకం ధాన్యం బయటకు వస్తాయి. కానీ పైన పోసిన మంచి ధాన్యం రావు. నాశిరకం ధాన్యం అయిపోయిన తరువాతే మంచి ధాన్యం వస్తాయి.

అలాగే గతంలో కానీ, గత జన్మలలో కానీ ముందు ఏమీ చేయకుండా తరువాత పుణ్యకార్యాలు చేసారనుకోండి అంటే అందరికీ ధనాన్ని పంచారనుకోండి, అంటే దానం చేసారనుకోండి. ప్రారంభ జీవితంలో ఆర్థికస్థితి తక్కువగా వుంటుంది. తరువాత అనుకోని రీతిలో ధనం పెరుగుతుంది. అంటే ధనవంతులవుతారు. అంతే కానీ ధనం ప్రాప్తించడానికి ప్రస్తుత కృషి, తెలివి, మేధస్సు కాదు. అవి పైకి కనిపించే కారణాలు మాత్రమే. అంతా గతంలో సంపాదించుకున్న అర్హతే. ఎందుచేతనంటే ధనం కోసం రాత్రి, పగలు కష్టపడేవారు, తెలివిని ప్రదర్శించే వారు ఎంతో మంది

వున్నారు. మరి అంతా సంపాదించగలుగుతున్నారా? అందరికీ కలిసి వస్తుందా? అంటే లేదనే చెప్పవచ్చు.

అలాగే గాదులలో ముందు మంచి రకం ధాన్యం పోసి తరువాత నాసిరకం ధాన్యం పోస్తే, మరల తీసుకునేటపుడు ముందు మంచి ధాన్యం వస్తాయి, తరువాత నాసిరకం ధాన్యం వస్తాయి. అలాగే గత జీవితంలో ముందు ధర్మకార్యాలు, దానాలు చేసి వుండి తరువాత చెయ్యకుండా అధర్మంగా, మోసపూరితంగా ప్రవర్తించి వుంటే ప్రారంభంలో ధనవంతులవుతారు. తరువాత సంపాదించినదంతా కోల్పోతారు. వున్న ఆర్థిక స్థితి కోల్పోతారు.

తెలుసుకోండి ఈ సృష్టి నియమాలు గుర్తించక చేసే అధర్మయుక్త పనులే ఆర్థిక ఇబ్బందులకు కారణం.

అందుచేత వున్న దానితో తృప్తి చెందండి, ఆశపడకండి. ఆర్థిక స్థితి బాగుండాలనుకునే వారు గతంలో చేసుకోకపోయినా, కనీసం ఇప్పుడైనా చేసుకోండి. ధనదానం చెయ్యండి. ధర్మకార్యాలు చెయ్యండి. మీకున్న దాంట్లో కొంతైనా ఇవ్వండి. ఉన్న దాంట్లో, ఇవ్వబడిన దాంట్లో కొంత పంచండి. అన్యాయాలు, అక్రమాలు, మోసాలు చెయ్యవద్దు. అధర్మంగా సంపాదించవద్దు.

అందుచేత ఆర్థిక స్థితి పెరగాలంటే ప్రత్యేకమైన కృషి అవసరం లేదు. అర్హత వుంటే చాలు. ప్రస్తుతం లేకపోయినా కనీసం భవిష్యత్తు కోసమైనా అర్హత సంపాదించండి. ఏది కావాలనుకుంటారో అది ఇవ్వండి. ఎక్కువ కావాలనుకుంటే వున్న వాటిల్లో ఎక్కువ ఇవ్వండి చాలు. ముఖ్యంగా సృష్టి ధర్మాన్ని తెలుసుకుని చేసేది చెయ్యండి. వచ్చే దాని గురించి మర్చిపోండి. దీనినే నిష్కామ కర్మ అంటారు. కారణం ఈ సృష్టిలో చేసిందానికి అడగకపోయినా అర్హతని బట్టి వచ్చే తీరుతుంది. సృష్టి నిర్ణయం ప్రకారం ఎప్పుడు రావాలో అప్పుడు ఎలా రావాలో అలా వస్తుంది. వీటన్నిటి కంటే ముందు మనకి పునర్జన్మలు వున్నాయి, కర్మ సిద్ధాంతం ఉందని తెలుసుకోండి.ఆ రెండిటి బట్టే మన జీవితం వుంటుందని తెలుసుకోండి.

ముఖ్యంగా పునర్జన్మలు వున్నాయి కాబట్టి. అంటే మనకు ఇంతకు ముందు కూడా జీవితం వుంది. భవిష్యత్తులోనూ ఇంకొక జీవితం వుంటుంది. అందుచేత ఇదే జీవితం అనుకుంటూ ఇదే ఆఖరు అనుకుంటూ ఆరాటపడవద్దు. నా బ్రతుకు ఇంతేనా అని ఆందోళన చెందవద్దు. వారికి వుంది, నాకు లేదని బాధపడవద్దు. ఆర్థికంగా మనం అనుభవించేవి, అనుభవించాలనుకునేవి అన్నీ ఇంతకు ముందూ వున్నాయి. ఇంకా భవిష్యత్తులో కూడా వస్తాయి. అందుచేత ప్రస్తుతం వున్న స్థితే శాశ్వతం కాదు. నా జీవితం ఇలా వుందే, నా ఆర్థిక స్థితి ఇలా వుందే, దేవుడు

నాకు ఇలా రాసేడే అని బాధపడవద్దు. దాని కోసం పాపాలు చెయ్యవద్దు. సృష్టి నియమాలు ఉల్లంఘించవద్దు.

తెలుసుకోండి మీకు ఏది కావాలన్నా సృష్టి నియమాలు తెలుసుకుని, ఆ నియమాలు ప్రకారం సంపాదించుకోవటానికి ప్రయత్నించండి. నియమాలు ధిక్కరించకండి. ధిక్కరించినా, ఉల్లంఘించినా ఆర్థిక ఇబ్బందుల్లో పడతారని తెలుసుకోండి.

ప్రస్తుతం మీకేం కావాలో ఆలోచించండి. మీకు ధనమే కావాలనుకోండి. ధనం ఎలా వస్తుందో తెలుసుకోండి. ఎందుచేతనంటే ఈ సృష్టిలో ఏదైనా అర్హతను బట్టి వస్తుంది. మరి అర్హత ఎలా వస్తుంది? అంటే **"ఇస్తే వస్తుంది, అంతే కాదు ఏది ఇస్తే అదే వస్తుంది. ఎంత ఇస్తే అంతే వస్తుంది".** అందుచేత ఇవ్వడానికి ప్రయత్నించండి. ఎంత ఎక్కువ ధనం కావాలంటే అంత ఎక్కువ ఇవ్వండి. అవధులు లేకుండా ఇవ్వండి. కారణం **"ఈ సృష్టిలో పంచింది ఎప్పుడూ పెంచబడుతూనే వుంటుంది".**

అలా ఇవ్వడం, పంచడమనే విత్తనాలు నాటి ఎదురు చూడండి. మీ భవిష్యత్తులో, భవిష్యత్తు జన్మలో మీరు తప్పకుండా కోటీశ్వరులు అవుతారు. ఒకవేళ మీ దగ్గర ధనం లేకపోతే మీ దగ్గర వుండే సమయం ఇవ్వండి, వాక్కు ఇవ్వండి, శక్తి ఇవ్వండి, ధ్యానం చెప్పండి, ధ్యానానికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టండి. వాటిలో పాల్గొనండి. అలాంటి వాటికి సహకరించండి. కారణం ధ్యానానికి మించింది. ఈ సృష్టిలో ఏదీ లేదు. అందుకే యోగులంతా ధ్యానం చేసారు. శ్రీ కృష్ణుల వారు కూడా యోగి అవ్వమనే చెప్పారు. అందుచేత అలా చేస్తూ అర్హత సంపాదించుకోండి.

తరువాత మీరేమీ కష్టపడనవసరం లేదు. విత్తనం వృక్షమయ్యాక మీరు కష్టపడనక్కరలేదు. కోసుకుని సుఖించడమే. ఇదే సృష్టి సిద్ధాంతం. తెలుసుకోండి. ఏది కావాలో అలాంటి అర్హత ఈ సృష్టిలో సంపాదించుకోవాలి.

అంతేకానీ అన్యాయంగా ఒకరి సొమ్ము ఆశించకూడదు, అపహరించ కూడదు, లంచాలు ఇవ్వకూడదు, పుచ్చుకోకూడదు, అధర్మంగా వ్యాపారాలు చెయ్యకూడదు, మోసాలు చెయ్యకూడదు. అవి మీ ఆర్థిక పరిస్థితిని పెంచవు సరికదా, మీ ఆర్థిక సమస్యలను పెంచుతాయి. అశాంతిని పెంచుతాయి. తద్వారా దుఃఖం పెరుగుతుంది. తరువాత బాధపడవలసి వస్తుంది. యీ సమస్యలలోంచి బయటపడితే చాలు అనుకుంటారు. విచారించినా ప్రయోజనం వుండదు. అందుచేత ముందే జాగ్రత్తపడండి. **"చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదు".**

ధ్యానం చెయ్యండి. మీ బుద్ధి వికసిస్తుంది. అన్నీ మీకే తెలుస్తాయి.

# అత్యంత ధనవంతులు కావాలంటే?

ఈ ప్రపంచంలో ఎవరిని చూసినా, ఎవరికి వారు కోట్లు సంపాదించాలని చూస్తున్నారు. అలా ఎన్ని కోట్లు సంపాదించినా ఇంకా, ఇంకా అంటూనే వున్నారు. కారణం ఎంత ఎక్కువ సంపాదిస్తే అంత గొప్పవారైనట్టుగా భావిస్తారు. ఏదో కొద్దిగా సంపాదించి వూరుకోవడం లేదు. అలా సంపాదిస్తూ సంపాదించిన దానిని చూసి మురిసిపోతున్నారు. సంపాదించలేని వారు దురదృష్ట వంతులమని భావిస్తున్నారు. అంతేకాదు సంపాదించడం కోసం తప్పులు, పాపాలు చేసే వారు కూడా వున్నారు. కానీ గమనిస్తే ఎవరు ఎంత సంపాదించినా ఇంకా సంపాదించ వలసింది వుంటూనే వుంటుంది. కారణం ఒకరికంటే ధనవంతులు ఇంకొకరు వుంటూనే వుంటారు.

ఇది ప్రస్తుత ప్రపంచ స్థితి. ఎవరూ ఇంతకన్నా ఆలోచించడం లేదు. ఒక రకంగా చూస్తే అందరి ఆరాటం అందరికంటే ధనవంతులు కావాలనే. అందుకే జీవితమంతా కష్టపడుతున్నారు? కానీ గమనిస్తే ఎవరిని చూసినా వారి కోరిక తీరకుండానే ఎప్పుడో ఒకప్పుడు జీవితాన్ని చాలించవలసివస్తుంది. కానీ ఎవరైనా సరే ఈ జీవితంలోనే అందరికంటే ధనవంతులు కావాలనుకుంటే మార్గం వుంది. అదేమిటో తెలుసుకుందాం.

ముందు ఈ విషయం ఆలోచించండి. **"కోట్లు సంపాదించాలా? కోటీశ్వరునకు లైను వెయ్యాలా?"** అంటే తెలివైన అమ్మాయి కోటీశ్వరునికి లైను వెయ్యాలని చెపుతుంది. ఎందుచేతనంటే ఎన్ని సంవత్సరాలు కష్టపడినా, జీవితాంతం కష్టపడినా కోట్లు సంపాదించడం చాలా కష్టం. ఒక్కోసారి సంపాదించ లేకపోవచ్చు కూడా! కానీ తెలివిగా కోటీశ్వరునికి లైను వేసి వాడిని వివాహమాడితే కోట్లు అన్నీ ఆమెవేగా?

అందుచేత ఇలా కోట్లు సంపాదించడానికి జీవితమంతా పాట్లు పడే బదులు ఈ సృష్టిలో అందరికంటే కోటీశ్వరునికి లైనువేసి అంటే ప్రేమించి వారినే పొందితే! వారి కంటే అదృష్టవంతులు వుండరు కదా? మరి ఈ సృష్టిలో అందరికంటే గొప్ప కోటీశ్వరుడు ఎవరు? అంటే ఈ సృష్టిలోనే అందరికంటే గొప్పవాడు, కోటీశ్వరుడు ఒక్కడే ఒక్కడు, ఆయనే "భగవంతుడు". ఆయన కంటే గొప్పవాడు ఈ సృష్టిలో లేనే లేడు. కారణం ఈ సృష్టే ఆయనది. ఈ సృష్టిలోని కోటానుకోట్ల లోకాలన్నీ ఆయనవే. కోటానుకోట్ల లోకాలలోని సంపదలన్నీ ఆయనవే.

ఆఖరుకి ఈ భూమండలం కూడా ఆయనదే. ఈ భూమండలంలోని

సంపదలు అన్నీ ఆయనవే. ఈ విషయం తెలియక, మూర్ఖ మానవులు ఈ భూ మండలంలోని కొద్దిపాటి అత్యల్పమైన భాగం సంపాదించుకుని, నేనే గొప్పవాడినని భావిస్తూ గర్విస్తున్నారు, అహంకరిస్తున్నారు, మురిసిపోతున్నారు. చివరకు అన్నీ వదలి వెళ్ళిపోతున్నారు. మరలా కనిపించడం లేదు.

కానీ వీళ్ళందరి కంటే భగవంతుడే గొప్ప ధనవంతుడు. అందుచేత తెలివైన వారు అలా జీవితమంతా కొద్దిపాటి కోట్లు సంపాదించటానికి ప్రయత్నించరు. జీవితాన్ని వృధా చెయ్యరు. తన జీవితాన్ని అత్యంత గొప్పకోటీశ్వరుడైన భగవంతుని పొందటానికి ప్రయత్నిస్తారు. భగవంతుని ప్రేమిస్తారు. భగవంతునికి లైను వేస్తారు. చివరకు భగవంతుని పొందుతారు. అలా భగవంతుని పొందిన వాడే అదృష్టవంతుడు. వాడిని మించిన వాడు ఈ భూలోకంలో ఎవరూ వుండరు. కారణం భగవంతుని పొందిన వాడు సమస్తమూ పొందినట్టే కదా? అటువంటి వాడు అత్యంత ధనవంతుడేగా?

మరి భగవంతుని పొందాలంటే ఏం చెయ్యాలి? భగవంతునికి ఎలా లైను వెయ్యాలి? అంటే ముందు భగవంతుడు ఎవరో తెలుసుకోవాలి! ఆయన ఎక్కడ వుంటాడో తెలుసుకోవాలి! ఆయనను ఎలా పొందాలో తెలుసుకోవాలి!

తెలుసుకోండి భగవంతుడు ఎవరో కాదు "ఆత్మ". ఈ విషయమే భగవద్గీత 10వ అధ్యాయం 20వ శ్లోకంలో ఆయనే చెప్పడం జరిగింది. మరి ఆత్మ భగవంతుడైనపుడు ఆయన ఎక్కడ వుంటాడు? అంటే ఆయన అందరిలో వుంటానని కూడా చెప్పడం జరిగింది. అందుచేత అందరిలో వున్న భగవంతుడు మనలోనూ వుంటాడని తెలుసుకోవాలి. మరి మనలో వున్న భగవంతుని చేరాలన్నా! పొందాలన్నా! ఏకైక మార్గం 'ధ్యానం'. ఎవరయితే 'ధ్యానం' చేస్తారో వారు భగవంతునే పొందుతారు. అన్నీ పొందినవారవుతారు. వారి కంటే ధనవంతులు, అదృష్టవంతులు ఎవరూ వుండరు. ఎందుచేతనంటే వారు బ్రహ్మానందాన్ని పొందుతారు. అందుచేత కోట్లు వెనకాల పడకండి. 'ధ్యానం' వెనకాల పడండి. భగవంతుని పొందండి, అత్యంత ధనవంతులు కండి, అదృష్టవంతులు కండి.

**"ఏ ధనమైతే నీ జన్మజన్మాంతరాలకు వస్తుందో... అటువంటి ధనాన్ని సంపాదించు. ఎంతో కష్టపడి సంపాదించిన భౌతిక ధనాన్ని ఎవ్వరూ నెత్తిమీద పెట్టుకుని మరణించేటప్పుడు పట్టుకెళ్ళడం నేను చూడలేదు"**

**– కబీరు**

# ఎవరు గొప్ప?

లోకంలో మనం గమనించినట్లయితే ఎవరికి వారు తామే గొప్ప వారమని భావిస్తూ వుంటారు. ఇంకా కొంతమంది తామే అందరికంటే గొప్ప వారమని భావించడమే కాదు గర్విస్తూంటారు కూడా.

అలా గమనిస్తే ఒక్కొక్కరూ ఒక్కో రంగంలో ఉన్నతమైన స్థాయికి ఎదుగుతారు. అలా ఎదిగి తమ క్రింది వారిని, తమ కంటే తక్కువ వారిని చూసుకుంటూ వారందరికంటే తామే ఎంతో గొప్పవారై పోయినట్టు భావిస్తూ; గర్వించడమే కాదు, అహంకారం కూడా ప్రదర్శిస్తూ వుంటారు.

ముఖ్యంగా మనం గమనిస్తే బాగా డబ్బు సంపాదించిన వారు తామే గొప్పవారని భావిస్తూ వుంటారు. అలాగే రాజకీయంగా పదవులు సంపాదించిన వారు కూడా మేమే అందరికంటే గొప్పవారమని విర్రవీగుతూ వుంటారు. అలాగే పెద్ద పెద్ద ఉద్యోగాల్లో, హోదాల్లో వున్నవారు కూడా తామే అధికులమైనట్టు తమ క్రింది వారిపై హోదా, అధికారం, దర్పం ప్రదర్శిస్తూ వుంటారు. గొప్పగా ఫీలవుతూ వుంటారు.

అలాగే సినిమా రంగంలో ఎదిగిన వారిని చూసినా, ఆటలలో మెడల్సు సాధించినా, నేనే గొప్పవాడినని పొంగిపోతారు. అంతేకాదు అందగత్తెలైనా, సంగీతంలో విద్వాంసులైనా, నేనే గొప్పదానిననుకుంటూ పొంగిపోతూ వుంటారు.

ఇంకా కొంతమంది ఉపన్యాసాలు చెబుతూ, బోధలు చేస్తూ వినేవారందరిని చూసి... వారందరికంటే మేమే గొప్పవారమనుకుంటారు. ఇంకా కొంతమంది తాము గురువులమనుకుంటూ, తామే గొప్పవారమనుకుంటూ అందరిచేతా పాదాభివందనాలు, పాదపూజలు చేయించుకుంటారు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో వుంటాయి. అంతెందుకు చాలా మంది ఏ చిన్న పని చేసినా, ఏ చిన్న కార్యం చేసినా, ఏమి సాధించినా తామే చేసామని, తామే సాధించామని అందరి వద్దా గొప్పగా చెప్పుకుంటారు. ఇంకా చూస్తే ఎవరి వద్ద చెప్పకపోయినా భార్యల వద్ద భర్తలు, భర్తల దగ్గర భార్యలు తమ గొప్పలు చెప్పుకుంటూ గొప్పవారమైనట్టు భావిస్తూ వుంటారు. అలా చూస్తే ఇంచుమించు అంతా గొప్పవారిగా భావించే వారే కనిపిస్తారు. ఆలోచించండి అసలు ఇంతకీ ఎవరు గొప్పవారు?

కానీ తెలుసుకోండి వీరే కాదు. భగవంతుని సృష్టిలో అన్నీ గొప్పవే,

అందరూ గొప్పవారే! అసలు సృష్టిలో గొప్పది కానిదేముంది? భగవంతుని సృష్టిలో ప్రతీదీ గొప్పదే! ప్రతీది విశిష్ఠమైనదే! దేని విశిష్ఠత దానిది. దేని ప్రత్యేకత దానిది. కారణం దేని విలువ దానికి వుంటుంది. ఎందుచేతనంటే ఏది లేకపోయినా వెలితే, లోటే.

చూడండి యజమాని పనివారి చేత పని చేయించుకుంటూ తానే గొప్పవాడిననుకుంటాడు. కానీ ఆ పని వారే లేకపోతే యజమాని పరిస్థితి ఏమిటి? అలాగే భార్య చేత పనులు చేయించుకుంటూ, అన్నీ పురమాయిస్తూ భార్యపై పెత్తనం చేస్తూ... భర్త తాను గొప్పవాడిననుకుంటాడు. కానీ భార్య లేకపోతే భర్త పరిస్థితి ఏమిటి?

అలాగే ఏదైనా ఒక ఆఫీసులో చూడండి! ఆఫీసరు దగ్గర జవానులు, క్లర్కులు వుంటారు. కానీ అక్కడ ఆఫీసరే గొప్పవాడిగా కనిపిస్తాడు. కానీ జవానులు లేకపోయినా, క్లర్కులు లేకపోయినా ఆఫీసరు ఏమి చేయగలడు? ఆఫీసులో పని అవ్వాలంటే అందరూ అవసరమే. ఎవరు లేకపోయినా ఆఫీసు నడవదు. అందచేత అందరూ గొప్పవారే. ఎవరి విశిష్ఠత వారికి వుంది. ఎవరి పని వారిది. అన్నీ అవసరమే! అన్నీ ముఖ్యమే! ఏది లేకపోయినా ఇబ్బందే!

అందుచేత అన్నీ గొప్పవే. అసలు భగవంతుని సృష్టిలో గొప్పతనం లేనిది ఏది? పనికి రానిది ఏది? ఈ సృష్టిలో పనికి రానిదంటూ ఏదీ వుండదు. ఆఖరికి జంతువులే కాదు, పక్షులే కాదు. క్రిమికీటకాలు కూడా సృష్టిలో, సృష్టికి అవసరమైన ఏదో ఒక కార్యం నిర్వర్తిస్తున్నాయి. వేటికి అవి వాటి కార్యం నిర్వర్తిస్తున్నాయి. అందుకే ఈ సృష్టి అలా కోట్లాది సంవత్సరాలుగా అనంతంగా కొనసాగుతుంది.

చిన్న ఉదాహరణ చూద్దాం. చాలా మందికి గొంగళి పురుగులన్నా, రోకలి బండలన్నా అసహ్యం. వాటిని చూడగానే వారికి చిరాకు. ఒక్కోసారి కొంతమంది భగవంతుడు వాటిని ఎందుకు సృష్టించాడు? అని కూడా అనుకుంటారు. కొంతమంది అవి కనపడగానే చంపేస్తారు కూడా! వీరు అంతకన్నా ఆలోచించరు. ఎందుచేతనంటే అవి చూడటానికి అసహ్యంగా వుండటమే కాదు ఆకులు తింటూ, మొక్కలను, చెట్లను నాశనం చేస్తూ వుంటాయి. అందుచేత చూడటానికి అవి పాడు చేసేవిగా కనిపిస్తాయి. కానీ చూడండి... అంత అసహ్యంగా వుండే గొంగళీపురుగు కొన్నాళ్లకు అన్నిటిని ధ్వంసం చెయ్యడం మాని ఒక గూడు కట్టుకుని అందులోనే కొన్నాళ్ళు వుండి, మెల్లిగా అందమైన

సీతాకోకచిలుకలా మారిపోతుంది. ఇంచక్కా అందంగా ఎగురుతూ వుంటుంది. చూడటానికి ఎంతో అందంగా వుంటుంది. చూసేవారికి ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. గొంగళీపురుగును అసహ్యించుకున్నవారే సీతాకోకచిలుకను చూసి ఆనందపడతారు, సంబరపడతారు. అంతేకాదు ఆ సీతాకోకచిలుక చేసే పని గురించి తెలుసుకుంటే ఎవరూ గొంగళీ పురుగును అసహ్యించుకోరు, భగవంతుణ్ణి నిందించరు.

చూడండి ఆ సీతాకోక చిలుక ఒక పుష్పం నుంచి ఇంకొక పుష్పం మీదకి ఎగురుతూ వుంటుంది. అలా ఎగురుతూ తన కాళ్ళతో, రెక్కలతో ఆ పుష్పంలోని పుప్పొడిని ఇంకొక పుష్పానికి చేరవేస్తుంది. అలా చేయడం వల్ల 'పరపరాగ సంపర్కం' జరిగి, ఆ పుష్పాలు కాయలుగా, పళ్ళుగా మారతాయి. ఆ పళ్ళనే మనం ఇష్టంగా ఆరగిస్తున్నాం, ఆకలి తీర్చుకుంటున్నాం.

తెలుసుకోండి. గొంగళీపురుగే లేకపోతే, సీతాకోక చిలుకే వుండదు. సీతాకోక చిలుకే లేకపోతే పుష్పాలలో పరపరాగ సంపర్కమే జరుగదు. పరపరాగ సంపర్కమే జరగకపోతే మనకు కాయలు, పళ్ళు దొరకవు. ఆ కాయలు, పళ్ళే దొరకకపోతే మానవులే కాదు. ఎన్నో జంతువుల ఆకలి తీరదు. వీరి ఆకలే తీరకపోతే చివరకు వారంతా మరణించవలసిందే కదా? అలా అంతా మరణిస్తే ఈ సృష్టి ఏమవుతుంది? అసలు మానవుడి పరిస్థితి ఏమిటి? అందుచేత తెలుసుకోండి! గొంగళీపురుగు అసహ్యంగా వుందని చంపడం కాదు. అది మనకు చేసే ఉపకారాన్ని తెలుసుకుని భగవంతునికి మనం కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఎందుచేతనంటే అవి లేకపోతే మనమే వుండం కనుక.

అంతేకాదు గొంగళీపురుగు నుంచి మరొక సందేశం కూడా మనం తీసుకోవచ్చు. చూడండి గొంగళి పురుగు ఆకుల్ని తింటూ! మొక్కల్ని నాశనం చేస్తూ! మనకు నష్టం కలిగిస్తున్నట్టుగా కనిపిస్తుంది. అలాంటి గొంగళీపురుగు సహజంగానే మనకు అసహ్యం కలిగిస్తుంది. కానీ కొంచెం ఓపికపడితే ఆ గొంగళీపురుగు మెల్లిగా విధ్వంసాన్ని మానేస్తుంది. ఎక్కడో ఒక చోట కదలకుండా వుండిపోతుంది. తన చుట్టూగూడు కట్టుకుంటుంది. కొన్ని రోజులలో మెల్లిగా అందమైన సీతాకోకచిలుకలా పరివర్తన చెందుతుంది. అలా సీతాకోక చిలుకలా మారినప్పటి నుంచి దేనిని పాడుచెయ్యదు. పైగా లోకానికి ఉపయోగపడే కార్యమే చేస్తుంది. అందరికీ ఆనందాన్ని కలిగిస్తుంది.

అలాగే మానవుడు కూడా మొదట్లో అంటే ప్రారంభ జన్మలలో

చెయ్యకూడని పనులు చేస్తాడు. తన స్వార్థం కోసం అందరినీ హింసిస్తాడు, నష్టపరుస్తాడు, కష్టాల పాలు చేస్తాడు. మానవులకే కాదు, జంతువులకు, పక్షులకు కూడా హాని చేస్తాడు. వాటిని క్రూరంగా హింసిస్తాడు, చంపుతాడు, వాటి మాంసం భక్షిస్తాడు. ఎంతసేపూ తిండికోసమే అన్నట్టు జీవిస్తాడు. ఎవరికీ ఉపయోగపడడు, మేలు చెయ్యడు. అందరూ అసహ్యించుకునేలా ప్రవర్తిస్తాడు. అందరూ అసహ్యించుకుంటారు కూడా. వాడిని చూసి అందరూ భాధపడతారు, భయపడతారు, దూరంగా పారిపోతారు కూడా.

అలా కొన్ని జన్మలు అయిన తరువాత తన తప్పులు తెలుసుకుంటాడు, ఇక తప్పులు చెయ్యడు, అటు ఇటు తిరగడు, ఏదో ఒక గురువును ఆశ్రయిస్తాడు. ఆయన సలహాతో కదలకుండా ఒక చోట కూర్చుని 'ధ్యానం' చేస్తాడు. అలా 'ధ్యానం' చెయ్యగానే కొన్నాళ్ళకు వాడిలో తెలియని మార్పు వస్తుంది. అంతర్గతంగా పరివర్తన చెందుతాడు. మంచి గుణాలతో యోగిలా బయటకు వస్తాడు. అలా వచ్చినప్పటి నుండి ఎవరికీ హాని చెయ్యడు. ఎవరికి నష్టాన్ని, కష్టాన్ని కలిగించడు. పైగా అందరికీ వుపయోగపడే పనులు, కార్యాలు చేస్తాడు. అందరికీ ఆనందం కలిగిస్తాడు. ఆఖరికి జంతువులను, పక్షలను కూడా ప్రేమిస్తాడు, వేటిని చంపడు, హింసించడు, మాంసాన్ని భక్షించడు. అటువంటి వారిని చూసి అందరూ ఆనందపడతారు. ఆయన దగ్గర చేరి సలహాలు అడుగుతారు. ఆయనను చూసి ఆనందపరవశులు అవుతారు.

అలా హాని చేస్తూ అసహ్యంగా కనిపించే గొంగళీ పురుగు సీతాకోకచిలుకలా మారి లోకానికి ఎలా ఉపకారం చేస్తుందో? ప్రస్తుతం అపకారం చేసే వారంతా ఎప్పుడో ఒకప్పుడు ఉపకారం చేసేవారే... తప్పనిసరిగా మార్పు చెందేవారే... అందుచేతే ఎవరినీ ద్వేషించకూడదు. ఇంకా వారిలో మార్పు రాలేదని తెలుసుకోవాలి. తప్పనిసరిగా వారు కూడా సీతాకోకచిలుకలా మార్పు చెందుతానని తెలుసుకోవాలి.

చూడండి గొంగళీపురుగు నుంచి ఎంత సందేశం తీసుకోవచ్చో. పేరుకు గొంగళీపురుగు అయినా అది లోకానికి, మానవులకు ఎంత ఉపకారం చేస్తుందో? మానవులకు ఎంత సందేశం ఇస్తుందో? ఆలోచించండి. గొంగళీపురుగు పనికి రానిదా? ఉపయోగం లేనిదా? విశిష్ఠత లేనిదా? గొప్పది కాదా? అంటే దాని గొప్పతనం దానిది? అందుచేత తెలుసుకోండి! అందరూ గొప్పవారే ఎవరి గొప్పతనం వారిది! ఈ సృష్టిలో ఏది లేకపోయినా, ఎవరు లేకపోయినా

సృష్టిలోలోటే.

మనం గమనిస్తే ఈ సృష్టిలో కొన్ని వస్తువులు పనికి రానివిగా, విలువ లేనివిగా కనిపిస్తాయి. ఉదాహరణకు ఒక గుండు సూదినే తీసుకోండి. లేకపోతే సూదిని కానీ, పేపర్ వెయిట్‌ను కానీ, ఆఖరుకు చిన్న బటన్‌ను కానీ తీసుకోండి, లేదా స్క్రూడ్రైవర్‌ను తీసుకోండి. ఒక కటింగ్ ప్లేయర్‌ను తీసుకోండి, చిన్న చాకును తీసుకోండి. ఇవన్నీ చూడటానికి పెద్ద ప్రాముఖ్యం లేనివిగా కనిపిస్తాయి, విలువలేనివిగా కనిపిస్తాయి. వాటి కంటే పెద్ద, పెద్ద మిషన్లు, ఎ/సి.లు, ఫ్రిజ్‌లు, టి.వి.లు, మిక్సీలు విలువైనవిగా అనిపిస్తాయి. కానీ వీటి కంటే కూడా విలువలేనివిగా కనిపించేవే ఎంతో ఉపయోగపడతాయి. ఒక్కొక్కసారి అవి లేకపోతే ఎంత ఇప్పంది పడతామో! ఎన్ని పాట్లు పడతామో! అందుచేత ఈ సృష్టిలో ప్రతీదీ విలువైనదని తెలుసుకోవాలి. కారణం విలువ లేనిది, ప్రయోజనం లేనిది ఈ సృష్టిలో భగవంతునిచే సృష్టింపబడదు.

అందుచేత నేను గొప్ప, నేను గొప్ప అని భావించవద్దు. గర్వించవద్దు. అహంకరించవద్దు. అందరూ గొప్పవారేనని తెలుసుకోవాలి. ప్రతి ఒక్కరిలో గొప్పతనం వుందని తెలుసుకోవాలి.

## "పండితుడు – పడవ వాడు"

నాకు తెలియదు నాయనా అన్నాడు. అలా అయితే ఇప్పుడు మీరు, మీ మొత్తం జీవితాన్నే వృధా చేసుకున్నారు బాబయ్యా అంటూ నదిలోకి దూకి ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. విపరీతమైన గాలికి ఆ పడవ తలక్రిందులవ్వడం వల్ల పండితుడు ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది.

దీనిని బట్టి ఎవరు గొప్పవారు చెప్పండి? గొప్పవాడిననుకునే పండితుడు ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది. తక్కువ వాడైన పడవవాడు ప్రాణాలతో బయటపడ్డాడు. అందుచేత తెలుసుకోండి అందరూ గొప్పవారే! ఈ సృష్టిలో ఒక్కొక్కరిలో ఒక్కో రకమైన గొప్పతనం వుంటుంది. ఎవరి గొప్పతనం వారిది. నేనే గొప్ప అని చెప్పుకోవడానికి గర్వించడానికి ఏమీ లేదు.

మరి ఇంతకీ ఈ సృష్టిలో ఎవరు గొప్ప? ఇది తెలుసుకోవాలంటే ముఖ్యంగా ఇది ఆలోచించాలి. ఇంతకీ వీరందరికీ ఈ గొప్పతనం ఎలా వచ్చిందో తెలుసుకోవాలి. చూడండి సంగీత విద్వాంసుడు ఎవరి వల్ల పాడగలుగుతున్నాడు? పండితుడు ఎవరి వల్ల మాట్లాడగలుగుతున్నాడు? వ్యాపారస్తుడు ఎవరి వల్ల ధనం సంపాదించ గలుగుతున్నాడు? రాజకీయ నాయకుడు ఎవరి వల్ల తన మేధస్సును ప్రదర్శించ గలుగుతున్నాడు? అలాగే ఎవరి వల్ల సినిమాలో నటులు, నటీమణులు తమ నైపుణ్యం ప్రదర్శించ గలుగుతున్నారు? ఆటలు ఆడేవారు కానీ, ఇంక ఏ రంగంలోనైనా కానీ, వారు ఎవరి వల్ల తమ నైపుణ్యాన్ని ప్రదర్శించగలుగుతున్నారు? ఇలా ఆలోచించుకుంటూ పోతే వీరందరికీ ఈ గొప్పతనం ఎలా వచ్చింది? ఎవరి వల్ల వీరు ఇవన్నీ ప్రదర్శించి గొప్పవారినని చెప్పుకోగలుగుతున్నారు? ముఖ్యంగా ముందు ఇది ఆలోచించాలి.

తెలుసుకోండి ఎవరివల్ల నయితే వీరంతా ఇవన్నీ చెయ్యగలుగుతున్నారో! వారే గొప్పవారు. మరి వీటన్నిటికీ కారణం ఎవరు? అంటే ఆయన ఒక్కడే ఒక్కడు. ఆయనే 'భగవంతుడు'. అంటే 'ఆత్మ'. అంటే 'ఆత్మ' వల్లే వీరంతా యీ గొప్పతనాన్ని సాధించగలుగుతున్నారు, ప్రదర్శించ గలుగుతున్నారు. 'ఆత్మే' లేకపోతే అంటే 'భగవంతుడే' లేకపోతే వీరంతా ఏమీ చెయ్యలేరు సరికదా! అసలు వీరి ఉనికే కోల్పోతారు, చివరకు అదృశ్యమై పోతారు. అంటే వీరి వైభవమంతా 'ఆత్మ' ఉన్నంతసేపే అంటే వీరి గొప్పతనమంతా 'ఆత్మ'వల్లేనని తెలుసుకోవాలి.

ఎందుచేతనంటే 'ఆత్మ' లేకపోతే శరీరం శవమైపోతుంది. కళ్ళు చూడలేవు, చెవులు వినలేవు, నోరు మాట్లాడలేదు, చర్మం స్పర్శించలేదు, కాళ్ళు నడవలేవు, చేతులు పని చెయ్యవు. అంటే ఇవన్నీ పని చెయ్యటానికి కారణం 'ఆత్మ'. అంటే

'ఆత్మ' వుంటే ఇవన్నీ పని చెయ్యగలవు, తమ నైపుణ్యాన్ని ప్రదర్శించగలవు, గొప్పతనాన్ని సాధించగలవు. అందుచేత అన్నిటికీ గొప్పతనాన్ని ఇచ్చింది 'ఆత్మ' అంటే 'భగవంతుడు' అని తెలుసుకోవాలి. అందుచేత 'ఆత్మే' అంటే 'భగవంతుడే' అందరి కంటే గొప్పవాడు అని తెలుసుకోవాలి.

ఎందుచేతనంటే 'ఆత్మ' లేకపోతే సంగీత విద్వాంసుడు పాడలేదు, పండితుడు మాట్లాడలేడు, మానవుడు తన శరీర సౌష్ఠవాన్ని నిమిషాలలో కోల్పోతాడు, ధనవంతుడు సంపాదించలేడు, రాజకీయ నాయకుడు తన చాతుర్యాన్ని ప్రదర్శించలేడు, బలవంతుడు తన బలాన్ని ప్రదర్శించలేడు. ఇంతెందుకు 'ఆత్మ' లేకపోతే ఎవరూ ఏమీ చెయ్యలేరు, గొప్పతనాన్ని సాధించలేరు. దీనిని బట్టి గొప్పతనమంతా వీళ్ళలో లేదు, ఆత్మలోనే వుంది. అంటే భగవంతునిలోనే వుంది. అందుచేత ఈ సృష్టిలో ఎవరు గొప్పవారంటే 'భగవంతుడే' గొప్పవాడు అని తెలుసుకోవాలి.

అలా 'ఆత్మ' యొక్క గొప్పతనాన్ని తెలియ చెప్పటానికే పురాణాలలో ఒక కథ ఇవ్వబడింది. ఒకసారి మనిషిలోని భాగాలన్నీ తగువులాడుకున్నాయట! కన్ను, చెవి, నోరు, కాళ్ళు, చేతులు అన్నీ నేను గొప్ప అంటే నేను గొప్ప అని తగవులాడుకుని ఎవరు గొప్పో తేలక చివరకు అన్నీ కలిసి స్వర్గానికి అధిపతి అయిన ఇంద్రుని దగ్గరకు వెళ్ళాయట. మాలో ఎవరు గొప్పవారో చెప్పమన్నాయట. అపుడు ఇంద్రుడు ఎవరు లేకపోతే శరీరం మనుగడ సాగించలేదో వారే గొప్పవారని అన్నాడట.

అప్పుడు కాళ్ళు నేను లేకపోతే శరీరం మనుగడ సాధించలేదు, శరీరం ఉండలేదు. మీరందరూ ఇబ్బంది పడిపోతారు, మీకందరికీ మనుగడ లేదు అని అందట. అనడమే కాదు శరీరాన్ని వదలి వెళ్ళిపోయాయట. అలా వెళ్ళి సంవత్సరం తరువాత వచ్చి చూస్తే దేహంతో పాటు అన్నీ మామూలుగానే పని చేస్తున్నాయట. వాటిని చూసి కాళ్ళు భంగపడ్డాయట.

అపుడు కళ్ళు నేను లేకపోతేనే దేహం ఏమీ చెయ్యలేదు, నేనే గొప్పదాన్ని అంటూ వెళ్ళిపోయాయి. మరల సంవత్సరం తరువాత తిరిగి వచ్చాయట. కానీ దేహం మామూలుగానే వుందట. అపుడు కళ్ళు భంగపడ్డాయట. అలా ఒకరి తరువాత ఒకరు వెళ్ళిపోయినా శరీరానికి ఏమీ కాలేదు. చివరకు అన్నీ భంగపడ్డాయి. అపుడు 'ఆత్మ' బయటకు వెళ్ళిందట. వెంటనే శరీరం శవమై పోయింది. అపుడు అన్నీ స్తంభించి పోయాయి. ఏదీ ఏమీ చెయ్యలేకపోయాయి.

అన్నీ అచేతనమైపోయాయి. అపుడు మరల 'ఆత్మ' తిరిగి వచ్చిందట. వెంటనే అన్నీ మామూలుగా పని చెయ్యడం మొదలు పెట్టాయి. అపుడు వాటన్నిటికీ అర్థమయ్యింది 'ఆత్మే' అన్నిటికంటే గొప్పదని.

అందుచేత తెలుసుకోండి 'ఆత్మే' అన్నిటికంటే గొప్పది. 'ఆత్మ' లేకపోతే ఏదీ ఏమీ చెయ్యలేవు. ఏదీ ఏ గొప్ప కార్యం చెయ్యలేవు. అందుచేత మానవ ఇంద్రియాలతో ఎవరు ఏమి సాధించినా అది వారి గొప్పతనం కాదు. అది 'ఆత్మ' గొప్పతనం మాత్రమే. అంటే 'భగవంతుని' గొప్పతనమే. అందుచేత అందరి కంటే భగవంతుడే గొప్పవాడని తెలుసుకోవాలి.

ఈ విషయాన్నే 'గురుగీత' ద్వారా కూడా చెప్పడం జరిగింది. పరమశివుడు ఎప్పుడూ ధ్యాన స్థితిలో వుండడం పార్వతీదేవికి ఆశ్చర్యం కలిగించిందట. కారణం అందరూ శివుణ్ణి ధ్యానిస్తుంటే మరి ఈయన ఎవరిని ధ్యానిస్తున్నారు? అన్న సందేహంతో పరమశివుణ్ణే ఒకసారి ఆమె అడిగిందట. నాథా! అందరూ మిమ్మల్ని ధ్యానిస్తుంటే మీరు ఎవరిని ధ్యానిస్తున్నారు?

అపుడు శివుడు పార్వతీ! మీ అందరికి నేనే గొప్పవాడినని తెలుసు. కానీ నాకంటే గొప్పవాడు ఒకడు వున్నాడు. ఆయననే నేను ధ్యానిస్తున్నాను. నేనే కాదు, సకల దేవతలు, మానవులే కాదు, ఎవరైనా సరే ఆయననే ధ్యానించాలి అని చెప్పి ఆయనను ఎలా ధ్యానించాలో పార్వతీదేవికి చెప్పడమే కాదు. ధ్యానం యొక్క గొప్పతనాన్ని పరమశివుడు వివరించాడు. దీనిని బట్టి దేవుళ్ళకే దేవుడు ఒకడు వున్నాడని తెలుసుకోవాలి. ఆయనే ముస్లింలు అల్లా అని పిలుస్తారు, క్రిస్టియన్లు తండ్రీ అని పిలుస్తారు. హిందువులు పరమాత్మ, పరమేశ్వరుడు, విశ్వాత్మ, లలితాదేవి, ఆదిపరాశక్తి, భగవంతుడు అని రకరకాల పేర్లతో పిలుచుకుంటారు. ఆయనే ఈ సృష్టిలో అందరికంటే గొప్పవాడని ఆయనను ధ్యానించాలని తెలుసుకోవాలి. దీనిని బట్టి 'ధ్యానం' ఎంత గొప్పదో తెలుసుకోవాలి.

అంతేకాదు 'భగవంతుని' గొప్పతనం ఉపనిషత్తులలో కూడా చెప్పబడింది. పూర్వం ఒకసారి దేవతలు రాక్షసుల మీద విజయం సాధించి, విజయగర్వంతో మేమే గొప్పవారమని విర్రవీగుతూంటే భగవంతుడు వారికి బుద్ధి చెప్పాలని నిశ్చయించుకొని దేవతలు సభ జరుపుకుంటుండగా ఒక యక్షుని రూపంలో వారి ముందు ప్రత్యక్షమయ్యాడు.

ఆ యక్షుని రూపం, తేజస్సు చూసి దేవతలంతా ఆశ్చర్యపోయారు. ఈయనను మనమెప్పుడూ చూడలేదే? అసలు ఈయన ఎవరు? అని తమలో

తాము చర్చించుకున్నారు. కానీ ఆయన ఎవరో వారెవరికీ అంతుబట్టలేదు. అపుడు వారందరూ కలిసి 'వరుణుని' ఆయనెవరో తెలుసుకుని రమ్మని పంపించారట.

అపుడు వరుణ దేవుడు ఆ యక్షుని వద్దకు వెళ్ళి "మహానుభావా! తమరు ఎవరు? మా దేవతల సభ వద్దకు ఎందుకు వచ్చారు? అని అడిగాడు. అపుడు ఆ యక్షుడు ఇంతకీ నువ్వెవరు? అన్నాడట. అపుడు వరుణ దేవుడు నేను వరుణుడను, ఈ లోకాలకు నీటిని ఇస్తాను. నేను తలచుకుంటే లోకాలను నీటితో ముంచెత్తి నాశనం చెయ్యగలను అన్నాడట.

అపుడు యక్షుడు ఒక గడ్డిపరకను వరుణుని ముందు వుంచి, దీనిని నాశనం చెయ్యమన్నాడట. అపుడు వరుణుడు తన శక్తినంతా ప్రయోగించాడు. కానీ ఆ గడ్డి పరకను ఏమీ చెయ్యలేకపోయాడట. వరుణునకు ముచ్చెమటలు పోశాయి. మూడు లోకాలను ముంచెత్తగల నేను ఒక గడ్డిపరకను ఏమీ చెయ్యలేకపోయానే? అని భయపడి పారిపోయాడట.

అపుడు దేవతలు 'అగ్ని దేవుణ్ణి' పంపించారట. అపుడు అగ్ని కూడా స్వామీ మీరు ఎవరు? అని అనగానే ఆ యక్షుడు ఇంతకీ నువ్వెవరు? అన్నాడట. అపుడు అగ్ని దేవుడు నేను అగ్నిని. నేను తలచుకుంటే దేనినైనా భస్మీపటలం చేస్తానని అన్నాడట. అపుడు యక్షుడు మరల గడ్డి పరకను వుంచి దాన్ని భస్మం చెయ్యమన్నాడట. అపుడు అగ్నిదేవుడు తన శక్తినంతా ఉపయోగించినా గడ్డిపరకను ఏమీ చెయ్యలేకపోయాడట. అపుడు అగ్నిదేవుడు కూడా భయపడి పారిపోయాడట.

ఈసారి దేవతలు వాయు దేవుణ్ణి పంపించారు. కానీ వాయుదేవుడు కూడా అలాగే భంగపడి పారిపోయాడు. అది చూసి దేవతలంతా ఆశ్చర్యపోయారు. అపుడు దేవతలంతా కలిసి ఇంద్రుణ్ణే వెళ్ళమన్నారట. ఇంద్రుడు యక్షుని వద్దకు వెడుతుండగా యక్షుడు అక్కడి నుండి అదృశ్యమైపోయాడు. అపుడు ఇంద్రుడు ఆశ్చర్యచకితుడై వుండగా అక్కడ పార్వతీదేవి ప్రత్యక్షమైంది. అపుడు ఇంద్రుడు ఆమెకు నమస్కరించి, జరిగినదంతా చెప్పి ఇంతకీ ఆయన ఎవరు? అని అడిగాడట.

అపుడు పార్వతీదేవి ఆయన ఎవరో కాదు ఈ సృష్టికి మూలకారకుడు, ఈ సృష్టిని సృష్టి చేసిన వాడు, ఈ సృష్టిని నడిపిస్తున్నవాడు, ఈ సృష్టికి, సృష్టిలోని సమస్త జీవరాసికి, అన్నిటికి ఆధారమైన 'భగవంతుడు' అని చెప్పి, ఆయన వల్లే ఈ సృష్టి, సృష్టిలోని జీవులు మనుగడ సాగించగలుగుతున్నాయి. ఆయన వల్లే దేవతలైన మీరు, దేవుళ్ళమైన మేము ఈ శక్తులు ప్రదర్శించగలుగుతున్నాం.

ఆయన లేకపోతే సమస్త చరాచర సృష్టి స్తంభించిపోతుంది, అదృశ్యమైపోతుంది. ఇది తెలియక మీరు రాక్షసుల మీద విజయం సాధించామని, అంతా మీ గొప్పతనమేనని, మేమే శక్తివంతులమని విర్రవీగుతుంటే! మీకు బుద్ధి చెప్పడానికి ఆయన యక్షుని రూపంలో ప్రత్యక్షమై మీ శక్తి ఏమిటో మీకు తెలియ చేశారు. ఆయన శక్తి మీలో లేకపోతే మీరు కనీసం గడ్డి పరకను కూడా కదల్చలేక పోయారు కదా? ఏమీ చెయ్యలేకపోయారు కదా? ఇది మీకు అనుభవపూర్వకంగా ఆయన తెలియ చెప్పారని పార్వతిదేవి చెప్పడం జరిగింది.

అప్పుడు ఇంద్రుడు తమ శక్తి ఏమిటో తెలుసుకున్నాడు. తాము గర్వించిన దానికి సిగ్గుపడి, పార్వతీదేవికి నమస్కరించగానే ఆమె అంతర్థానమైంది.

దీనిని బట్టి దేవతలే కాదు మనమైనా సరే ఆఖరికి సమస్త జీవరాసి అయినా సరే భగవంతుడు అంటే 'ఆత్మ' లేకపోతే ఏమీ చెయ్యలేరని, ఏ నైపుణ్యాన్ని ప్రదర్శించలేరని, ఏమీ సాధించలేరని తెలుసుకోవాలి. మన గొప్పతనమంతా భగవంతుని వల్లేనని అంటే ఆత్మ వల్లేనని తెలుసుకోవాలి. దేనికి విర్రవీగకూడదు, గర్వించకూడదు, అహంకారంతో వ్యవహరించకూడదు. అసలు భగవంతుడు లేకపోతే 'నేను' అనేదే లేదని తెలుసుకోవాలి. అంతెందుకు 'నేను' అని కూడా అనలేము. అంటే కనీసం 'నేను' అనే శక్తి కూడా మనకు లేదు. అందుచేత అంతా భగవంతుడే, అన్నీ భగవంతుడేనని తెలుసుకోవాలి.

పై వాటిని బట్టి లోకంలో ఎవరూ గొప్పవారు కాదని తెలుసుకోవాలి. ఎవరూ విర్రవీగకూడదు, గర్వించకూడదు. నేను అని అహంకారంతో వ్యవహరించకూడదు. చివరకు నేను గొప్పకాదు, అసలు నేను అన్నదే లేదు, నాది అన్నది కూడా లేదని తెలుసుకోవాలి. ఇది తెలుసుకున్నవాడే గొప్పవాడు. అలా ఎవరైతే తెలుసుకుంటారో వారికి ఇక జన్మలేదు.

మరి ఇది తెలుసుకోవాలంటే ముఖ్యంగా 'ధ్యానం' చెయ్యాలి. 'ధ్యానం' చేస్తేనే ఇదంతా తెలుస్తుంది. అందుచేత ఒకరకంగా 'ధ్యానం' చేసేవాడే మానవులందరి కంటే గొప్పవాడు.

అందుకే పత్రిగారు **"ధ్యానం సత్యజ్ఞాన ప్రసాదిని"** అంటారు.

**కబీరు అంటున్నాడు:" నేను ఆత్మతత్త్వం గురించి ఆలోచిస్తున్నాను. అందరిలోనూ ఒకే పరమాత్మ ఉన్నప్పుడు ఎవరు పండితులు? ఎవరు యోగి? ఎవర్ని రాజు అంటావు? ఎవరిని పేద అంటావు? ఎవరు వైద్యుడు? ఎవరు రోగి? ఈ అందరిలోనూ ఒకే బ్రహ్మ తత్వం వుంది. ఆత్మ ఆత్మతో ఆడుకుంటోంది. ఆడించేది ఆత్మే. అనేక రకాలైన శరీర నిర్మాణం చేసి అనేక రూపాలలో ఆత్మ పదార్థము విరాజిల్లుతోంది. నేను ప్రపంచమంతా తిరిగాను నిర్గుణ తత్త్వాన్ని ఎవ్వరూ చెప్పటం లేదు.**

# గొప్పల కోసం తప్పులు

లోకంలో చాలా గొప్పగా వుండాలని భావించే వారే ఎక్కువగా కనిపిస్తారు. తామే అందరి కంటే గొప్పగా వుండాలని, అందరిలోను గొప్పగా అనిపించుకోవాలని తాపత్రయపడుతూ వుంటారు. దాని కోసం పడరాని పాట్లు పడతారు, చేయకూడని పనులు చేస్తారు, సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తారు, ధర్మాన్ని తప్పుతారు, ఎన్నో తప్పులు చేస్తారు. ఇదంతా గొప్పతనం కోసమే, గొప్పగా అనిపించుకోవడం కోసమే.

అలా గొప్పల కోసం తప్పులు చేస్తారు. కానీ గొప్పలు శాశ్వతంగా వుండవు. కానీ తప్పులు మాత్రం శాశ్వతంగా వుంటాయి. ఆ తప్పుల ఫలితాలు చనిపోయిన తరువాత కూడా మనతో వస్తాయి. తరువాత వాటి ఫలితం బాధల రూపంలో, కష్టాల రూపంలో అనుభవించవలసి వస్తుంది.

ముఖ్యంగా చాలా మంది డబ్బు సంపాదించేది గొప్పకోసమే. తమ జీవితానికి సరిపడా వున్నా, సరిపడా కాదు సరిపడేదాని కంటే ఎక్కువగా వున్నా సరే, వారికే కాదు వారి పిల్లలకు సరిపడా వున్నా కూడా ఇంకా ఇంకా సంపాదిస్తూనే వుంటారు. ఇంకా కొంతమందికి ఎన్నో తరాలకు సరిపడా ఆస్తి వుంటుంది. అయినా సంపాదిస్తూనే వుంటారు. దేనికోసం? అంటే గొప్పకోసం మాత్రమే! నాకు అందరి కంటే ఎక్కువ వుందని, అందరికంటే నేను ధనవంతుణ్ణి అని అనిపించుకోవడానికి అలా సంపాదిస్తూనే వుంటారు.

విచిత్రమేమిటంటే అలా సంపాదించటానికి ఎన్నో తప్పులు, పాపాలు కూడా చేస్తూ వుంటారు. లేనివాడు సంపాదించడానికి తప్పులు చేసాడంటే అర్థం వుంది కానీ, ఎంత వున్నా సంపాదించడానికి తప్పులు చేయడమే విచిత్రం, ఒక రకంగా అది తెలివి తక్కువతనమే అవుతుంది. ఎందుచేతనంటే తప్పులు చేయడం తెలివైన పని ఎలా అవుతుంది? కానీ వారు తెలివైన వారమని భావిస్తూ వుంటారు. అలా తప్పులు చేస్తూనే వుంటారు. చివరకు జీవితాన్ని నష్టపరచుకుంటారు, కష్టాలు పాలు చేసుకుంటారు. అలా తప్పులు చేసి కష్టాలు పాలు అవడం తెలివైన పని ఎలా అవుతుంది చెప్పండి? అందుచేత గొప్పల కోసం తప్పులు చేయకూడదు. గొప్పల కోసమే కాదు మామూలుగా కూడా తప్పులు చేయకూడదని తెలుసుకోవాలి.

మరికొంతమంది గొప్పల కోసం అబద్ధాలు చెబుతారు, లేనివి చెబుతారు, ఉన్న వాటి కంటే ఎక్కువ చెబుతారు, చేయకపోయినా చేశానంటారు, చూడకపోయినా చూశానంటారు. ఇవన్నీ గొప్పకోసమే. మరి లేనివి చెప్పడం తప్పే కదా? ఈ తప్పు

ఎందుకు చేస్తున్నారు? గొప్పకోసమే కదా?

చూడండి చాలామంది తాను నిర్వహించిన కార్యక్రమానికి వచ్చిన వారి కంటే ఎక్కువగా చెబుతారు. ఆ కార్యక్రమం గురించి లేని గొప్పలు ఎన్నో చెబుతారు. అలాగే చాలా మంది తమకు తెలియకపోయినా తెలిసినట్టుగా చెపుతారు. ఇదంతా గొప్పకోసమే. కానీ తెలుసుకోండి అలా లేనివి చెప్పేవి అన్నీ తప్పులే.

కొంతమంది గొప్పల కోసం వాగ్ధానాలు చేస్తారు. అది ఇస్తాను, ఇది ఇస్తాను అంటారు. అది చేస్తాను, ఇది చేస్తాను అంటారు. కానీ చివరకు ఏమీ చెయ్యరు. అలా రాజకీయ నాయకులే కాదు ఎంతోమందిని చూస్తున్నాం. ఇదంతా గొప్పలకోసమే. అలా వాగ్ధానాన్ని భంగం చెయ్యడం కూడా తప్పే.

అలా తనది కాకపోయినా తనదని చెప్పుకోవడం, తనకు లేకపోయినా ఉందని చెప్పుకోవడం చూస్తున్నాం. ముఖ్యంగా ఆడవారిలో ఈ గొప్పలు చెప్పుకోవడం మరీ ఎక్కువ. తన ఇంటి గురించి, పిల్లల గురించి, భర్త గురించి, భర్త చేసే పనుల గురించి, ఎన్నో గొప్పలు చెబుతూ వుంటారు. కానీ అలా చెప్పే వాటిలో ఎన్నో తప్పులు దొర్లుతూ వుంటాయి. కానీ వాటిని గమనించరు. కొంతమంది కావాలనే తప్పు చెపుతూ వుంటారు. ఇదంతా గొప్పకోసమే.

కొంతమంది పదవుల కోసం, పదవులు నిలబెట్టుకోవడం కోసం ఎన్నో తప్పులు చేస్తారు, చేయకూడని పనులు చేస్తారు, మాట్లాడకూడని మాటలు మాట్లాడతారు, ఎన్నో అబద్ధాలు చెబుతారు, మోసగిస్తారు, వాగ్ధానాలు చేస్తారు, ఆశ పెడతారు, హత్యలు కూడా చేస్తారు. ఈ తప్పులన్నీ పదవుల కోసమే, పదవులు కూడా గొప్ప కోసమే. నేను ఇంత గొప్పవాణ్ణి అని చెప్పుకోవడం కోసమే. అలా గొప్ప కోసం సంపాదించే పదవుల కోసం ఎన్ని తప్పులు చేస్తారో లెఖ్ఖే వుండదు.

కొంతమంది గొప్పకోసం ఇంటిని అలంకరిస్తారు. ఒంటిని అలంకరిస్తారు. ఈ అలంకరణలు కోసం అప్పులు చేసేవారు వున్నారు, తప్పుడు మార్గాల ద్వారా సంపాదించే వారు వున్నారు. అలా గొప్పగా అలంకరించడం కోసం ఎన్నో తప్పులు చేసేవారు వున్నారు.

కొంతమంది గొప్పకోసం ఫంక్షన్స్ చేస్తారు, పార్టీలు ఇస్తారు. ఆ పార్టీలలో గొప్ప కోసం మాంసాహార వంటకాలు చేస్తారు. దాని కోసం ఎన్నో జంతువులను, ప్రాణులను క్రూరంగా చంపుతారు. అలా చంపి వాటి హింసకు కారకులవుతారు. ఇదంతా గొప్ప కోసమే! అలా ఎన్ని రకాల జంతువులను చంపుతే అంత గొప్ప అనుకుంటారు. అలా మాంసం వండకపోతే అది పార్టీయే కాదనుకుంటారు. ఎవరు

ఎన్ని జంతువులను చంపి ఎన్ని రకాలు వండితే వారు అంత గొప్పవారిగా భావిస్తారు. ఒక జీవిని తృప్తి పరచడానికి ఇంకొక జీవిని హింసిస్తారు. ఇలా గొప్ప కోసం జీవహింసకు పాల్పడి పాపం చేసిన వారవుతారు. తద్వారా దాని ఫలితం రోగాల రూపంలో హింస రూపంలో భవిష్యత్తులో అనుభవిస్తారు. ఇదంతా గొప్పకోసమే.

ఇలా లోకంలో చెప్పుకుంటూ పోతే గొప్పల కోసం తప్పులు చేసేవారు ఎంతో మంది వున్నారు. కానీ తెలుసుకోండి **"గొప్పలు ఎంతోకాలం ఉండవు. కానీ ఆ గొప్పల కోసం చేసే తప్పులు మాత్రం మిమ్మల్ని విడిచిపెట్టవు, చచ్చినా కూడా విడిచిపెట్టవు, మీ కూడా వస్తాయి. మీరు ఇంకొక జన్మ తీసుకున్నా ఆ తప్పులు మిమ్మల్ని పీడిస్తూనే వుంటాయి".** ఒకరకంగా కష్టాలకు కారణం గొప్పల కోసం చేసిన తప్పులే ఎక్కువ వుంటాయి. మనం తప్పే చెయ్యకపోతే కష్టాలే రావు కదా? అందుచేత తప్పులు చేయకూడదని తెలుసుకోండి. ఉపయోగం లేని గొప్పల కోసం అసలే చేయకండి.

ధ్యానం చెయ్యండి అన్నీ మీకే తెలుస్తాయి. మీరెవరో తెలుస్తుంది. అంతా మీరేనని తెలుస్తుంది. అంతా మీరైనపుడు ఎవరి కంటే మీరు గొప్పవారవుతారు. అందుచేత గొప్పలకోసం చూడరు, తప్పులు చెయ్యరు, కష్టాలు తెచ్చుకోరు.

**మనమే స్వయంగా మన ఆత్మతత్వాన్ని మర్చిపోయాం. ఏ విధంగానైతే కుక్క అద్దాల గదిలో తన ప్రతిబింబాన్నే చూసుకుని అది వేరే కుక్క అనుకుని మొరిగి మొరిగి మరణిస్తుందో, సింహం నూతిలో తన ప్రతిబింబాన్ని చూసుకుని ఉరుకుతుందో... అదే విధంగా మత్తెక్కిన ఏనుగు స్ఫటిక శిలపై తన బింబాన్ని చూచి దానిని తన దంతాలతో పొడిచి దెబ్బలాడుతుంది. అదే విధంగా జీవుడు సంసారం యొక్క మాయా మోహంలో పడి అంతా వేరు వేరు అనుకుంటున్నాడు.**

**– కబీరు**

# గుర్తింపు

సహజంగా లోకంలో అంతా గుర్తింపు కోసం తాపత్రయ పడుతూంటారు. అంటే తాము చేసిన పనికి, తమకి గుర్తింపు రావాలని చూస్తారు. ఎంత ఎక్కువ మందిలో గుర్తింపు వస్తే అంత గొప్పవారమైనట్టు భావిస్తారు. గుర్తింపు వచ్చే పనులు చేస్తారు. అంతేకాదు తక్కువ ఖర్చుతో ఎక్కువ గుర్తింపు రావాలనుకుంటారు. అందుకే పని కంటే ప్రచారానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు.

అలా ఏ చిన్న సేవ చేసినా, లోకోపకారమైన పని చేసినా, పేపర్లో తమ పేరు గొప్పగా వ్రాయాలనుకుంటారు. జర్నల్స్‌లో, ఆధ్యాత్మిక మాస పత్రికలలో తమ పేరు కనబడాలనుకుంటారు. టి.వి.లలో తమ గురించి గొప్పగా చెప్పాలను కుంటారు. అదే గుర్తింపు అనుకుంటారు. అలా అందరిలో గుర్తింపు వస్తే తాము గొప్పవారమైనట్టు భావిస్తారు. కొంతమంది బాగా ధనం సంపాదిస్తే అందరిలోనూ గుర్తింపు వస్తుందని అనుకుంటారు. ధనం సంపాదించటానికి రాత్రి, పగలు కష్టపడుతుంటారు. కొంతమంది పదవులు సంపాదిస్తే గుర్తింపు వస్తుందను కుంటారు. పదవుల కోసం ప్రయత్నిస్తారు. రాజకీయాలలో ప్రవేశిస్తారు. కొంతమంది సినిమా రంగంలో బాగా గుర్తింపు తెచ్చుకోవచ్చుననుకుంటారు. అలా నటుడిగా, గాయకుడిగా, దర్శకుడిగా, డాన్సరుగా ఎదిగి గుర్తింపు సంపాదించుకోవాలనుకుంటారు.

ఇంకా కొంతమంది ఆటలలో, కొంతమంది చిత్రలేఖనంలో, ఇంకా కొంతమంది కళాకారులుగా గుర్తింపు పొందాలనుకుంటారు. ఇంకా కొంతమంది రికార్డులు బద్ధలు కొట్టి... రివార్డులు, అవార్డులు సంపాదిస్తే మంచి గుర్తింపు వస్తుందనుకుంటారు. అలా లోకంలో ప్రతి ఒక్కరూ గుర్తింపు కోసం జీవితమంతా ప్రయత్నిస్తున్నారు. తమ శక్తి, యుక్తుల్ని ఉపయోగిస్తున్నారు. అంతకన్నా ఆలోచించడం లేదు.

కానీ తెలుసుకోండి గుర్తింపు పొందవలసింది లోకంలోను, లోకుల దగ్గర కాదు. 'లోకేశుడి' దగ్గర గుర్తింపు పొందాలి. లోకేశుడు అంటే ఎవరో కాదు. ఈ లోకానికే ఈశ్వరుడు. అంటే ఈ లోకాన్ని సృష్టించిన వాడు, ఈ లోకానికి ఆధారభూతుడు, ఈ లోకాన్ని నడిపిస్తున్న వాడు సమస్తమూ తానై వున్నవాడు. ఆయననే అందరూ 'భగవంతుడు' అంటారు.

తెలుసుకోండి లోకులలో ఎంతమంది దగ్గర గుర్తింపు వచ్చినా అది తాత్కాలికమే. తాత్కాలికం అంటే కొంతకాలం మాత్రమే వుంటుంది. కారణం ఆ

లోకులే ఈ లోకంలో ఎంతో కాలం వుండరు. లోకులే కాదు, లోకమే అశాశ్వతం. కానీ లోకేశుడు శాశ్వతం. శాశ్వతంగా వుండే లోకేశుడి దగ్గర గుర్తింపు పొందితే ఆ గుర్తింపు శాశ్వతంగా వుంటుంది. అందుచేత అటువంటి గుర్తింపు కోసం ప్రయత్నించాలి. దాని కోసమే జీవితాన్ని వినియోగించాలి.

మరి లోకేశుడు అంటే భగవంతుని దగ్గర గుర్తింపు పొందాలంటే ముందు మనం భగవంతుని గుర్తించాలి. కారణం ఆయన దృష్టి మన మీద పడాలంటే ముందు మన దృష్టి ఆయన మీద పెట్టాలి. మన దృష్టి ఆయన మీద పెట్టాలంటే ఆయన ఎవరో తెలుసుకోవాలి. ఎక్కడ వుంటాడో తెలుసుకోవాలి! ఆయన మీద ఎలా దృష్టి పెట్టాలో తెలుసుకోవాలి!

తెలుసుకోండి ఆయన అందరిలో అంతర్యామిగా వుంటాడు. ఆత్మ రూపంలో వుంటాడు. అటువంటి ఆత్మ మీద దృష్టి పెట్టాలంటే "ధ్యానం" చెయ్యాలి. అంటే ఎవరైతే ధ్యానం చేస్తారో వారు లోకేశుని గుర్తింపు పొందుతారు. నిజంగా అటువంటి వారి జీవితమే ధన్యం. అటువంటి వారు ఇహపరాలలో శాశ్వత గుర్తింపు పొందగలుగుతారు.

అందుచేత తెలుసుకోండి అలా జీవితమంతా వెచ్చించి లోకులలో గుర్తింపు కోసం ప్రయత్నించే బదులు ఆ జీవితాన్ని 'ధ్యానానికి' వెచ్చిస్తే లోకేశుని దగ్గర అంటే భగవంతుని గుర్తింపు పొందవచ్చు.

అలా పొందిన వారే శ్రీ రాముడు, శ్రీ కృష్ణుడు, బుద్ధుడు, జీసస్, మహమ్మద్, మహావీరుడు, వీరబ్రహ్మేంద్రస్వామి, యోగి వేమన, రాఘవేంద్రస్వామి, రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి, వివేకానంద, షిరిడీ బాబాలాంటి వారు. అందుచేత మనం కూడా ధ్యానం చేసి 'భగవంతుని' దగ్గర గుర్తింపు పొందుదాం.

**ప్రాణి సందడిగా వున్న సంగీత సభలో తన వాయిద్యాన్ని వాయించి వెళ్ళిపోతుంది (తన ప్రాపంచిక భూమికను నిర్వహించి సెలవు తీసుకుంటోంది)... ఒక పిడికెడు మట్టి.. కూడా నీ వెంట రాదు. ఇంటి గడప వరకు, మాత్రమే భార్య వస్తుంది. గుమ్మం వరకు తల్లి వస్తుంది. స్మశానం వరకు కుటుంబంలోని వారు వస్తారు. తరువాత హంస రూపంలో వున్న జీవాత్మ ఒంటరిగానే వెళ్ళాలి. నీ బంధుమిత్రులు ఊరూవాడ ఎవర్నీ నువ్వు కలవలేవు. కబీరు అంటున్నాడు: "జగన్నాధుని భజించు లేకపోతే జన్మ వ్యర్థమైపోతుంది"**

**– కబీరు**

# అమరత్వం - అమర జీవి

చావు పుట్టుకలు లేకపోవడమే అమరత్వం. అలా చావు పుట్టుకలు లేని వాడినే అమరజీవి అంటారు.

నిజానికి ప్రతి ఒక్కరు అమరులే. కారణం ఎవరికీ చావులేదు కనుక. కానీ దేహానికి చావు వుంది. ఆ దేహానికి పెట్టిన పేరుకి చావు వుంది.

అమర జీవి పొట్టి శ్రీరాములు, అమరజీవి గాంధీ అంటారు. ఆ పేర్లు లోకంలో చెప్పుకున్నంత కాలం, లోకులకు గుర్తున్నంత కాలం అంటే మరచిపోనంత కాలం వారు అమరులే. కానీ లోకులు మరచిపోతే వారు మరణించినట్టే.

అంటే లోకం దృష్టిలో వారి పేరు మరచిపోతే వారు మరణించినట్టు అవుతుంది. కానీ అలా వారిని లోకం మరచిపోయినపుడు, మరణించింది వారి పేరే కానీ నిజానికి వారు కాదు. తెలుసుకోండి అమరత్వం అందరికీ వుంది. కానీ పేరుకు మాత్రం కొంతకాలమే వుంటుంది.

లోకంలో వారు చేసిన సేవలు, లోక కళ్యాణకరమైన పనులు, వారు అందించిన జ్ఞానం మరచి పోకూడదని వారి ఫోటోలు, బొమ్మలు, విగ్రహాలు తయారు చేయించి ఇళ్ళల్లో, నాలుగు రోడ్ల కూడళ్ళలో, గుళ్ళలో వుంచుతారు. అలా అవి వున్నంత కాలం ప్రజలు వారి పేరు చెప్పుకుంటారు, వారిని గుర్తుంచుకుంటారు. కాలం మారే కొద్దీ, తరాలు మారే కొద్దీ చాలా మందికి వారి బొమ్మలు చూసినా, విగ్రహాలు చూసినా వారెవరో తెలియదు. అందుచేత బొమ్మల క్రింద, విగ్రహాల క్రింద వారి పేర్లు కూడా వ్రాస్తారు. అది చదువుకున్న వారు ఫలానా అని అనుకుంటారు, తెలుసుకుంటారు.

అలాగే కొన్ని పురాతనమైన, పాడుపడిన ఆలయాలు వుంటాయి. గ్రామ దేవతల గుళ్ళు, మందిరాలు కూడా వుంటాయి. చాలా మందికి ఆ దేవుడు, దేవత ఎవరో కూడా తెలియదు. అందుకని అక్కడ వారి పేరు వుందేమో చూస్తారు. వారి పేరు వుంటే చదువుకుని ఓహో ఆవిడ ఫలానా దేవతా? ఆయన ఫలానా దేవుడా? ఫలానా కాలంలో వుండేవారా? అని అనుకుంటారు. అంటే ఎంతటి దేవతలైనా! దేవుళ్లైనా! కాలం మారితే వారి పరిస్థితి కూడా అంతే. ఆలోచించండి. మనకు ప్రస్తుత కాలానికి సంబంధించిన ఎంతోమంది దేవుళ్ళ పేర్లు తెలుసు. కానీ 5000

సంవత్సరాల క్రితం వుండే దేవుళ్ళ పేర్లు తెలుసా? ఒకవేళ తెలిస్తే ఎంతమందివి తెలుసు? మరి అప్పుడు దేవుళ్ళు లేరా? అసలు సృష్టి ఏర్పడి కోట్ల సంవత్సరాలు అయిందంటారే? మరి ఇప్పటికి ఎంతమంది దేవుళ్ళు వచ్చి వుంటారు? మరి వారందరి పేర్లు ఎందుకు తెలియదు? వారంతా ఇప్పుడు లేరంటారా? వారే లేకపోతే ప్రస్తుతం వున్న వారు కూడా కొన్నాళ్ళకు వుండనట్టేగా? అందుచేత పేరు గుర్తుంటేనే అమరులు కాదు. పేరు వున్నా లేకపోయినా అంతా అమరులే.

తెలుసుకోండి కొన్ని పేర్లు కొన్ని సంవత్సరాలు, కొంతమందివి కొన్ని యుగాలు కూడా వుంటాయి. మొత్తం మీద ఏదైనా కొంతకాలమే.

అందుచేత అమరత్వం పేరుకు లేదు. కారణం పేరు శాశ్వతం కాదు. అమరత్వం అన్నది 'ఆత్మ'కు మాత్రమే వుంది. కారణం 'ఆత్మ' శాశ్వతం కాబట్టి. అందుచేత శాశ్వతమైన 'ఆత్మ'ను ఆశ్రయించండి. అశాశ్వతమైన నామాన్ని కాదు. అంటే 'ధ్యానం' చెయ్యండి. మీరు కూడా అమర జీవులని తెలుసుకుంటారు. అమరత్వం పొందుతారు.

**ఈ ప్రపంచం నుంచి ఎంతమంది వెళ్ళిపోయారు? ఎవరు వెళ్ళకుండా ఉండిపోయారు? శరీరం అనెడి ఈ కోట పడిపోయి మట్టిలో కలిసిపోవలసిందే! ఇంద్రుడు లాంటి అనేక మంది వ్యక్తులు వెళ్ళిపోయారు. పంచ పాండవుల వంటి జోడీలు ఎందరో వెళ్లిపోయారు. ధ్రువనక్షత్రం లాంటి నక్షత్రాలు కూడా శాశ్వతంగా ఉండవు. సూర్యచంద్రులు కూడా నశించిపోయే కాలం వస్తుంది. కబీరు అంటున్నాడు. ఓ మూఢుడా మేల్కో, మేల్కొని ఈ జగత్తును చూడు. శరీరం పండిపోక ముందే నిరాకారుడైన పరమేశ్వరుని తెలుసుకో.**

**– కబీరు**

# బాధ్యత

చాలా మంది భాధ్యత గురించి మాట్లాడుతుంటారు.

అలా పురుషులు, ఉద్యోగమో, వ్యాపారమో, వృత్తో చేసి సంపాదించడం, సంపాదించిన ధనంతో భార్యాపిల్లలను పోషించడం తమ బాధ్యత అనుకుంటారు, అంటారు. అందుచేత జీవితమంతా సంపాదించడానికే ప్రాముఖ్యం ఇస్తారు. ఇక దేని గురించి ఆలోచించకుండా, కాళీ లేకుండా సంపాదిస్తూ వుంటారు.

అలాగే స్త్రీలు పిల్లల్ని కనడం, వారిని పెంచడం, ఇంటి పనులు చేయడం, మూడు పూటలా వంట చేయడం, ఇంటిని చూసుకోవడం, భర్తకు, పిల్లలకు లోటు లేకుండా చూసుకొనడం తమ బాధ్యత అనుకుంటారు. అంతే కాకుండా పిల్లల్ని పెద్ద వాళ్ళను చేసి వారికి పెళ్ళిళ్ళు చేయడం, వారికి పిల్లలు పుడితే వారి మంచి చెడ్డలు చూసుకోవడం తమ బాధ్యత అనుకుంటారు. అంతకన్నా చేసేది ఏముంది? అని కూడా అంటారు.

అలాగే పిల్లల విషయానికి వస్తే చదువుకోవడం, ఉద్యోగం సంపాదించడం, వివాహం చేసుకోవడం, మరల సంసారాన్ని చూసుకోవడం తమ బాధ్యత అనుకుంటారు. ఇలా ఎవరిని అడిగినా ఇదే తమ బాధ్యత, అంతకన్నా ఏమి వుంది? అంటారు. అంతకన్నా ఆలోచించరు. వీరికి అంతకన్నా తెలియదు. ఒకవేళ అదేనా నీ బాధ్యత అని ప్రశ్నిస్తే? అంతకన్నా ఏమి వుంది? అని ఆశ్చర్యంగా ప్రశ్నిస్తారు.

కానీ తెలుసుకోండి అంత మటుకే మానవుని బాధ్యత కాదు. మానవుడు ఆలోచించవలసింది ఇంకా వుంది. మానవుని బాధ్యత ఇంకా వుంది. ఆలోచిస్తే అందరూ అనుకునేది ఆలోచించేది అసలైన బాధ్యత కాదు. మానవుని అసలైన బాధ్యత వేరే వుంది. మానవుడు దానిని తెలుసుకోవాలి.

మరి మానవుడు తన బాధ్యత ఏమిటో తెలుసుకోవాలంటే! ముందు తాను ఎవరో తెలుసుకోవాలి. తాను ఎవరో తనకు తెలియకుండా తన బాధ్యత ఏమిటో తనకు ఎలా తెలుస్తుంది? తాను ఏమి చెయ్యాలో ఎలా తెలుస్తుంది? తాను దేనికి ప్రాముఖ్యం ఇవ్వాలో ఎలా తెలుస్తుంది?

అందుచేత ముందు తానెవరో తెలుసుకోవాలి. అప్పుడే అన్నీ

తెలుస్తాయి. ఏం చెయ్యాలో తెలుస్తుంది. తన బాధ్యత ఏమిటో తెలుస్తుంది.

ముఖ్యంగా తాను దేహం కాదు ఆత్మ అని తెలుసుకోవాలి. ఆత్మ తానైనపుడు తన గురించి అంటే ఆత్మ గురించి ఆలోచించాలి. ఆత్మకు ఏం చెయ్యాలి? ఏం చేస్తే ఆత్మకు లాభిస్తుంది? అసలు ఆత్మ గురించి చెయ్యవలసింది ఏమైనా వుందా? ఆత్మ గురించి చేస్తే, దాని వల్ల ప్రయోజనమేమిటి? ఇలా ఎన్నో విషయాలు ఆలోచించాలి. ఎంతసేపూ దేహం గురించి, దేహోన్నతి గురించి పాటు పడుతూ అదే తన బాధ్యత అనుకుంటున్నారు. మరి ఆత్మ తానైనపుడు ఆత్మోన్నతికి పాటుపడాలి కదా? దానికి ఏం చెయ్యాలి? ఏం చేస్తే ఆత్మోన్నతి కలుగుతుంది? అన్నది తెలుసుకోవాలి. ఇదే తన అసలైన బాధ్యత.

మరి ఆత్మోన్నతి కలగాలంటే జ్ఞానం సంపాదించుకోవాలి. దానికి ముఖ్యంగా ధ్యానం చేయాలి. అంటే ధ్యానం చెయ్యడమే తన బాధ్యత. ఇది తెలిస్తే ఎవరైనా ధ్యానానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. సంపాదనకు, సంసారానికి తక్కువ ప్రాముఖ్యం ఇస్తారు.

లేకపోతే ధన సంపాదనే తమ భాధ్యత అనుకుంటారు. సంసారమే తమ బాధ్యత అనుకుంటారు. అందుచేత ముందు తాను ఎవరో తెలుసుకోవాలి. ఆ ప్రయత్నం చేయాలి. మనమంతా ఆత్మలమని భగవద్గీతలోనే చెప్పబడింది. అది అధ్యయనం చేసి, అర్థం చేసుకుని మన బాధ్యతలేమిటో తెలుసుకోవాలి! దానికి ముఖ్యంగా ధ్యానం చెయ్యాలి.

**దేహ రూపంలో వున్న ఈ వృక్షంలో జీవాత్మ అనే పక్షి.. విషయా భోగాలలో ఊగుతూ నివసిస్తోంది. అది ఏ భావంతో మాట్లాడుతుందో దాని కలయిక గురించి ఎవ్వరికీ తెలియదు. చెట్టు కొమ్మపై నున్న నీడలో ఈ పక్షి నివాసం ఏర్పరచుకుంది. అది సాయంకాలం వస్తుంది. ఉదయాన్నే ఎగిరిపోతుంది. అది తన రహస్యాన్ని ఎవ్వరికీ తెలియనివ్వడం లేదు. ఈ దేహంలోనే వుంటూ మాట్లాడే ఈ పక్షి గురించి నాకు ఎవ్వరూ చెప్పలేదు. దానికి వర్ణ అవర్ణం అనేవి లేవు. అది ప్రేమ యొక్క నీడలో కూర్చుని ఉంది. అది అగమ్యం, అపారం. శాశ్వత చైతన్యం. రావటం వెళ్ళటం అనేవి దానికి లేవు. కబీరు అంటున్నాడు. "ఇది అగమ్య కథ... ఈ జీవాత్మ రూపంలో వున్న పక్షి యొక్క స్థానమేది? దానిని తెలుసుకునే పని చేయి!"**

**– కబీరు**

# మనస్సు వుంటే!

భగవంతుని సృష్టిలో ఒక్క మానవ జాతే పంచ భూతాలతో సృష్టింప బడింది. మిగిలిన జాతులు అంటే జంతు జాతి నాలుగు భూత తత్వాలతో సృష్టింపబడింది. పక్షిజాతి మూడు భూతతత్వాలతో సృష్టింపబడింది. క్రిమి కీటక, సర్ప జాతి రెండు భూతతత్వాలతో సృష్టింపబడింది. వృక్షజాతి ఏక భూతతత్వంతో సృష్టింపబడింది.

మానవులకు మాత్రమే పంచభూతాలలో ఏ జీవికి లేని ఆకాశతత్వం అదనంగా ఇవ్వబడింది. దానినే తెలివి, బుద్ధి అని అంటారు. దానినే మనస్సు అని కూడా అంటాం. అంటే మనస్సు అన్నది మానవునకు అదనంగా ఇవ్వబడింది. ఈ మనస్సు యొక్క గుణాన్ని బట్టి మానవుని ప్రవర్తన ఆధారపడి వుంటుంది. మనస్సు మలినంగా వుంటే అతని ప్రవర్తన లోక విరుద్ధంగా వుంటుంది. తనకు కూడా నష్టం కలిగించే విధంగా వుంటుంది. మనస్సు శుద్ధంగా వుంటే లోకోపకరంగా వుంటుంది. తనకు కూడా లాభం కలిగించే విధంగా వుంటుంది.

చూడండి మనస్సు లేని జంతువులను దూషించినా, తిట్టినా, పరుష పదజాలంతో నిందించినా, విమర్శించినా పట్టించుకోవు, ప్రతిస్పందించవు. తమ పని తాము చేసుకుపోతాయి తప్ప ఏ రకమైన ప్రతిచర్య వుండదు. అదే ఆహారం చూపిస్తే స్పందిస్తుంది. నీటిని చూపించినా స్పందిస్తుంది. కర్రను చూపించినా స్పందిస్తుంది. కానీ తిడుతుంటే ఏమీ స్పందించదు. కారణం వాటికి మనస్సు లేదు కాబట్టి. అలాగే జంతువులు ఆకలి అయినపుడు ఆహారం కోసం చూస్తాయి తప్ప, వాటికి ఇక ఏ ఇతర కోరికలు వుండవు. సుఖాలు, కోరికలు, కక్షలు, కార్పణ్యాలు, ఆశలు, సరదాలులాంటివి ఏవీ వుండవు. పగ, ప్రతీకారాలు వుండవు. ఒకరికి హాని చెయ్యాలనుకోవు. చేస్తే ఏదైనా ఉపకారం చేస్తాయి తప్ప అపకారం చెయ్యవు. ప్రక్కవారి గురించి ఆలోచించవు. కారణం వాటికి మనస్సు లేదు కాబట్టి. అందుకే వాటికి దుఃఖం వుండదు. అశాంతి వుండదు. ఆ రోజు ఆహారం దొరికితే వాటికి ఇక ఏమీ అక్కరలేదు. రేపటి ఆహారం కోసం కూడా ఆలోచించవు. కారణం ఆలోచించడానికి మనస్సు లేదు కాబట్టి.

కానీ మానవునకు మనస్సు వుంది కాబట్టి అన్నిటికీ ప్రతి స్పందిస్తాడు.

ఎవరైనా తిడితే వూరుకోడు. ఒకటి తిడితే నాలుగు తిడతాడు. అవకాశం వుంటే కొడతాడు, విమర్శిస్తాడు. తిరిగి తిట్టలేకపోయినా, సమాధానం చెప్పలేకపోయినా ఎంతో బాధపడతాడు, లోపల తిట్టుకుంటాడు, శాపనార్థాలు పెడతాడు. తిట్టిన వాడు ఎదురయితే గుర్తు చేసుకుంటాడు. అవకాశం వస్తే వీడే నన్ను తిట్టాడని మరలా సమాధానం చెపుతాడు. ఒక్కొక్కసారి వాడి మీద పగపడతాడు కూడా. దీనికంతటికీ కారణం, మానవునకు మనస్సు వుంది కాబట్టి.

అంతేకాదు మనస్సున్న మానవునకు కోరికలు వుంటాయి, కోరతాడు. కోరికలు తీరకపోతే బాధపడతాడు. కోరికలు తీర్చుకోవడానికి తప్పులు, పాపాలు చేస్తాడు, ధర్మాన్ని తప్పుతాడు. ఒకవేళ కోరిక తీరినా మరల కొత్త కోరికలు కోరుతూ వుంటాడు.

అలాగే మనస్సున్న మానవుడు ఆశపడుతూ వుంటాడు. చూసిందల్లా కావాలంటాడు, ఆశకు అంతు వుండదు. అలాగే ఎన్ని వున్నా తృప్తి వుండదు. అవసరానికి మించి వున్నా, అవసరం లేకపోయినా ఇంకా, ఇంకా పోగు చేసుకుంటూనే వుంటాడు, దాచుకుంటాడు. దాచుకోవడానికే దోచుకుంటాడు, తప్పులు, పాపాలు చేస్తాడు. ఇదంతా మనస్సు వుండడం వల్లే.

మనస్సున్న మానవుడు తన దగ్గర వున్నవి ప్రకృతి వైపరీత్యాలలో పోయినా, లేక పాడైపోయినా వూరుకుంటాడు కానీ ఎవరికీ ఇవ్వడు. ఎంతవున్నా ఇంకా కూడబెడుతూ వుంటాడు. కానీ ఎవరికి పంచడు. అధర్మంగా సంపాదిస్తూనే వుంటాడు. కానీ ఎవరికీ ధర్మం చెయ్యడు. ఇదంతా మనస్సు వుండటం వల్లే.

మనస్సు వుండటం వల్లే మానవునకు దుఃఖం, అశాంతి. మనస్సున్న మానవునకు ప్రతీ దాని గురించి ఆరాటమే, చిన్న విషయం గురించి కూడా ఆవేదనే. ఏదైనా గొప్ప కోసమే చేస్తాడు. అవసరం లేకపోయినా గొప్పకోసమే చేస్తూంటాడు, గొప్పల కోసం తప్పులు కూడా చేస్తాడు, పాపాలు చేస్తాడు.

ఉపకారం చెయ్యగలిగిన మానవుడు మనస్సు యొక్క స్వార్థం వల్ల అపకారం చేస్తున్నాడు. తన ఆనందం చూసుకుంటాడు, ఇతరుల ఆనందం గురించి పట్టించుకోడు, పైగా హరిస్తాడు. హింస చేస్తాడు, ఇతరుల హింసతో ఆనందాన్ని పొందాలనుకుంటారు.

పై వాటిని బట్టి చూస్తే 84 లక్షల జీవులలో అదనంగా మనస్సు

ఇవ్వబడిన మానవుడు దానిని ఎలా ఉపయోగించాలో తెలియక విరుద్ధంగా ఉపయోగిస్తూ తాను నష్టపోతున్నాడు, లోకానికి నష్టాన్ని కలిగిస్తున్నాడు.

కానీ మానవునకు మనస్సు ఇవ్వబడింది ఇలా ప్రవర్తించడానికి కాదు. తన వివేకం ఉపయోగించి తాను ఎవరో తెలుసుకోవటానికి. తానే కాదు. అన్నీ ఒకటే! అని తెలుసుకోవటానికి. అంతే కాదు "అంతా నేనే! నేనే అంతా" అని అనుభవపూర్వకంగా తెలుసుకోవడానికి, తద్వారా తన జీవిత లక్ష్యాన్ని సాధించి, ఈ జీవిత వలయం నుంచి బయటపడటానికి. అంటే "చచ్చి పుట్టే జీవితం కాకుండా చావు పుట్టుకలు లేని జీవితం పొందటానికి".

అందుచేత తెలుసుకోండి మనస్సున్న మానవుడు ఆలోచించాలి. తాను ఏం చెయ్యాలో తెలుసుకోవాలి. ఏం చెయ్యకూడదో తెలుసుకోవాలి. ఎలా జీవించాలో తెలుసుకోవాలి.

మరి అటువంటి జీవితం పొందాలంటే మానవుడు వివేకవంతుడు కావాలి. దానికి ముందు మనస్సును శుద్ధి చెయ్యాలి. అలా మనస్సును శుద్ధి చేసుకున్నవారు జంతువుల కంటే, సమస్త జీవరాసి కంటే కూడా గొప్పగా ప్రవర్తించగలడు. కారణం ఆ మనస్సును సవ్యమైన రీతిలో ఉపయోగించుకోగలడు. అందుచేత తెలుసుకోండి! మానవునకు అన్నింటి కంటే ముఖ్యం మనస్సును శుద్ధి చేసుకోవడం.

మరి మనస్సు శుద్ధమవ్వాలంటే ఎవరైనా ధ్యానం చెయ్యాలి. మృతాహారమైన మాంసాహారం మానాలి. దానికి "శ్వాస మీద ధ్యాస" వుంచాలి, సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి". మనస్సును శుద్ధి చేసుకోవాలి.

**ఓ మనసా! ఈ శరీరం కాగితపు బొమ్మ. కొన్ని నీటి బిందువులు పడితే క్షణంలో పాడైపోయే దీన్ని చూసుకుని ఎందుకు గర్వపడుతున్నావ్? మట్టిని తవ్వి గోడలు కట్టుకుని అజ్ఞానులు ఇది నా ఇల్లు అంటున్నారు. యమదూతలు బంధించి తీసుకువెళ్ళిపోయాక ఎవ్వరూ వెనక్కి తిరిగి రావటం లేదు. మోసం చేసి ధనాన్ని సంపాదించి జనులు గోతిని తవ్వి దాస్తున్నారు. ఈ శరీరం నుంచి శ్వాస పోయిన వెంటనే దాచిన ధనమంతా పోగట్టబడుతుంది. నాటకం మధ్యలోనే నటుడు అలసిపోతే నాటకం ఎలా జరుగుతుంది.**

**– పరమయోగి కబీరు**

# మైండ్ - ప్యూరిఫికేషన్

మైండ్ ప్యూరిఫికేషన్ అంటే మనశ్శుద్ధి దీనినే భావశుద్ధి అని కూడా అంటారు. ఇది ప్రతి ఒక్కరికి తప్పనిసరి. ఎందుచేతనంటే మనస్సు శుద్ధిగా లేకపోతే అంటే మనస్సు మలినంగా వుంటే అంటే చెడు మనస్సు వుంటే మానవునకు అన్నీ నష్టాలే. కారణం మానవునిలో మనస్సుదే కీలకపాత్ర. కారణం మనస్సుని బట్టే మనిషి ప్రవర్తన వుంటుంది. మలిన మనస్కుడి ప్రవర్తన ఎలా వుంటుందో చూద్దాం.

1) మలిన మనస్సు వున్నవాడు తప్పులు చేస్తాడు. కష్టాలు తెచ్చుకుంటాడు.

2) మలిన మనస్సు వున్నవాడు హింస చేస్తాడు, రోగాల పాలవుతాడు.

3) మలిన మనస్సు వున్నవాడు మంచి చెయ్యలేడు. జీవితంలో భోగం పొందలేడు.

4) మలిన మనస్సున్న వాడు ప్రేమించలేడు, ఇవ్వలేడు. వాటి లాభాలు పొందలేడు.

5) మలిన మనస్సు వున్న వాడు మంచిగా ఆలోచించలేడు, మంచిగా జీవించలేడు.

6) మలిన మనస్సున్న వాడికి త్రికరణ శుద్ధి ఉండదు. జీవితంలో జయం కలగదు.

7) మలిన మనస్సు వున్న వాడికి ఆహారం మీద మమకారం వుంటుంది. నష్టం కలిగించే మాంసాహారం తీసుకుంటాడు. రుచికి ప్రాముఖ్యం ఇస్తాడు.

8) మలిన మనస్కుడు కబుర్లు చెబుతాడు, ఆచరణ ఉండదు.

9) మలిన మనస్కుడికి కోరికలుంటాయి, ఆశ వుంటుంది, అసూయ వుంటుంది.

10) మలిన మనస్కుడికి న్యాయం, ధర్మం తెలియదు, ఆచరించలేడు.

11) మలిన మనస్కుడికి సంకల్ప శక్తి వుండదు.

12) మలిన మనస్కుడికి వినాశకర, వ్యతిరేక ఆలోచనలే వుంటాయి. అలాగే ప్రవర్తిస్తాడు. అలాంటి ఫలితాలే పొందుతాడు.

13) మలిన మనస్కుడికి వివేకం వుండదు, ఆలోచించలేడు, అందరినీ అనుకరిస్తాడు.

14) మలిన మనస్కుడు మోసగిస్తాడు - మోసపోతాడు; నష్టం కలిగిస్తాడు - నష్టపోతాడు; ద్వేషిస్తాడు - ద్వేషింపబడతాడు.

15) మలిన మనస్కుడికి అతీంద్రియ జ్ఞానం ఉండదు. మహర్షుల సందేశాలు అందవు, అందుకోలేడు.

16) మలిన మనస్సు చంచలంగా వుంటుంది, శాంతి వుండదు. దేని మీదా ఏకాగ్రత వుండదు, జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. దేనిని సరిగా గ్రహించలేడు, ఏదీ త్వరగా అర్థం కాదు.

17) మలిన మనస్కుడు అనవసరపు వ్యవహారాలలో తలదూరుస్తాడు. అనవసరమైనవి ఆలోచిస్తాడు, చిక్కులలో చిక్కుకుంటాడు.

18) మలినమనస్కుడు తన గురించి ఆలోచించడు. ఇతరుల గురించే ఆలోచిస్తాడు. తన తప్పులు తెలుసుకోడు, ఇతరుల తప్పులు చెపుతాడు.

19) మలిన మనస్కుడు ఇవ్వడు, కోరతాడు.

20) మలిన మనస్కుడికి తప్పుడు ఆలోచనలే వుంటాయి.

21) ఆలోచనలు త్యాగపూరితంగా వుండవు, స్వార్థ పూరితంగా వుంటాయి.

22) ఇతరులలో దోషాలే కనిపిస్తాయి. వారిలోని మంచి, విశిష్ఠత, గొప్పతనం కనిపించదు.

23) మలిన మనస్కుడు అజ్ఞానంలో వుంటాడు. జ్ఞానవంతుడు కాలేడు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో వుంటాయి. ఒక రకంగా మనస్సు మలినంగా వుంటే అన్నీ నష్టాలే, అంతా నష్టమే. అందుచేత తెలుసుకోండి ఎవరైనా సరే అన్నిటి కంటే ముందు మనస్సు శుద్ధి చేసుకోవాలి. మనస్సును శుద్ధి చేసుకోవటానికి ప్రాముఖ్యం ఇవ్వాలి. దీనినే మైండ్ ప్యూరిఫికేషన్ అంటారు. మరి మనస్సు శుద్ధి కావాలంటే రెండే మార్గాలు (1)సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి. (2) శ్వాసమీద ధ్యాస వుంచి ధ్యానం చెయ్యాలి.

ఈ రెండూ ఆచరించిన వారికి మెల్లిగా మనస్సు శుద్ధమవుతుంది. మెల్లిగా ప్రవర్తన మారిపోతుంది. మంచి పనులే చేస్తూ వుంటాడు. చివరకు అన్నీ లాభాలే పొందుతాడు.

# మనశ్శుద్ధి వల్ల లాభాలు

అన్నీ గ్రహించేది మనస్సు. కళ్ళు చూసినా, చెవులు విన్నా, ముక్కు వాసన చూడగలిగినా, చర్మం స్పర్శించగలిగినా, నాలుక రుచి చూడగలిగినా, ఏదైనా గ్రహించేది మనస్సే.

మనస్సు మలినంగా వున్నవారు ఇవేమీ సరిగ్గా చెయ్యలేరు, గ్రహించలేరు. మనస్సు శుద్ధమయ్యే కొద్దీ అన్నిటినీ బాగా గ్రహించగలుగుతారు. చూడండి శుద్ధంగా వున్న స్ఫటిక (క్రిష్టల్) నుంచి అన్నిటిని చూడగలుగుతాం కానీ రాయి నుంచి ఆ రకంగా చూడలేం.

అలాగే మనస్సు స్ఫటికంలా శుద్ధంగా తయారవుతే జ్ఞానేంద్రియాలన్నీ చాలా శక్తివంతంగా, సమర్థవంతంగా పని చెయ్యగలుగుతాయి. అటువంటి వారు వాసనను బట్టి అది ఏమిటో కరెక్టుగా ఇట్టే చెప్పగలరు. అలాగే విన్నది వెంటనే అర్థం చేసుకోగలరు. అలాంటి వారు చెవితో విన్న మాట, శబ్దాన్ని బట్టి అది ఎవరో తేలికగా చెప్పగలరు. కళ్ళతో దేనినైనా స్పష్టంగా చూడగలరు, గుర్తించగలరు. స్పర్శ ద్వారా అదేమిటో చెప్పగలరు. నాలుకతో రుచి చూసి పదార్థాన్ని వెంటనే చెప్పగలరు. తెలుసుకోండి మనస్సు శుద్ధమైన వారికి అన్ని రకాల నైపుణ్యం వుంటుంది.

చూడండి కుక్కలు వాసనను బాగా పసిగట్టగలవు. కుక్కలు ఎవరైనా తాకిన వస్తువులు వాసన చూసి ఆ వ్యక్తిఎలా వెళ్ళాడో, ఏ దారిన వెళ్ళాడో పసిగట్టగలవు. చివరకు ఆ వ్యక్తిని కూడా పట్టుకోగలవు. అలాగే జంతువులు స్త్రీ జంతువు మర్మాంగాన్ని వాసన చూసి అవి రతికి సిద్ధంగా వున్నాయో లేదో తెలుసుకోగలవు. అప్పుడే రతి సల్పుతాయి. అలాగే ఏ జంతువైనా వాసన చూసి తమ పిల్లలు ఏవో కనిపెట్టగలవు. అలాగే పిల్లలు కూడా తమ తల్లులను గుర్తించగలవు.

అలాగే సృష్టిలోని సంకేతాలను జంతువులు గ్రహించగలవు. సునామీలు గానీ, భూకంపాలు గానీ ముందుగానే తెలుసుకోగలవు. జంతువులు ఎదుటి వారి కళ్ళలోకి చూసి వారి భావాలు అర్థం చేసుకోగలవు.

చీమలు క్రింద వుండి రెండస్తులపైనవున్న ఆహారాన్ని పసిగట్టగలవు. అలాగే జంతువులు అలికిడిని, అలికిడి శబ్దాన్ని చాలా స్పష్టంగా వినగలగడమే కాదు, శత్రువు రాకను ముందే గుర్తించి జాగ్రత్త పడతాయి.

వీటన్నిటికీ కారణం వీటికి మనస్సు లేదు. అవి ప్రకృతి సహజ సిద్ధంగా జీవిస్తాయి. ప్రకృతి ధర్మాల ప్రకారం ప్రకృతి నిర్దేశించిన ప్రకారం జీవిస్తాయి. ప్రకృతి నిర్దేశించిన ఆహారం తీసుకుంటాయి. అందుకే వాటికి ఆ శక్తులు వున్నాయి.

కానీ మనస్సు వున్న మానవుడు తనకు ప్రకృతి నిర్దేశించిన దానికి విరుద్ధమైన ఆహారం అంటే మాంసాహారం అంటే మృతాహారం తిని మనస్సును మలినం చేసుకోవడం వల్ల తనకు ప్రకృతిచే సహజంగా ఇవ్వబడిన శక్తులను కోల్పోవడమే కాదు, ఏమీ తెలియనివాడిలా, చేయలేని వాడిలా జీవిస్తున్నాడు. తనకు ఇవ్వబడిన ఇంద్రియాలను పూర్తిగా, పూర్తి నైపుణ్యంతో ఉపయోగించుకోలేక పోతున్నాడు.

అందుచేత తెలుసుకోండి మానవుడు తనకు ప్రకృతిచే ఇవ్వబడిన సహజ సిద్ధమైన శక్తులు ప్రదర్శించాలంటే, ప్రకృతి సహజ సిద్ధమైన శాకాహారం తీసుకోవాలి. దానితో పాటు 'శ్వాస మీద ధ్యాస' వుంచి ధ్యానం చెయ్యాలి. అలా చేస్తే మనస్సు శుద్ధమై, పవిత్రమై, శక్తివంతమై తనకు వున్న అన్ని శక్తులు ఉపయోగించుకోగలుగుతారు. మనస్సును అదుపులో వుంచుకోగలుగుతారు. జీవితంలో ఎన్నో లాభాలు పొందుతారు.

**నీ మనస్సుకే ప్రబోధించు. ఉపదేశము చేయి. ఎవరైతే మనస్సును వశం చేసుకుంటారో వారికి ప్రపంచం అంతా శిష్యరికం చేస్తుంది.**

**– పరమయోగి కబీరు**

# మానవుని ఆలోచనా విధానం

దేహపరంగా మానవులు పైకి ఒకే రకంగా కనిపించినా, ఆలోచనా విధానం మాత్రం రకరకాలుగా వుంటుంది. అంతేకాదు ఆలోచనా విధానాన్ని బట్టే మానవుల ప్రవర్తన వుంటుంది. వారి ప్రవర్తనని బట్టే వారి జీవితంలో ఫలితాలు వుంటాయి. అందుచేత తెలుసుకోండి జీవితంలో సరైన ఫలితాలు వుండాలంటే సరైన ఆలోచనా విధానం వుండాలి. అసలు మానవుని ఆలోచనా విధానం ఎలా వుంటుందో తెలుసుకుందాం. ముఖ్యంగా మానవుని ఆలోచనా విధానం నాలుగు రకాలుగా వుంటుంది.

(1) వినాశకర ఆలోచనలు (Disastrous Thinking)

(2) వ్యతిరేక, విరుద్ధమైన ఆలోచనలు (Negative Thinking)

(3) అనుకూల ఆలోచనలు (Positive Thinking)

(4) అద్భుతమైన, ఆశ్చర్యకరమైన ఆలోచనలు (Miraculous Thinking)

ఆలోచనలు మనస్సుకు సంబంధించినవి కాబట్టి మనస్సు యొక్క గుణాన్ని బట్టే మనిషి యొక్క ఆలోచనా విధానం వుంటుంది. మానవుని గుణాలు చైతన్య స్థాయిని బట్టి వుంటాయి.

సహజంగా మనిషి యొక్క గుణాలు నాలుగు రకాలుగా వుంటాయని శ్రీ కృష్ణ భగవానునుడు భగవద్గీతలో చెప్పడం జరిగింది. అవి (1) తమోగుణం, (2)రజోగుణం, (3) సాత్వికగుణం, (4) నిర్గుణం. ఒక రకంగా తమోగుణంలో వున్న వారి ఆలోచనలు వినాశకరంగా వుంటాయి. అలాగే రజోగుణంలో వున్న వారి ఆలోచనలు వ్యతిరేకంగా వుంటాయి. అలాగే సాత్వికగుణంలో వున్నవారి ఆలోచనలు అనుకూలంగా వుంటాయి. అలాగే నిర్గుణ స్థితిలో వున్న వారి ఆలోచనలు ఆశ్చర్యం గొలిపే విధంగా వుంటాయి. అంటే మానవుని గుణాలను బట్టే ఆలోచనా విధానం వుంటుందని తెలుసుకోవచ్చు.

వారి ఆలోచనా విధానాన్ని బట్టే వారి పనులు వుంటాయి. వారి పనులను బట్టే వారి జీవితంలో ఫలితాలు వుంటాయి. ఉదాహరణగా కొన్నిటిని చూద్దాం.

**(1) వినాశకర ఆలోచనలు (Disastrous Thinking) :**

సహజంగా కొంతమందికి ఇతరులంటే ఇష్టం వుండదు. అందుచేత ఇతరులకు చెడు జరగాలని కోరుకుంటూ వుంటారు. అందుచేత అలాగే ఆలోచిస్తూ వుంటారు. ఉదాహరణకు వాడికి కష్టం రావాలని, నష్టం రావాలని, వాడు నాశనమై

పోవాలని, వాడు తలపెట్టిన కార్యం విజయవంతం కాకూడదని, వాడికి అవమానం జరగాలని, వాడికి ఆ పేరు రాకూడదని, వాడు పాడైపోవాలని, వాడు ఇబ్బందులు పడాలని, వాడికి ఎలాంటి సహకారం లభించకూడదని మనస్సులో అనుకుంటూ వుంటారు. అలా అనుకునేవారు వారికి ఏ విధమైన సహకారం చెయ్యరు. ఎవరైనా సహకారం చేస్తూంటే వద్దని చెబుతారు, నిరుత్సాహ పరుస్తారు. తమ శక్తిమేర వారి పురోగతిని అడ్డుకునే ప్రయత్నం చేస్తారు.

ఇలా ప్రయత్నించడమన్నది సృష్టికి, సృష్టి ధర్మానికి విరుద్ధమైన చర్య. అలా ఒకరికి నష్టం కలిగించడానికి, కష్టాలు పాలు చెయ్యడానికి ప్రయత్నించడం వల్ల సృష్టి ధర్మాన్ని అనుసరించి దానికి తగ్గ ఫలితం తానే అనుభవించవలసి వస్తుంది. అలాంటి వాడు దానికి అనుగుణమైన ఫలితాన్ని తానే పొందుతాడు. వాడిని నష్టపెట్టాలని చూస్తే వాడు నష్టపోడు సరి కదా తిరిగి తానే నష్టపోతాడు, వాడిని కష్టపెట్టాలని చూస్తే చివరకు తానే కష్టాలపాలవుతాడు.

అందుచేత తెలుసుకోండి. ఎవరైనా సరే ఇష్టం లేకపోతే వాడి మానాన వాడిని వదిలెయ్యండి అంతేకానీ ద్వేష బుద్ధితో ఏమి చెయ్యాలనుకున్నా తిరిగి మీరే నష్టపోతారు, కష్టాల పాలవుతారు.

అందుకే **"ఎలాంటి ఆలోచనా విధానం వుంటే అలాంటి ఫలితాలే పొందుతారని అంటారు".** దీనినే భగవద్గీతలో **"యద్భావం తద్భవతి"** అని చెప్పబడింది.

సహజంగా ఇలాంటి ఆలోచనా విధానానికి మనిషి యొక్క తమోగుణమే కారణం. ఇలాంటి గుణంలో వున్నవారు తమకు తెలియకుండానే అలాంటి ఆలోచనలు చేస్తూ, అలాగే ప్రవర్తిస్తూ, చివరకు అలాంటి ఫలితాలే పొందుతూ వుంటారు. అందుచేత అలాంటి ఆలోచనా విధానం వున్నవారు అంటే ఇతరుల పట్ల ద్వేషాన్ని ప్రదర్శించే వారు వెంటనే తమ గుణాన్ని మార్చుకునే ప్రయత్నం చెయ్యాలి. లేకపోతే చివరకు వారే నష్టపోతారు.

మరి గుణం మారాలంటే ఎవరైనా సరే తప్పనిసరిగా "సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి". "శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం" చెయ్యాలి.

**(2) వ్యతిరేక ఆలోచనలు లేక విరుద్ధమైన ఆలోచనలు (Negative Thinking) :**

కొంతమందికి ప్రతీ దానికి భయమే. ప్రతీ దానికి అనుమానమే. ప్రతీ దానికి సంకోచమే. నేను చెయ్యగలనో? లేదో? నేను చెయ్యలేనేమో? నా వల్ల ఎక్కడ అవుతుంది? అది నాకు సాధ్యం కాదేమో? అని సందేహిస్తూ వుంటారు.

అలా సందేహించడం వల్ల ఆ పని పూర్తి విశ్వాసంతో చెయ్యరు. ఒక్కొక్కసారి ఆ పని ప్రారంభించరు కూడా! ప్రారంభించినా అడుగడుగునా సందేహమే. అందువల్ల చివరకు ఆ ఫలితం సాధించలేరు. అందుచేత వారు అనుకున్న దానికి విరుద్ధమైన ఫలితాలు పొందుతారు.

అలాగే చాలా మంది నేను మాట్లాడలేనేమో అనుకుంటారు... మాట్లాడలేరు కూడా. నేను సంపాదించలేనేమో అనుకుంటారు... సంపాదించలేరు కూడా. నేనెక్కడ పాడగలను, నేనెక్కడ ఆడగలను అని అనుకుంటూ అసలు ఆ పనే చెయ్యరు, ప్రారంభించరు. చివరకు పాడలేరు, ఆడలేరు కూడా.

అలాగే నేను ఒక్కదానినే వెళ్ళలేను, నేను ఐ.ఎ.ఎస్. చదవలేను, నేను ఎలక్షన్లలో నిలబడలేను లాంటివన్నీ వ్యతిరేక ఆలోచనలే. ఇలాంటి ఆలోచనలు వున్నవారు అసలు ఆ పని చెయ్యరు, ప్రయత్నించరు, ప్రారంభించరు. అలాంటి వారికి ఆ ఫలితాలు ఎలా వస్తాయి? రావు కూడా. అందుకే **"యద్భావం తద్భవతి"** అన్నారు.

ఇలాంటి వ్యతిరేక ఆలోచనలకి కారణం వారిలోని రజోగుణమే. అలాంటి వారు ధ్యానం చేస్తే మెల్లిగా వారి గుణం మారిపోతుంది. వారిలోని ఆలోచనా విధానం కూడా మారిపోతుంది.

### (3) అనుకూల ఆలోచనలు (Positive Thinking) :

ఈ ఆలోచనా విధానం సాత్విక గుణంలో వున్నవారికి వుంటుంది. వారు చెయ్యగలననుకుంటారు - చేస్తారు. రాయగలననుకుంటారు - రాస్తారు. మాట్లాడగలన నుకుంటారు – మాట్లాడతారు. పాడగలననుకుంటారు – పాడతారు. సంపాదించగల ననుకుంటారు – సంపాదిస్తారు. ఉపకారం చెయ్యాలనుకుంటారు. చేస్తారు. లోకకళ్యాణకరమైన పనులు చెయ్యాలనుకుంటారు - చేస్తారు.

వీరిలో వ్యతిరేక భావం వుండదు, సంకోచం వుండదు. నిస్సంకోచంగా కృషి చేస్తారు. చివరకు సాధిస్తారు. ఫలితం పొందుతారు.

### (4) ఆశ్చర్యకరమైన, అద్భుతమైన ఆలోచనలు (Miraculous Thinking):

ఈ రకమైన ఆలోచనా విధానం నిర్గుణ స్థితిలో వున్న వారికి వుంటుంది. ఎందుచేతనంటే వారు ఆలోచించే విధానం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుంది. సామాన్యులు అనుకోని, ఆలోచించలేని, నిర్ణయించలేని నిర్ణయాలు తీసుకుంటారు. ఆ పని నేను సాధిస్తాను అని వారు ప్రకటించగానే... ఆ ప్రకటన అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇది సాధ్యమా? అవుతుందా? అసలు ఆయన చెయ్యగలడా? ఎలా

సాధిస్తాడు? అని ఒకరికొకరు ప్రశ్నించుకుంటారు. ఆశ్చర్యంగా చెప్పుకుంటారు.

కానీ చివరకు ఆయన ఆ పని ప్రారంభిస్తారు, సాధిస్తారు, అందరికీ ఆశ్చర్యం కలిగిస్తారు కూడా.

అలా మనం గమనిస్తే సుభాష్‌పత్రిగారు ఎన్నో కార్యక్రమాలు ప్రకటిస్తున్నారు. వాటిని సాధించడానికి విశేషమైన కృషి చేస్తున్నారు. అలాగే అందరూ ఆశ్చర్యపోయే విధంగా ఫలితాలు కూడా సాధిస్తున్నారు.

ఈ లోకాన్ని ధ్యానమయం చేస్తాను అని చెప్పడమే కాదు, ఇప్పటికే ఎన్నో కోట్ల మందితో ధ్యానం చేయిస్తున్నారు. అందరి చేత మాంసం మాన్పిస్తాను అని చెప్పడమే కాదు, ఎన్నో కోట్ల మందిని ఇప్పటికే శాకాహారులుగా మార్చగలిగారు. లక్ష పిరమిడ్లు నిర్మింపచేస్తాను అని చెప్పడమే కాదు, ఇప్పటికే కొన్ని వేల పిరమిడ్లు నిర్మింప చేసారు.

ఆయన ఇంకా ఆధ్యాత్మిక వేత్తలే పరిపాలన చెయ్యాలి అని "పిరమిడ్ పార్టీ"ని స్థాపించడమే కాకుండా దాని కోసం విశేషమైన కృషి కూడా చేస్తున్నారు. చేతిలో రూపాయి లేకపోయినా కోట్ల రూపాయలతో పెద్ద పెద్ద పిరమిడ్లు నిర్మింపచేస్తున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేల మందితో పెద్ద పెద్ద ధ్యాన యజ్ఞాలు నిర్వహిస్తున్నారు.

ఇదంతా ఆయన యొక్క ఆశ్చర్యకరమైన ఆలోచనా విధానం వల్లే ఆయన సాధించగలుగుతున్నారు. కారణం ఆయన నిర్గుణ స్థితిలో వుండడం వల్లే. అందుకే "యద్భావం తద్భవతి" అన్నారు.

**కోరికలు పోయి చింతలన్నీ అణిగిపోయినప్పుడు మనస్సు నిశ్చలం అవుతుంది. అటువంటి వానికి ఏమీ అక్కరలేదు. అతడే సార్వభౌముడు.**
**– కబీరు**

# గుణం ఎవరికి మారుతుంది?

ఏ పదార్థాన్ని ఎన్ని రూపాలుగా మార్చినా దాని గుణం మారదు.

రాయిని ఎన్ని రూపాలుగా తయారు చేసినా ఏ రూపంగా చెక్కినా రాయి గుణం మారదు. ఆ రూపం రాయి గుణాన్నే ప్రదర్శిస్తుంది. ఉదాహరణకు రాయిని విగ్రహంగా మార్చినా రాయి గుణం మారదు. రాయి గుణాన్నే విగ్రహం ప్రదర్శిస్తుంది.

రాయి ఎలా కదలలేదో... విగ్రహం కూడా కదలలేదు. కర్రతో కొట్టినా, చాకుతో పొడిచినా, కత్తితో గాటు వేసినా రాయి ఎలా స్పందించదో... విగ్రహం కూడా అలాగే స్పందించదు. రాయిని నీళ్ళలో వేస్తే ఎలా మునిగిపోతుందో! విగ్రహం కూడా అలాగే మునిగిపోతుంది. రాయిని అగ్ని లోకాలిస్తే ఎలా పగిలిపోతుందో! విగ్రహం కూడా అలాగే పగిలిపోతుంది. రాయిని తన్నితే మోకాలికి ఎలా దెబ్బ తగులుతుందో... విగ్రహాన్ని తన్నినా మీకు అలాగే దెబ్బ తగులుతుంది. రాయితో మాట్లాడితే ఎలా సమాధానం చెప్పదో... విగ్రహం కూడా అలాగే మాట్లాడదు, సమాధానం చెప్పదు.

అలాగే చెక్కతో కానీ లోహంతో కానీ ఏ రూపాలు తయారు చేసినా అవి వాటి గుణాలు మార్చుకోవు. చెక్కను చెద పురుగులు తినగలవు అలాగే చెక్క బొమ్మను కూడా తినగలవు. చెక్క నీటిలో తేలుతుంది. అలాగే చెక్క బొమ్మ కూడా నీటిలో తేలుతుంది. చెక్కను అగ్ని కాల్చగలదు. అలాగే చెక్క బొమ్మను, చెక్క విగ్రహాన్ని కూడా అగ్ని కాల్చగలదు.

అలాగే లోహం వేడికి కరుగుతుంది. దానితో చేసిన బొమ్మ కూడా కరుగుతుంది. లోహాన్ని కరిగించి రకరకాల బొమ్మల ఆకారాలు చెయ్యవచ్చు. అలాగే లోహాలతో చేసిన రకరకాల బొమ్మలు కరిగించి వివిధ రకాల ఆకృతులుగా మార్చవచ్చు. ముద్దగా కూడా చెయ్యవచ్చు.

కానీ మనిషి గుణం మారుతుంది. దానిని బట్టే మనిషి ప్రవర్తనను కూడా మార్చవచ్చు. అంటే మానవుణ్ణి మాధవుడిగా మార్చవచ్చు. అదే మనిషి యొక్క గొప్పతనం. అలా మనిషి గుణం ధ్యానం ద్వారా మార్చవచ్చు. కానీ ఏ ఖనిజం యొక్క గుణం ఏం చేసినా మార్చలేము.

అందుచేత తెలుసుకోండి గుణం మారని రాయి కంటే, గుణం మారే మనిషే గొప్పవాడు, గొప్పవాడైన మనిషి గొప్పగా ప్రవర్తించాలి. అందుకు ధ్యానం చెయ్యాలి.

**రాయిని పూజిస్తేనే భగవంతుడు లభించేటట్లయితే.. అన్నింటికన్నా పెద్దరాయి అయిన పర్వతాన్ని పూజిస్తాను. అంతకంటే తిరగలిని పూజిస్తే కనీసం రొట్టెలు చేసుకునే పిండైనా లభిస్తుంది. – కబీరు**

# హృదయంలో నింపవలసినవి

"దయగల హృదయమే భగవన్నిలయం" అంటారు. అంటే నీ హృదయంలో దయ వుంటే నీలో భగవంతుడు కొలువై వుంటాడని అర్థం. అలా భగవంతుడు ఎవరి హృదయంలో కొలువై వుంటాడో వాడు దైవంతో సమానం.

అలాంటి వారు ద్వేషిస్తారా? హింసిస్తారా? బాధిస్తారా? పగ, ప్రతీకారం చేస్తారా? అంటే కచ్చితంగా చెయ్యరు. మరి లోకంలో ఇవన్నీ ఎందుకు చేస్తున్నారు? అంటే వారి హృదయంలో అవే వున్నాయి. అందుకే ఇవన్నీ చేస్తున్నారు. కానీ ఇవన్నీ మానవునకు నష్టాన్ని కలిగించే పనులు, కష్టాలు పాలు చేసే పనులు. అందుచేత మీ హృదయంలో ఇలాంటి వాటికి చోటివ్వకండి. మీ హృదయంలో ఏవి నింపాలో తెలుసుకోండి.

ఆలోచించండి మీ హృదయంలో ప్రేమను నింపితే ద్వేషానికి చోటెక్కడిది? మీ హృదయంలో శాంతిని నింపితే అశాంతికి తావెక్కడిది? మీ హృదయం ఆనందంతో నింపితే దుఃఖానికి తావెక్కడిది? మీ హృదయం దయతో నింపితే నిర్దయకు తావెక్కడిది? మీ హృదయాన్ని కరుణతో నింపితే కాఠిన్యానికి తావెక్కడిది. మీ హృదయం అహింసతో నింపితే హింసకు తావేది? మీ హృదయం ధర్మంతో నింపితే అధర్మానికి తావేది? మీ హృదయంలో న్యాయాన్ని నింపితే అన్యాయానికి తావేది?

మీ హృదయంలో ఇవన్నీ నింపాలంటే భగవంతుడినే నింపాలి. అంటే ప్రతిష్టించాలి. అపుడు అన్ని నింపిన వారవవుతారు. సకల సద్గుణాలు నింపుకున్న వారవుతారు. అపుడు అనవసరమైన వాటికి వేటికీ తావు వుండదు. హృదయంలో భగవంతుని వుంచాలంటే ముందు మనస్సును ఖాళీ చేయాలి.

అంటే మనస్సులో ఏమీ వుండకూడదు. అలా చేస్తే అక్కడ వుండేది 'ఆత్మ' ఒక్కటే. అంటే భగవంతుడు ఒక్కడే. దానికి శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం చేస్తే చాలు. ధ్యానం చేస్తే నెమ్మదిగా నీ హృదయంలో 'భగవంతుడే' వుంటాడు. అపుడు ససకల సద్గుణాలు నీతో వున్నట్టే!

**నేను అన్న అహంకారం ఉన్నంతవరకూ ఈశ్వరుడు లేడు. కాని ఇప్పుడు అంతా ఈశ్వరుడే వున్నాడు. నేను లేను. హృదయంలో జ్ఞాన దీపం ఎప్పుడు వెలిగిందో, వెంటనే అంధకారం పోయింది. – కబీరు**

# పవిత్ర కార్యం

ఎక్కడ దేవతలు వుంటారో అది స్వర్గం. ఎక్కడ రాక్షసులు వుంటారో అది నరకం.

ఏ పని చేసేటపుడు తమోగుణ భావాలు వుండవో! అంటే అన్నీ నాకే కావాలి, అంతా నాకే కావాలి అన్న భావాలు, అలాగే రజో గుణ ఆలోచనలు వుండవో! అంటే నేనే గొప్పవాడిని అవ్వాలి, అందరికంటే గొప్పగా వుండాలి అన్న ఆలోచనలు. అంతేకాదు సాత్విక గుణ భావాలు కూడా వుండవో! అంటే నేను ఉపకారం చేస్తున్నాను, నా వల్లే ఈ మంచి జరుగుతుంది అన్న భావాలు వుండవో ఆ పనిని పవిత్ర కార్యం అంటారు. అంటే నేను, నాది లేకుండా చేసేది.

అలాంటి పని ఒకటే ఒకటి వుంది. అదే సామూహిక ధ్యానం. కారణం ధ్యానంలో ఇవేమీ వుండవు. ఏ ఆలోచనలు వుండవు. అంతా శూన్యం. శూన్యమే పవిత్రమైన స్థితి అలా అంతా శూన్య భావంతో వున్నప్పుడు పవిత్రంగా వున్నట్టే. కారణం స్వార్థపూరితమైన ఆలోచనలే అపవిత్రమైన స్థితి.

అలా అంతా పవిత్రంగా వున్న సమయమే పవిత్ర సమయం. అంతా పవిత్రంగా వున్న ప్రదేశమే పవిత్ర ప్రదేశమవుతుంది. అలాంటి సమయంలో, అలాంటి ప్రదేశంలో, అలాంటి పవిత్ర కార్యం జరుగుతున్నప్పుడు అంటే సామూహిక ధ్యానం జరుగుతున్నప్పుడు దేవతలు కొలువై వుంటారు. ఆశీస్సులు అందచేస్తూ వుంటారు. అంటే శక్తిని ప్రసరింప చేస్తూ వుంటారు. దీనినే సినిమాలలో పూలవర్షం కురిపిస్తున్నట్టుగా చూపిస్తారు. అందుచేత సామూహిక ధ్యానమే అన్నిటికంటే పవిత్ర కార్యం.

అందుచేత ఎక్కడ సామూహిక ధ్యానం వుంటుందో, అక్కడ మంచి ఫలితాలు వుంటాయని తెలుసుకోండి.

**ఏ వనంలో అయితే సింహం తిరగలేదో.. పక్షులు ఎగరలేవో... రాత్రి పగలు అనే స్థితి వుండదో.. అక్కడ కబీరు నివాసం ఏర్పరచుకున్నాడు. అంతరార్థం : సహస్రార స్తితిలో ఏదైతే వుందో అక్కడ మనస్సు అనే సింహం తిరగలేదు. ఇంద్రియాలనే పక్షులు ఎగరలేవు. రాత్రి, పగలు అనే ధ్యాసే వుండదు. అక్కడ కబీరు లయమై వున్నాడు.**

**– కబీరు**

# పుట్టినది - పెట్టినది

దేహం పుట్టినది. తరువాత తగిలించుకున్నవన్నీ పెట్టినవి.

ఈ లోకంలో దేహం అన్నది అందరికి ఒకేలా పుట్టింది. కానీ తరువాత మానవులు తమకు నచ్చినవి ఎన్నో పెట్టుకున్నారు.

పేరు, గోత్రం పెట్టుకున్నవే. కులం, మతం పెట్టుకున్నవే. ప్రాంతం, దేశం పెట్టుకున్నవే. పదవులు, హోదాలు తగిలించుకున్నారు. ఇవన్నీ పెట్టుకున్నవే. కానీ ఏదీ పుట్టింది కాదు. అంటే భగవంతుడు సృష్టించింది కాదు.

ఇంకా జమీందారు, రాజు, పేద, బలవంతుడు, అందగాడు ఇలా అనుకునేవి కొన్ని, పెట్టుకొన్నవి కొన్ని. తగిలించుకున్నవి కొన్ని. ఇవన్నీ ఒక్కసారిగా వదిలేసిపోతున్నారు. ఎలా వచ్చారో! అలా పోతున్నారు. ఏదీ లేకుండా వస్తారు. ఏదీ లేకుండా పోతారు. అంటే దేహం ఎలా వచ్చిందో! అలా పోతుంది.

కానీ పెట్టుకున్నవన్నీ శాశ్వతమనుకుంటూ! అవే నేననుకుంటూ, నావనుకుంటూ వాటిని కాపాడుకుంటూ, పోషించుకుంటూ, పెంచుకుంటూ వాటి కోసం కలహించుకుంటూ, చేయకూడని పనులు చేస్తూ, సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తూ, అధర్మంగా ప్రవర్తిస్తూ మానవులు రకరకాలుగా దుఃఖానికి లోనవుతున్నారు.

అలా ఎవరికి వారు ఈ కులాలు, మతాలు, ప్రాంతాలు అన్నీ పెట్టుకుని మిగిలిన వారంతా వేరు వేరు అనుకుంటున్నారు. ద్వేషించుకుంటున్నారు. మోసగించుకుంటున్నారు, కలహించుకుంటున్నారు, నష్టపరచుకుంటున్నారు. చివరకు కష్టాల పాలవుతున్నారు.

అలాగే పేరు పెట్టుకుని ఆ పేరు నేననుకుంటున్నారు. ఆ పేరును ఎవరైనా దూషించినా, విమర్శించినా బాధపడుతున్నారు. ప్రతి విమర్శ చేస్తున్నారు, గొడవలకు దిగడం చేస్తున్నారు. పొగిడితే పొంగిపోతున్నారు. ఆ పెట్టుకున్న పేరుకు పేరు కోసం పాకులాడుతున్నారు. తెలుసుకోండి! ఇదంతా పెట్టుకున్న పేరు కోసం మాత్రమే, మీ కోసం కాదు.

తెలుసుకోండి. అంతా ఒకేలా పుట్టారు. చివరకు అంతా ఒకేలా వెళతారు. చివరకు ఏదీ వుండదు, ఎవరూ వుండరు. ఈ మాత్రం కోసం ఎందుకీ ఆరాటాలు? ఎందుకీ ఆర్భాటాలు? ఎందుకీ పాపాలు? ఎందుకీ దుఃఖాలు?

అందుచేత తెలుసుకోండి! అంతా ఒకదాని నుంచే పుట్టారు. ఒకదానిలోకే పోతారు. ఇదే సృష్టి రహస్యం. ధ్యానం చేస్తే ఇదంతా మీకు తెలుస్తుంది. ముందు ధ్యానం చెయ్యండి.

# ఆయుష్షు

ధ్యానం చెప్పేవారిని కొంతమంది అడుగుతూ వుంటారు.

ధ్యానం చేస్తే ఆయుష్షు పెరుగుతుందా? అంటే ఎక్కువ కాలం జీవిస్తామా? అని అడుగుతూ వుంటారు. కానీ దానికంటే ముందు తెలుసుకోవలసిన విషయాలు ఎన్నో వున్నాయి.

ఎందుచేతనంటే ఉన్న ఆయుష్షునే ఏం చేసుకోవాలో తెలియటం లేదు. ఇంకా ఆయుష్షును పెంచుకుని ఏం చేస్తాం? ఈ ఆయుష్షునే ఎలా వినియోగించు కోవాలో? జీవితంలో ఆనందంగా ఎలా బతకాలో? రోగాలు, కష్టాలు లేకుండా ఎలా బ్రతకాలో తెలియట్లేదే! ఇంకా ఆయుష్షు పెంచుకుని ఏమి చేసుకుంటాం?

ఇప్పుడు వున్న వారిలోనే చాలా మంది కష్టాలు భరించలేక, సమస్యలు తట్టుకోలేక ఇలా బ్రతికే కంటే చావడం మేలని అనుకుంటుంటే ఇంకా ఆయుష్షు దేనికి ? ఎక్కువ కాలం బ్రతికి ఏమి చేస్తాం?

ధ్యానసాధన దేనికంటే ఎంతకాలం బ్రతికాము అని కాదు, ఎంత ఎక్కువకాలం బ్రతుకుతాము అని కూడా కాదు, ఎలా బ్రతికాము? అన్నదానికోసమే. తెలుసుకోండి "కలకాలం కాకిలా బ్రతకడం కంటే కొంతకాలమైనా హంసలా జీవించాలి".

"కష్టాలతో బ్రతకడం ముఖ్యం కాదు. ఆనందంగా జీవించడం ముఖ్యం".

"భోగిలా బ్రతకడం కాదు. యోగిలా జీవించాలి". కారణం భోగి ధన సంపాదనకు చూస్తాడు. దుఃఖం తెచ్చుకుంటాడు. యోగి ధ్యాన సాధన చేస్తాడు. దుఃఖ నివారణ చేసుకుంటాడు, ఆనందం పొందుతాడు.

జీవితానికి ఆయుష్షు ముఖ్యం కాదు, ఆనందం ముఖ్యం. ఆనందం కోసమే ధ్యానం. ప్రస్తుతం సమస్యలు లేకుండా ఆనందంగా జీవించేవారు జీవిస్తున్నారో! అలా జీవితాంతం జీవించడానికే ధ్యానం.

భోగాలు అనుభవించడం గొప్ప కాదు. దుఃఖం లేకుండా, ఆనందంగా జీవించడమే గొప్ప. దాని కోసమే ధ్యానం చెయ్యాలి, అంతే కానీ ఆయుష్షు కోసం కాదు.

# శుభాకాంక్షలు

కొన్ని కొన్ని సందర్భాలలో శుభాకాంక్షలు తెలుపుతూ వుంటారు. పుట్టిన రోజు, దీపావళి, సంక్రాంతి, దసరా, కొత్త సంవత్సరం లాంటి పర్వదినాలలో శుభాకాంక్షలు తెలపడం ఆనవాయితీ అయిపోయింది.

Wish You a Happy New Yar, Happy Diwali, Happy Pongal, Happy Christmas అంటూ ఆ రోజు ఆనందంగా వుండాలని శుభాకాంక్షలు చెపుతూ వుంటారు. కానీ అంతకన్నా ఆలోచించరు. కానీ ఆలోచించాలి.

తెలుసుకోండి శుభాకాంక్షలు చెప్పడం అంటే నీకు శుభాన్ని కాంక్షిస్తు న్నాను అని అర్థం. అంటే ఆ రోజు... అది కొత్త సంవత్సరం కావచ్చు, దీపావళి కావచ్చు, సంక్రాంతి కావచ్చు. క్రిష్టమస్ కావచ్చు, అది ఏదైనా సరే నీకు శుభం అంటే మంచి జరగాలని కోరుకుంటున్నాను అని చెప్పడమే దీని అర్థం.

ఒకరకంగా అలా చెపుతున్నారంటే అర్థం, వారి జీవితంలో శుభం జరగటం లేదనేగా? ప్రతీ రోజు శుభం అంటే మంచి జరుగుతున్నప్పుడు మరలా మంచి జరగాలని కోరుకోవలసిన అవసరం ఏముంది?

ఆలోచించండి ఆరోజే ఎందుకు చెపుతున్నారు? అంటే కనీసం ఆ రోజైనా శుభం అంటే మంచి జరగాలని, ఆనందంగా వుండాలని కోరుకుంటున్నట్టే కదా? అలా చెపుతున్నారంటే ఒక రకంగా వారి జీవితంలో శుభం లేదని, వారు మంచిగా లేరని, వారికి తెలియపరుస్తున్నట్లేగా? వారిని ఆక్షేపిస్తున్నట్టేగా ?

అందుచేత ఏదైనా చెడు జరుగుతున్నప్పుడు, వారి జీవితం బాగోనపుడు అనటంలో అర్థముంది కానీ మంచిగా వున్నప్పుడు అనటంలో అర్థం లేదు. ప్రతి ఒక్కరూ ఇది ఆచారంగా వస్తుందని చేస్తున్నారు కానీ ఆలోచించి చెయ్యటం లేదు. ఆలోచిస్తే ఆ పని చెయ్యరు.

ఆలోచించండి! అలా ఒకరు కోరుకుంటే మంచి జరుగుతుందా? అంటే ఆనందం కలుగుతుందా? అసలు వారికి ఆనందం ఎందుకు లేదు? వారు చేసిన తప్పుల వల్లే కదా? పాపాల వల్లే కదా? అవి చేయకుండా వుంటే చెడు జరగదు కదా? అపుడు ఆనందంగా వుంటారు కదా? అందుచేత ఆ పనులు చేయవద్దని చెప్పండి చాలు. అదే ఆ రోజుల్లో చెప్పవలసిన మంచి మాటలు. వారికి కావలసిన సందేశం. “బి ఎ వెజిటేరియన్” అనండి చాలు.

వారు మాంసం తినరు. పాపాలు చెయ్యరు. అపుడు వారికి చెడు జరగదు.

"బి ఎ బుద్ధా" అనండి అంటే బుద్ధుడివి అవ్వు. "బి ఎ కృష్ణా" అంటే కృష్ణుడివి అవ్వు. "బి ఎ వివేకానంద" అంటే వివేకానందుడివి అవ్వు. "బి ఎ రమణ మహర్షి" అంటే రమణ మహర్షి అవ్వమనండి అపుడు వారికి తాను కూడా అలాంటి గొప్పవారుగా అవ్వాలని తెలుస్తుంది. అలా గొప్పవారిగా అవ్వడానికి ప్రయత్నిస్తారు. అలా అంతా బుద్ధుళ్ళు, కృష్ణుళ్ళు, రాముళ్ళు అవుతే లోకం ఎంత గొప్పగా వుంటుందో వూహించుకోండి.

అలాగే వారిలోని అజ్ఞానం పోవాలంటే ధ్యానం చెయ్యమనండి. "బి ఎ మెడిటేటర్" అనండి. అంటే ధ్యానం చెయ్యి, ధ్యానివి అవ్వు అని చెప్పండి. చాలు. వారికి ధ్యానం చెయ్యాలని తెలుస్తుంది. ధ్యానం చేస్తారు. ధ్యానం చేస్తే గొప్పవారు కాగలుగుతారు. మనం దేవుళ్ళని అనుకునే వారంతా ధ్యానం చేసే దేవుళ్ళయ్యారు. వారిలాగే వీరు కూడా అపుడు వారికి ఎవరూ ఏ శుభాకాంక్షలు చెప్పనవసరం లేకుండానే మంచిగా వుంటారు. ఎప్పుడూ ఆనందంగా వుంటారు.

అంతేకానీ ఈ రోజైనా బాగా వుండు, ఆనందంగా వుండు అని అనవలసిన అవసరం లేదు.

ఎవరైనా రోగంతో బాధపడుతున్నప్పుడు, హాస్పటల్‌లో వైద్యం చేయించుకుంటున్నప్పుడు తొందరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను అని అనటంలో అర్థం వుంది కానీ, ఆరోగ్యంగా వున్న వారిని తొందరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని అనడంలో అర్థం వుందా? బాగున్న వారిని బాగున్నావా అంటారా? అలాగే ఆనందంగా వున్నా వారిని ఆనందంగా వుండు అని అనవలసిన అవసరం వుందా? ఆలోచించండి.

## హ్యాపీ బర్త్‌డే విషెస్ (పుట్టినరోజు శుభాకాంక్షలు)

అలా చెప్పడంలో ఆంతర్యం ఏమిటి?

పుట్టిన రోజు అన్నది ఆనందించే రోజు అనుకుంటారు. కానీ ఆలోచిస్తే వారి జీవితంలో 1 సంవత్సరం గడచిపోయింది. అంటే వారు చావుకి దగ్గరయ్యారు. ఆలోచించండి. చావు దగ్గరవుతున్నవారు సంబరపడతారా? ఆనందిస్తారా?

ఒకరకంగా అలా నష్టపోయి, చావుకి దగ్గరవుతున్నానని వారు బాధపడతారేమోనని, బాధపడవద్దు హ్యాపీగా వుండు, ఆనందంగా వుండు

అని అందరూ వారిని వూరడించడమే హ్యాపీ బర్త్‌డే చెప్పడమంటే.

అందుచేత అది అశుభాన్ని మరచిపొమ్మని చెప్పడమే శుభం చెప్పడంలోని అర్థం. ఆనందంగా వున్న మనిషికి ఆనందం కలగాలని కోరుకోవడమేమిటి? దుఃఖంలో వున్నవాడినే ఆనందంగా వుండు అని వూరడించాలి.

కానీ ఇలాంటి ఆచారాలు పాటించడం లోకంలో సామాన్యమై పోయింది. ఎవరూ ఆలోచించడం లేదు.

## పుట్టినరోజు నాడు కొవ్వొత్తులు ఆర్పడం - కేకులు కొయ్యడం

ఎక్కడైనా దీపం వెలిగించడం అన్నది శుభంగా భావిస్తారు. అందుకే ఏ కార్యక్రమం మొదలు పెట్టినా దీపారాధన చేస్తారు. అలాగే ఏ ఫంక్షన్ ప్రారంభించినా, ముందు జ్యోతిని వెలిగించి ప్రారంభిస్తారు. దీపారాధన చెయ్యకుండా పూజ కూడా చెయ్యరు. ఆఖరికి పూజ చెయ్యకపోయినా దీపమైనా వెలిగిస్తారు. కారణం అది శుభం కలిగిస్తుందని. విజయవంతమవుతుందని భావించడమే.

మరి అలాంటపుడు దీపాలను, జ్యోతులను ఆర్పి పండగ చేసుకోవడమేమిటి? అన్ని జ్యోతులను ఆర్పి చేసే పండగ విజయవంతమెలా అవుతుంది? వారి జీవితంలో శుభం ఎలా జరుగుతుంది?

దీపాలు ఆర్పడం శుభమైనప్పుడు దీపారాధనలు చేయడమెందుకు? అఖండ దీపాలను వుంచడమెందుకు? జ్యోతి ప్రజ్వలనలను చెయ్యడమెందుకు?

అలాగే పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తారు. పంచుతారు. కేకులు తింటారు. కానీ కేకులలో కోడి గుడ్లు కలుపుతారు. అంటే కాబోయే కోడి పిల్లలను చంపి వినోదం చేసుకుంటున్నారు. ఇది అశుభం కాక మరేమవుతుంది.

"హ్యాపీ లాంగ్ లైఫ్" అని చెపుతూ ఒక కోడిపిల్ల జీవితాన్ని పిండదశలోనే అంతం చేయడం ఎంత వరకు సమంజసం? ఎంతవరకు వివేకవంతమైన చర్య?

అందుచేత ఏ పని చేసినా ఆలోచించి చెయ్యాలి. ఇతరులు చేసారని చెయ్యకూడదు.

అలాంటి సందర్భాలలో మీరు మాత్రమే వినోదించడం కాదు. మీతో పాటు అందరికీ ఆనందం కలిగించే పనులు చెయ్యాలి. మనకు వున్న కొద్దిపాటి జీవితంలో లోకకళ్యాణ కరమైన కార్యక్రమాలకు వినియోగించాలి. అంతే తప్ప, ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ మన వల్ల ఏ జీవికి, ఏ ప్రాణికి హాని కలగకూడదు. ఏ ప్రాణి రోదించకూడదు. మనం ఎవరి హింసకు కారణం కాకూడదు.

అందరినీ మంచి వారిగా మార్చగలిగే పనులు చెయ్యాలి. అందుచేత అటువంటి సందర్భాలలో అందరి చేతా ధ్యానం చేయించండి. ధ్యానమే అందరికీ శుభాన్ని కలిగించే కార్యక్రమం. కారణం ధ్యాన మంటే భగవంతుని ఆశ్రయించడం. భగవంతుని మీద దృష్టి వుంచడం. భగవంతుని గుర్తు చేసుకోవడం. అందుచేత ధ్యానం గొప్పతనాన్ని చెప్పండి. అందరినీ ధ్యానులుగా మార్చే ప్రయత్నం చెయ్యండి.

ఇలాంటి పనుల వల్ల మీకు శుభాలు కలుగుతాయి. అవే శుభకార్యాలు.

- **ఓ సాధకుడా విచారణ చేయి, రెండవది లేదు. నీ మనస్సును భౌతికత నుంచి నిజతత్వం వైపునకు తిప్పు.**
- **ఆచార్యులు అన్ని చోట్లా లభిస్తారు కానీ విచారణ చేసేవాడు లభించడు. కోటి ఆచార్యుల కన్నా విచారణ చేసేవాడే శ్రేష్ఠుడు.**
- **అగ్నిలో కాళ్ళు పెట్టకుండా కేవలం అగ్ని అన్నంత మాత్రాన ఎలా కాలుతుంది. ఆత్మ తత్వాన్ని అనుభవంలో తెలుసుకోకుండా కేవలం ఆత్మజ్ఞానం అని అనటంలో లాభం ఏముంది?**

**– కబీరు**

# కాలం

కాలం గురించి కొంచెం తెలుసుకుందాం. ఎందుచేతనంటే చాలా మంది కాలం గురించి ఆలోచించరు. కాలం యొక్క గొప్పతనాన్ని తెలుసుకోరు. కానీ కాలం చాలా గొప్పది. కాలం యొక్క గొప్పతనాన్ని తెలుసుకున్నవారు కాలాన్ని అర్థం చేసుకున్నవారు ఎప్పుడూ ఎంతో ఆనందంగా జీవించగలుగుతారు. కాలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటారు. కాలాన్ని వృధా చెయ్యరు.

ముఖ్యంగా కాలం ఎంతటి గాయాన్నైనా మాన్పుతుంది. ఎంతటి బాధనైనా మరచిపోయేటట్టు చేస్తుంది. గమనిస్తే గాయాలు రెండు రకాలు వుంటాయి. ఒకటి శరీరానిది, రెండు మనస్సుది. చూడండి మీ శరీరానికి ఏ గాయమైనా తగిలిందనుకోండి. విచారించకుండా కొన్నాళ్ళు ఓపిక పట్టండి. మెల్లిగా ఆ గాయం మాయమైపోతుంది. అంటే మానిపోతుంది. అంటే లేకుండా పోతుంది. ఎలా పోయిందంటే కాలమే ఆ గాయాన్ని మాన్పింది. మీకు చెయ్యి తెగిందనుకోండి. రక్తం కారుతూ వుంటుంది. కానీ ఆ గాయాన్ని పట్టుకుని అలాగే కాసేపు కూర్చోండి. మెల్లిగా రక్తం గడ్డకడుతుంది. కొంతకాలానికి ఆ గాయం కూడా కనిపించదు. ఇదంతా కాల మహిమే.

అలాగే జీవితంలో అనుకోని సంఘటనలు జరిగాయనుకుందాం. కుటుంబంలో గొడవలు కానీ, వ్యాపారంలో నష్టం కానీ, రాజకీయాలలోదెబ్బతినడం కాని, దగ్గరి వారు ఎవరైనా చనిపోవడం కాని, లేదా ఏక్సిడెంటు అయినా... చాలా మంది మానసికంగా దెబ్బతింటారు. దీనినే మానసికంగా గాయపడటం అంటాం. అలాంటి వారు ఏ పని చేయలేరు, చేయగలిగిన పని కూడా చేయరు. కారణం మానసికంగా గాయపడటమే. అలాంటి వారిని గమనిస్తే కొన్నాళ్ళకు కోలుకుంటారు. జీవిస్తారు. ఇదంతా కాలం వల్ల వచ్చిన మార్పే. అందుచేత కాలం ఎంతటి గాయాన్నైనా మాన్పుతుందని, ఏ బాధనైనా మరచిపోయేటట్టు చేస్తుందని మనం స్పష్టంగా తెలుసుకోవచ్చు.

అలాగే ప్రతీ ఒక్కరికి అనేకరకాలైన సమస్యలు వుంటాయి. ఒక్కొక్కరికి ఒక్కో రకమైన సమస్య వుంటుంది. గమనిస్తే సమస్యలు లేని వారే వుండరు. అంతేకాదు సమస్య అన్నది బాధాకరం. అందుకే సమస్యవున్నవారు ఎంతో బాధకు గురవుతారు. అలా ఎంతటి బాధకు గురైన వారైనా కాలం గడిచే కొద్దీ ఆ సమస్య నుంచి బయటపడటం మనం చూస్తూనే వున్నాం. అందుచేత కాలం ఎలాంటి సమస్యనైనా పరిష్కరిస్తుందని తెలుసుకోవచ్చు.

అలాగే కాలం దేనినైనా సృష్టిస్తుంది. అలాగే సృష్టించబడిన దానిని దేనినైనా

హరిస్తుంది. ఆ శక్తి కాలానికి వుంది. చూడండి కాలం గడిచే కొద్దీ ఎన్నో సృష్టింపబడుతున్నాయి. వృక్షాలు, పక్షులు, క్రిమి కీటకాలు, జంతువులు, మానవులు ఎంతోమంది, ఎన్నో జీవరాజులు సృష్టింపబడుతున్నాయి. అలాగే ఆ కాలమే వీటన్నిటిని హరిస్తుంది కూడా.

అలాగే ప్రతీ ఒక్కరి జీవితంలో ధనం, ఐశ్వర్యం, భోగభాగ్యాలు కాలం సృష్టిస్తుంది. మరల కాలం గడిచే కొద్దీ అవన్నీ హరించబడుతున్నాయి. అలాగే ఉద్యోగాలు, పదవులు, పేరు, ప్రఖ్యాతులు చాలా మంది జీవితాల్లో కాలం సృష్టిస్తుంది. అదే కాలం మరల అన్నిటిని హరించడం కూడా మనం చూస్తున్నాం. అంతేకాదు యవ్వనం, అందం, బలం సృష్టింపబడుతున్నాయి కానీ కాలం అన్నిటిని చివరకు హరించడం కూడా చూస్తున్నాం. దీనిని బట్టి కాలం సృష్టించగలదు. అలాగే హరించగలదు అని కూడా తెలుసుకోవచ్చు.

అంతేకాదు **"కాలానికి గతం ఒక స్మృతి లాంటిది భవిష్యత్ ఒక కలలాంటిది".**

కాలం ప్రతీ ఒక్కరి జీవితంలో దుఃఖాన్ని మిగిలిస్తుంది. ఎన్నో ఆశలు రేకెత్తిస్తోంది. ఆనందాన్ని నింపుతూ వుంటుంది. గమనిస్తే కాలం ముందు అవన్నీ మార్పు చెందేవే. ఏది చూసినా మారుతూనే వుంటాయి. అంతేకాదు కాలం ముందు ఏదీ శాశ్వతం కాదు. గమనిస్తే ఇది అర్థమవుతుంది. కాలం మారే కొద్దీ అన్నీ మారి పోతూ వుంటాయి. ప్రవర్తనలు మారిపోతాయి. ప్రకృతి మారిపోతూ వుంటుంది. ప్రకృతిలోని వన్నీ మారిపోతూ వుంటాయి. ఇలా ఏది చూసినాకాలం వల్ల మార్పు జరుగుతూనే వుంటాయి. గమనిస్తే కాలానికి ఏదీ శాశ్వతం కాదని తెలుస్తుంది.

అందుచేత కాలం యొక్క గొప్పతనాన్ని తెలుసుకోవాలి. కాల నిర్ణయాన్ని కాదనకూడదు. కాలాన్ని ధిక్కరించకూడదు. కాల నిర్ణయానికి అనుగుణంగా జీవించాలి. కాల మార్పులను సహజంగా స్వీకరించాలి. కాలానికి అనుగుణంగా ప్రవర్తించాలి. అన్నీ కాలానికి వదిలిపెట్టాలి. కాలాన్ని వృధా చేయకూడదు. కాలం విలువ తెలుసుకోవాలి. అపుడే ఆనందంగా జీవించగలుగుతాం.

ఆ రకంగా ప్రవర్తించగలగాలంటే ఎవరైనా ధ్యానం చెయ్యవలసిందే.

**శరీరం అరటి తోట లాంటిది. మనస్సు మత్తుతో నిండిన ఏనుగు లాంటిది. జ్ఞాన రత్నం అనే అంకుశంతో మనస్సు అనే ఏనుగును తన వశంలో ఉంచుకున్న వాడే నిజమైన సాధువు.**

**– కబీరు**

# ముక్తి - భుక్తి

మనమంతా వచ్చింది ముక్తి కోసం కానీ చేసే ప్రయత్నం మాత్రం భుక్తి కోసం. కారణం వచ్చిన వారు వుండాలంటే భుక్తి తప్పనిసరి. భుక్తి లేకుండా ఎవరూ భూమి మీద వుండలేరు. భూమి మీద వుండకుండా ఎవరూ ముక్తి సాధించలేరు.

అందుచేత ముందు భుక్తి ప్రయత్నం తప్పనిసరి. కానీ మానవునకు ముక్తి కూడా అవసరమే. కారణం ముక్తి లేకపోతే దుఃఖంతో మానవుని జీవితం దుర్భరమవుతుంది. దుఃఖం అధికమవుతే ఒక్కొక్కసారి జీవించలేనంటారు. భుక్తి వున్నా అంటే భోగాలున్నా జీవించాలని వుండదు. అటువంటి పరిస్థితులలో భుక్తి అంటే భోగాలు వున్నా ప్రయోజనమేమిటి? అందుచేత మానవునకు ముక్తి కూడా కావాలి.

అంటే మానవునకు "భుక్తి – ముక్తి" రెండూ అవసరమే. మానవుడు రెండిటి కోసం ప్రయత్నం చెయ్యాలి. భుక్తి చూసుకుంటూ... ముక్తి కోసం కూడా ప్రయత్నించాలి. తన జీవితంలో ముక్తి కోసం కొంత సమయం కేటాయించాలి. అప్పుడే మానవుని జీవితం ఆనందమయమవుతుంది.

'భుక్తి'కి ధనం కావాలి. 'ముక్తి'కి ధ్యానం కావాలి. అందుచేత ధన సంపాదన చేస్తూ కాళీ సమయంలో ధ్యాన సాధన కూడా చెయ్యాలి. అలా చేసిన వారిదే, అలా జీవించిన వారిదే సరియైన, సవ్యమైన జీవితం. అందుచేత తప్పనిసరిగా ధ్యానం చెయ్యండి.

మానవునికి శరీరం వుంది కాబట్టి, ఈ శరీరానికి కొన్ని అవసరాలు వుంటాయి. ఈ శారీరక అవసరాలనే భుక్తి అంటారు. ఒకరకంగా ఏది లేకపోతే శరీరం మనుగడ సాగించలేదో వాటినే అవసరాలు అంటారు. ముఖ్యంగా మానవునకు (1) కూడు అవసరం (2) గుడ్డ అవసరం, (3) గూడు అవసరం, (4) తోడు కూడా అవసరమే.

సహజంగానే మానవుడు అవసరాలు సమకూర్చుకోవడానికి ప్రయత్నిస్తాడు. అలా ప్రయత్నించడమన్నది సహజం, సమంజసం కూడా. కానీ మానవుడు అవసరాలతో పరిమితమవ్వకుండా కోరికలకు బానిసై ఆ కోరికలు తీర్చుకోవడానికి రకరకాల పాపాలు చేస్తున్నాడు, తప్పులు చేస్తున్నాడు, ధర్మాన్ని తప్పుతున్నాడు, సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు. అలా చెయ్యడం వల్ల కష్టాల పాలవుతున్నాడు. ఆ కష్టాలు భరించలేక బయటపడే ప్రయత్నం చేస్తున్నాడు. అంటే సమస్యలు లేకుండా జీవించాలని ప్రయత్నిస్తున్నాడు. అంటే ముక్తి కోసం ప్రయత్నిస్తున్నాడు. ఏది ఏమైనా చివరకు కావలసింది ముక్తే కదా? మరి ఎప్పుడో చివరకు ప్రయత్నించే బదులు మొదటి నుంచి ప్రయత్నిస్తే జీవితంలో దుఃఖమే రాదు కదా? అందుచేత ముక్తి కోసం ముందు నుంచి ప్రయత్నించాలని తెలుసుకోండి. దానికి ధ్యానం చెయ్యండి.

# ఋణ విముక్తుడైతేనే ముక్తి

సహజంగా ప్రతి ఒక్కరూ ముక్తిని కోరుకుంటారు. అంటే దుఃఖం నుండి శాశ్వతంగా బయటపడాలని కోరుకుంటారు. మరి ముక్తి పొందాలంటే ముందు ఎవరైనా ఋణ విముక్తులవ్వాలి. ఋణ విముక్తులవుతే కానీ ఎవరూ ముక్తి పొందలేరు. కారణం ఇంతకు ముందు చేసిన కర్మల ద్వారా ఈ సృష్టికి మనం ఋణపడి వుంటాం. అందుచేత చేసిన ఋణం తీర్చుకోవలసిందే. ఋణం తీరకుండా ఈ జీవితం నుంచి బయటపడటం అసాధ్యం.

ఎందుచేతనంటే గతంలో మనం ఏం చేసినా దాని ఫలితం అనుభవించాలి. అంటే గతంలో మనం ఎవరినైనా హింసిస్తే... హింస ఋణపడి వుంటాము. ఆ ఋణం తీరాలంటే మనం కూడా అదే రకమైన హింస అనుభవించాలి. అలాగే ఎవరికైనా నష్టం కలిగించినా, కష్టపెట్టినా... ఆ ఋణం తీరాలంటే మనం కూడా నష్టపోవాలి, కష్టం అనుభవించాలి. అలా చేసినవన్నీ అనుభవిస్తేనే ఋణం తీరుతుంది. అలా ఋణం పూర్తిగా తీరిపోతే ఇంక జన్మించవలసిన అవసరం వుండదు. అంటే ముక్తిని పొందుతాం. అందుచేత "ఋణ విముక్తులవుతేనే ముక్తి లభిస్తుందని" తెలుసుకోండి.

అలాగే శాస్త్రాలలో ముక్తి పొందాలంటే మూడు రకాల ఋణాలు తీరాలని పేర్కొనడం జరిగింది. అవి ఏమిటో? ఆ ఋణాలు ఎలా తీర్చుకోగలమో? వివరంగా తెలుసుకుందాం.

(1) ఋషి ఋణం (2) దేవ ఋణం (3) పితృ ఋణం. ఈ మూడు ఋణాలు తీరితేనే ముక్తి వస్తుందని చెప్పబడింది. ఈ మూడు ఋణాలు ఎలా తీరుతాయో శాస్త్రాలలో ఈ విధంగా చెప్పబడింది.

**"జాయమానో వైబ్రాహ్మణ స్త్రిభిక్ ఋణవాజాయఛే,**
**బ్రాహ్మచర్యేణ ఋషిభ్యో, యజ్ఞేనదేవభ్య ప్రజయాపితృభ్యః"**

తా:- బ్రహ్మచర్యం ద్వారా ఋషి ఋణం, యజ్ఞం ద్వారా దేవరుణం, సంతానాన్ని కనడం ద్వారా పితృఋణం తీరుతుంది.

**1) ఋషి ఋణం :-**

బ్రహ్మచర్యం ద్వారా ఋషి ఋణం తీరుతుంది. బ్రహ్మచర్యమంటే

బ్రహ్మంలో చరించడం. తానే ఆత్మనని తెలుసుకోవటం. ఆత్మజ్ఞానం సంపాదించుకోవటం. ఆత్మ స్థితిలో జీవించడం, ఆత్మానుభవం పొందడం. దానికి కావలసిన ధ్యాన సాధన చెయ్యడం. అంటే ధ్యాన సాధన ద్వారానే ఋషి ఋణం తీరుతుంది.

**2) దేవ ఋణం :-**

యజ్ఞము ద్వారా దేవ ఋణం తీరుతుంది. యజ్ఞము అంటే లోకకళ్యాణ కరమైన పని. లోక కళ్యాణకరమైన పనులన్నిటికంటే గొప్పదైన ముక్తిని ఇచ్చే ధ్యానాన్ని అందరికీ పంచాలి అంటే చెప్పాలి. ధ్యానానికి సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొనాలి, అలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చెయ్యాలి, లేదా సహకరించాలి. అలాంటి పనులు చెయ్యడం ద్వారా యజ్ఞం చేసిన వారవుతారు. అపుడు కర్మలు పోతాయి. దేవ ఋణం తీరిపోతుంది. చేసిన కర్మలు దేవతలు రాసి వుంచుతారు, కాబట్టి, కర్మలు తీరిపోతే దేవ ఋణం తీరిపోతుంది.

**3) పితృ ఋణం :-**

సంతానాన్ని కనడం ద్వారా పితృఋణం తీరిపోతుంది. సంతానం అంటే తాను సంపాదించుకున్న జ్ఞానం పదిమందికి పంచాలి. తనలాంటి వారిని పదిమందిని తయారు చెయ్యాలి. తనలాగే జ్ఞానవంతుల్ని చెయ్యాలి. అంటే అందరికీ జ్ఞానబోధ చెయ్యాలి. ఇదే సంతానం కనడం అంటే. తనలాంటి వారిని కొంతమందిని తయారు చేస్తే పితృఋణం తీరిపోతుంది.

పై విషయాలను బట్టి ధ్యానం చెయ్యడం ద్వారా ఋషి ఋణం, లోక కళ్యాణ కరమైన పనులు అంటే ధ్యానాన్ని పంచడం ద్వారా దేవ ఋణం, సంపాదించిన జ్ఞానాన్ని పంచి తనలాంటి వాళ్ళను తయారు చెయ్యడం ద్వారా పితృఋణం తీరిపోతుందని తెలుసుకోవాలి. అలాంటి వారు ఋణవిముక్తులవుతారు. ముక్తి పొందుతారు.

అందుచేత తెలుసుకోండి. ముక్తి పొందాలంటే (1) ధ్యానం చెయ్యాలి, (2) ధ్యానానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించాలి. (3) ధ్యానాన్ని, జ్ఞానాన్ని అందరికీ పంచాలి. ఇదే ముక్తికి మార్గం.

# ధనము - జ్ఞానము

ధనమున్న వారి కంటే జ్ఞానమున్న వారే గొప్పవారు. అందుచేత ఎవరైనా జ్ఞానం పెంచుకోవడానికి ప్రయత్నించాలి. భవిష్యత్తులో జ్ఞానమున్న వారికే ఎక్కువ విలువ, గౌరవం వుంటుంది. జ్ఞానం పెంచుకునే మార్గాలలో పుస్తకపఠనం కూడా ముఖ్యమైనదే. యోగుల, జ్ఞానుల పుస్తకాలు చదవడం ద్వారా మన జ్ఞానాన్ని ఎంతో పెంచుకోవచ్చు. అందుచేత పుస్తకాలు బాగా చదవండి. పుస్తకాలు చదవటానికి ప్రాముఖ్యం ఇవ్వండి. జ్ఞానవంతమైన పుస్తకాలు సేకరించుకోండి.

మీ సమయాన్ని పుస్తకాలు అధ్యయనం చెయ్యడానికి, అలాగే మీ ధనాన్ని పుస్తకాలు సేకరించుకోవడానికి వినియోగించండి. ధనాన్ని వ్యర్థం చెయ్యకండి, వ్యర్థంగా కర్చు పెట్టకండి. విందులకు, వినోదాలకు, సరదాలకు కర్చు పెట్టకండి. జ్ఞానవంతమైన పుస్తకాలకు వినియోగించండి.

పత్రిగారు తన ధనాన్ని కూడా జ్ఞానవంతమైన పుస్తకాలకే ఖర్చు పెట్టేవారు. ఆయన 50 వేల పుస్తకాలు పైనే చదివారు. ఆయనకు జీతం రాగానే సగం డబ్బుతో పుస్తకాలు కొనేవారు. అంటే ఆయన ధనాన్ని జ్ఞానానికి వినియోగించేవారన్నమాట. అందుకే ఆయన అంత జ్ఞానవంతులయ్యారు. అందరి కంటే గొప్పవారయ్యారు. అందరికీ మార్గదర్శకులయ్యాడు. కారణం ఆయన దగ్గర అంతజ్ఞానం వుంది. ఆయన ధనాన్ని కర్చు పెట్టి జ్ఞానాన్ని సంపాదించుకునేవారు.

అందుచేత పుస్తకాలు సేకరించుకోవడానికి వెనకాడకండి. జ్ఞానవంతమైన పుస్తకాలు సేకరించి, జ్ఞానవంతులు కండి. ధనంతో పాటు మీ సమయాన్ని కూడా జ్ఞానం కోసం వినియోగించండి. కొంత సమయం పుస్తకాలు అధ్యయనం చెయ్యడానికి వినియోగించండి. ధనం కంటే జ్ఞానం గొప్పదని తెలుసుకోండి.

అంతేకాదు పుస్తకాలతో పాటు సత్యం తెలిసిన సత్యం చెప్పగలిగిన వారితో సాంగత్యం చెయ్యాలి. వీటితో పాటు విశేషంగా ధ్యానం చెయ్యాలి. ఈ రకంగా చేస్తే ఎవరైనా జ్ఞానవంతులవుతారు. సమాజంలో కీర్తించబడతారు. అందుచేత ధ్యానం, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం ద్వారా జ్ఞానధనులు అవ్వండి. లోకధనం కంటే జ్ఞాన ధనం చాలా చాలా గొప్పదని తెలుసుకోండి.

**నీళ్ళకు భయపడి గట్టుమీద కూర్చుంటే ఏం లభిస్తుంది.. సాహసం చేసి లోతుల్లోకి వెళితేనే లభించేది లభిస్తుంది.– కబీరు**

# ఎవరు చేసుకున్నది వారికే

నారద మహర్షి సృష్టిలోని ఒక ధర్మ సూక్ష్మాన్ని వాల్మీకి మహర్షికి బోధించడం జరిగింది.

వాల్మీకి భార్యను పోషించాలని, భార్యను సంతోష పెట్టాలని, ఆవిడ కోసం తాను హత్యలు చేసేవాడు, తప్పులు చేసేవాడు. కానీ తాను చేసిన పాపాల ఫలితం తనకు మాత్రవేమే చెందుతుంది తప్ప భార్యకు చెందదని తెలుసుకోలేకపోయాడు.

ఒకసారి నారదుడు వాల్మీకిని ఎందుకు ఈ పాపాలు చేస్తున్నావు? అని అడిగాడు. అపుడు వాల్మీకి నా భార్య కోసం అన్నాడు. అలా అయితే నువ్వు చేసిన పాపాలలో వాటా తీసుకుటుందేమో నీ భార్యను అడగమని నారదుడు అన్నాడు. అపుడు వాల్మీకి తన భార్య దగ్గరకు వెళ్ళి, నా సంపాదనలో భాగం అనుభవిస్తున్నావు, నా పాపంలో భాగం తీసుకుంటావా? అని అడిగితే ఆవిడ నిర్మొహమాటంగా నీ పాపంలో నాకు సంబంధం లేదు, నేనెందుకు తీసుకుంటానని అంది. అపుడు వాల్మీకిలో పరివర్తన కలిగింది. పాపాలు చెయ్యడం మానేసాడు. నారదుని సలహానుసరించి ధ్యానం చేసి గొప్ప ఋషి అయ్యాడు.

దీనిని బట్టి ఎవరు చేసుకున్నది వారికే చెందుతుందని తెలుస్తుంది. పాపమైనా, పుణ్యమైనా, ఇంకొకరి కోసం చేసినా... ఇంకొకరి ఉద్దేశ్యంతో చేసినా వారికి చెందవు. ఏదైనా చేసిన వారికే చెందుతాయి. అంటే నీ పిల్లల కోసం, భార్య కోసం, తల్లిదండ్రుల కోసం చేసినా అది వారికి చెందరు.

దీనిని బట్టి ఒకరి కోసం దొంగిలించినా, మోసం చేసినా, కోపంతో ఇంకొకరిని కొట్టినా, హింస చేసినా, కక్షతో హత్య చేసినా, అది చేసిన వారికే చెందుతుంది తప్ప, ఎవరి కోసం చేసారో వారికి చెందదు. ఒకవేళ ఆ పాపంలో ఇంకొకరి ప్రోత్సాహమున్నా, ఏ మాత్రం సంబంధమున్నా, దానికి సంబంధించిన వాటా, సంబంధించిన వాడికి వుంటుంది. ఆ పాపంలో ఎవరి ప్రమేయం లేకపోతే వారికి దానిలో భాగముండదు.

దీనిని బట్టి ఆలోచిస్తే ఇంకొకరి కోసం అంటే పిల్లల పేరుతో, తల్లిదండ్రుల పేరుతో, భార్యాభర్తల పేరుతో అంటే ఇంకొకరి పేరుతో చేసే పుణ్య కార్యాలు, మంచి పనులు, దానాల ఫలితం కూడా చేసిన వారికే చెందుతుంది. కారణం

అక్కడ వారి ప్రమేయం లేదు కాబట్టి. అందుచేత ఎవరు చేసింది వారికే చెందుతుంది.

అందుచేత ఆలోచించండి! మీరు చనిపోయిన తరువాత మీ పిల్లలు చేసే పుణ్యకార్యాల ఫలితం మీకు వస్తుందా? ఏ ఫలితమైనా మీరు వుండగా మీరు చేసుకుంటేనే వస్తుంది కాని, మీకు ఎంత వున్నా రాదు. అందుచేత మీరు వుండగానే ఏదైనా చేసుకోండి, ఇవ్వండి. ఆ ఇచ్చిన ఫలితమే మీ కూడా వస్తుంది.

అందుకే "మీదనుకున్నది ఏదీ మీది కాదు. మీదనుకున్న దాంట్లో ఎంతయితే లోకానికి, లోకులకు ఇస్తారో దాని ఫలితమే మీదవుతుందని తెలుసుకోండి". అందుచేత ఎవరు చేసుకున్నది వారికేనని తెలుసుకోండి.

పత్రిగారు డబ్బు ఖర్చు లేకుండా జీవితంలో ఇచ్చి, గొప్ప ఫలితం పొందే మార్గం అందరికీ బోధిస్తున్నారు. అదే ధ్యానాన్ని ఉచితంగా అందరికీ పంచడం, అంటే చెప్పడం. అందుచేత ధ్యానం చెయ్యండి. ధ్యానాన్ని అందరికీ చెప్పండి. మీరు జీవించి వుండగానే ఈ పనులు చెయ్యండి. అలా చేసిందే మీ కూడా వస్తుంది తప్ప మీరు చనిపోయిన తరువాత మీ పేరుతో ఎవరు ఏమి చేసినా అది మీకు చెందదు.

అందుచేత అన్ని పనులు చేసుకుంటూ, సంపాదించుకుంటూ కొంత సమయం ధ్యానానికి, ధ్యాన ప్రచారానికి కేటాయించండి. జీవితాన్ని వృథా చెయ్యకండి.

- **చేసిన కర్మ ఎప్పుడూ నిష్ఫలం కాదు. సప్త సముద్రాలు అడ్డుగా వున్నప్పటికీ సమయం వచ్చినపుడు ఫలం అంది తీరుతుంది.**
- **కలికాలంలో కర్మకు ఫలితం వెంటనే లభిస్తుంది. రైతు కుడిచేత్తో నాగలిని పట్టుకుని ఏ విధంగా విత్తుతాడో అదే ఫలాల్ని కోసుకుంటాడు.**
- **చెడ్డ పనులు చేసి సుఖాన్ని కోరుకుంటే అది ఎలా వస్తుంది? మర్రిచెట్టు విత్తనం విత్తితే మామిడిపళ్ళు ఎలా వస్తాయి?**
- **చేయాల్సినదంతా చేసి, దేవుళ్ళకు మొక్కితే ఉపయోగం ఏముంది? పొలంలో విత్తనాలే చల్లకపోతే కర్మఫలం ఎక్కడుంది?**
- **శరీరాన్ని ధరించి ప్రారబ్ధాన్ని అందరూ అనుభవించాల్సి ఉంది. జ్ఞాని దుఃఖాన్ని సంతోషంగా అనుభవిస్తే అజ్ఞాని ఏడుస్తూ అనుభవిస్తాడు.**

**– కబీరు**

# ఆత్మను హత్య చేయగలమా?

చాలా మంది ఆత్మకు చావు లేదు కదా? మరి ఆత్మను ఎలా హత్య చేయగలరు? అన్న సందేహం వ్యక్తం చేస్తూ వుంటారు. అందుచేత ఆత్మహత్య అంటే ఏమిటో తెలుసుకుందాం.

మానవులలో మరణం మూడు రకాలుగా సంభవిస్తూ వుంటుంది. (1) సహజ మరణం, (2) హత్య, (3) ఆత్మహత్య.

అందుచేత ఈ మూడు రకాల మరణాల గురించి, వాటి ఫలితాలు ఎలా వుంటాయో తెలుసుకుందాం. గమనిస్తే సహజ మరణం అన్నది సృష్టికి అనుగుణంగా జరిగేది. కానీ హత్య, ఆత్మహత్య అన్నవి అసహజ మరణం. సృష్టికి విరుద్ధంగా జరిగేవి. అందుచేత వాటి ఫలితాలు కూడా వేరుగానే వుంటాయి. ముందు మరణం అంటే ఏమిటో? హత్య అంటే ఏమిటో? ఆత్మహత్య అంటే ఏమిటో? తెలుసుకుందాం.

**మరణం :–** ఆత్మ శరీరాన్ని వదలడాన్ని మరణం అంటారు. అలాగే ఆత్మ శరీరంలో ప్రవేశించడాన్ని జన్మ అంటారు.

**హత్య :–** ఆత్మను శరీరం నుంచి బలవంతంగా బయటకు పంపడాన్ని హత్య అంటారు. అంటే ఆత్మను శరీరంలో వుండటానికి వీలులేనంతగా శరీరాన్ని విచ్ఛిత్తి చేయడాన్నే హత్య అంటారు. హత్య అన్నది ఇతరులు చేసేది.

**ఆత్మహత్య :–** ఆత్మను తనకు తానుగా శరీరం నుంచి బలవంతంగా బయటకు పంపడాన్ని ఆత్మహత్య అంటారు. అంటే తన శరీరాన్ని తనకు తాను విచ్ఛిత్తి చేసుకుంటారు. వురి వేసుకోవడం గానీ, శరీరాన్ని కాల్చుకోవడం గానీ, విషాన్ని, నిద్రమాత్రలు మింగడం కానీ, ఎందులోనైనా, అంటే నదిలో, నూతిలో, చెరువులో, కాలువలో దూకడం కానీ, ఎత్తైన ప్రదేశాల నుంచి అంటే మేడలు, కొండలు మీద నుంచి దూకడం, రైలు కింద పడడం లాంటివి చేసుకుని శరీరం పనికి రాకుండా చేసుకుంటారు. ఇక ఆత్మ ఆ శరీరంలో వుండటానికి ఎటువంటి ఆస్కారం వుండదు. అందుచేత ఆత్మ వెంటనే ఆ శరీరాన్ని వదలవలసి వస్తుంది.

దీనిని బట్టి "ఆత్మను బలవంతంగా శరీరం నుంచి బయటకు పంపడమే హత్య" అని తెలుసుకోవాలి. అలాగే 'ఆత్మ' అంటే తానే కాబట్టి తనకు తాను బలవంతంగా ఆత్మను శరీరం నుంచి బయటకు పంపితే అంటే తనకు తాను

(ఆత్మ) హత్య చేసుకుంటే 'ఆత్మహత్య' అంటారని తెలుసుకోవాలి.

అంతేకానీ ఆత్మహత్య అంటే ఆత్మను చంపడం కాదు. కారణం ఆత్మకు చావు లేదు. ఎవరూ చంపలేరు. అందుచేత 'ఆత్మహత్య' అంటే ఆత్మను తనకు తానుగా శరీరం నుంచి బలవంతంగా బయటకు పంపడమని తెలుసుకోవాలి. మరొక్కసారి తెలుసుకుందాం. 'ఆత్మహత్య' అంటే ఆత్మ చేసిన హత్య. అంటే తనకు తాను చేసుకున్న హత్య. ఇది ఇంకొకరు చేసిన హత్య కాదు. ఆత్మే తాను కాబట్టి తనకు తాను చేసుకున్న హత్యను "ఆత్మహత్య" అన్నారు. అంతేకానీ ఆత్మను చంపడం కాదు.

ఇక్కడ ఏ రకమైన మరణమవుతే దానికి తగ్గ ఫలితం వుంటుంది. సహజ మరణానికి సృష్టిలో ఏ రకమైన శిక్షలు వుండవు. అందుకే సహజ మరణాన్ని పాపం అని అనరు. కారణం అది సృష్టి ధర్మం ప్రకారం జరిగింది. ఎందుచేతనంటే జన్మించిన వాడు సృష్టి ధర్మం ప్రకారం ఎప్పుడో ఒకప్పుడు మరణించవలసిందే! ఈ మరణం కూడా సృష్టి నియమాలననుసరించి జరుగుతుంది.

కానీ హత్య అన్నది సృష్టి నియమాలకు విరుద్ధంగా వేరొకరిపై కక్షతో, కోపంతో, పగతో చేసింది కాబట్టి "హత్య" చేసినవారికి శిక్ష పడుతుంది. అంటే పాపం చుట్టుకుంటుంది. అందుచేత హత్య చెయ్యకూడదంటారు.

అలాగే ఆత్మహత్య అన్నది కూడా సృష్టి నియమాలకు విరుద్ధమే అవుతుంది. కారణం తాను గతంలో చేసిన పాపాలకు శిక్షలు అనుభవించలేక, అంటే కష్టాలు భరించలేక బలవంతంగా శరీరాన్ని విచ్ఛిత్తి చేసుకుంటారు. హత్య చేసుకుంటారు.

కానీ సృష్టి ధర్మం ప్రకారం ఆత్మ అయిన తాను గతంలో వున్న శరీరంతో చేసిన పాపాలు మరల శరీరంతోనే అనుభవించాలి. కానీ కొంతమంది కష్టాలు భరించలేక, తట్టుకోలేక, కష్టాలు తప్పించుకోవటానికి అలా తనకు తాను హత్య చేసుకుంటారు. అంటే శరీరాన్ని విచ్ఛిత్తి చేసుకుంటారు. అంటే సృష్టి నియమాలకు విరుద్ధంగా ఆత్మను బలవంతంగా శరీరం నుండి బయటకు పంపుతారు.

ఇది సృష్టి నిర్ణయాలకు విరుద్ధం కాబట్టి అలా ఆత్మహత్య చేసుకున్నా పాపమే అవుతుంది. ఒకరకంగా మహాపాపం అవుతుంది. కారణం ఎవరైనా సృష్టి నిర్ణయాల ప్రకారం జీవించాలి. సృష్టి నిర్ణయాన్ని గౌరవించాలి, సృష్టికి అనుగుణంగా జీవించాలి. అలా సృష్టి నియమాలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారు సృష్టి నిర్ణయాన్ని

ధిక్కరించినవారు అవుతారు. అందుకు వారు ఇంకా ఎక్కువ శిక్ష అనుభవించవలసి వస్తుంది. మరల భూమి మీదకు వస్తారు. ఇంకొక శరీరం తీసుకుంటారు. పాత శరీరంతో అనుభవించకుండా మిగిలి వున్న పాత పాపాలు, ఈ జన్మలో అంటే కొత్త శరీరంతో అనుభవించవలసిన పాపాలు. దానితో పాటు తప్పించుకోవటానికి చేసిన ప్రయత్నానికి పడే శిక్ష అన్నీ వెరశి భరించలేనంత శిక్ష పడుతుంది. అంటే కష్టాలు అనుభవించ వలసివస్తుంది.

అందుకే ఆత్మహత్య మహాపాపం అంటారు. అందుచేత ఆత్మహత్య చేసుకోకండి. అది పరిష్కారం కాదు. చేసిన పాపాలు అనుభవించండి. అనుభవించలేకపోతే పాపాలు పోయే మార్గమైన 'ధ్యానం' చెయ్యండి. అంతేకానీ ఆత్మహత్య చేసుకుంటే "పెనం మీద వుండలేని అట్టు పొయ్యిలో పడినట్టవుతుంది మీ జీవితం".

అందుచేత ధ్యానం చెయ్యండి. ఆత్మహత్యలు చేసుకోవలసిన అవసరం రాదు. పాపాలు పోతాయి. కష్టాలు పోతాయి. మరల క్రొత్తగా పాపాలు చెయ్యకండి. ప్రస్తుతం జన్మే కాదు. భవిష్యత్ జన్మలు కూడా ఆనందంగా వుంటాయి.

**ఓ జీవుడా! నీ హృదయములో వెదుకు. హృదయంలో వుండే ప్రియతముణ్ణి వెదుకు. కంగారు పడకు. ధనం, ఇల్లు, మిత్రులు, స్త్రీ ఎవ్వరూ నీ సహాయకులు కారు. గురువులు, న్యాయాధిపతి, పండితులు, ఫకీర్లు వీరంతా నీ బుద్ధిని నాశనం చేశారు. ఖురాను, ధర్మ గ్రంథాలు చదవటం వలన చింతలు దూరం కావు. కొంచెం సేపు స్థిరత్వాన్ని (ఆలోచన రహిత స్థితి...) పొందితే భగవంతుడు ఉదయిస్తాడు. బుద్ధిహీనులైన వారు అసత్యం గురించి వాగటంలోనే ఆనందం పొందుతారు. సృష్టికర్త సమస్త దృశ్యరూపాలలోనూ విరాజిల్లుతున్నాడు. అల్లా పవిత్రుడైతే నువ్వు అపవిత్రుడవు ఎలా అవుతావు? అంతా బ్రహ్మమే అయినపుడు బ్రహ్మం కంటే వేరుగా ఏమీ లేదు. ఏం చేయాలో అదే చేస్తున్నాడు. ఇదంతా ఆయనకు తెలుసు. ఇది ఆ దయాళువు యొక్క దయ**

**– కబీరు**

# సహజ మరణం - అసహజ మరణం

ఆత్మ కొన్ని అనుభవాల కోసం భూమి మీదకు వస్తుంది. ఏదో ఒకదేహం తీసుకుంటుంది. అది మానవ దేహం కావచ్చు, జంతువు దేహం కావచ్చు. పక్షి దేహం కావచ్చు.

కానీ ఆ పని పూర్తి కాకుండా ఆ దేహాన్ని ఎవరైనా విచ్ఛిత్తి చేస్తే అంటే హత్య చేస్తే, ఆత్మను ఆ పని పూర్తి కానివ్వకుండా చేసిన వారవుతారు. ఇది సృష్టి నియమాలకు విరుద్ధం. అలా సృష్టి విరుద్ధంగా ప్రవర్తించడాన్ని పాపం అంటారు.

అందుచేత మానవులనే కాదు పక్షులను చంపినా, జంతువులను చంపినా హత్య క్రిందకే వస్తుంది. అది పాపమవుతుంది.

చాలా మంది కోళ్ళను, పక్షులను, మేకలను, గొర్రెలను, చేపలను చంపి మేము వాటికి పరోక్షంగా ఉపకారం చేస్తున్నాము. పరిణామ క్రమంలో అవి తొందరగా ఎదగడానికి మేము వాటిని చంపి తినడం వల్ల పరోక్షంగా సహకరిస్తున్నాము అని తాము చేసే మూర్ఖపు పనిని సమర్థించుకుంటారు.

కానీ గుర్తుంచుకోండి. జన్మ తీసుకున్న ఏ జీవి అయినా గతంలో తాను చేసిన కర్మలు అనుభవించాలి, తన అనుభవాలు తాను సంపాదించుకోవాలి. అలా పరిణామ క్రమంలో ఎదగాలి. అంటే సహజంగా మరణించాలి. అంతేకానీ ఎవరైనా వాటిని తమ ఆనందం కోసం, తుచ్ఛమైన తమ కోరికలు తీర్చుకోవడం కోసం, సరదా కోసం వాటిని చంపితే వాటి కార్యం పూర్తి కానివ్వనందుకు ఆ పాపాన్ని మూట కట్టుకుంటారు.

ఎందుచేతనంటే మిగిలిన కర్మలు అనుభవించడానికి, అనుభవం పొందటానికి ఆ ప్రాణులు అదనంగా మరొక జన్మ తీసుకోవలసి వస్తుంది. అంటే వీరు సహకరించడం కాదు, అవరోధం కలిగించిన వారవుతారని తెలుసుకోవాలి. అలా చేసినందుకు తాము కూడా తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. అంటే శిక్ష అనుభవించవలసి వస్తుంది. అంటే ఎక్కువ నరకం అనుభవించవలసి వస్తుంది. అందుచేత ఏ జీవిని, జంతువును, పక్షిని అసహజంగా చంపకూడదు. మాంసం తిని వాటి హత్యకు కారణం కాకూడదు.

అందుచేత ఈ సృష్టిలో ఏ జీవినయినా తన అనుభవాలు సంపాదించు కోనివ్వాలి. సహజంగా మరణించనివ్వాలి. అంతేకానీ అసహజంగా ఎవరూ చంపకూడదు.

# నెగెటివిటి

సాధారణంగా చాలా మంది తమ వంట్లో, తమ ఇంట్లో తమ పరిసరాల్లో నెగిటివ్ వైబ్రేషన్స్ వున్నాయి. అందువల్ల ఇంట్లో గొడవలు, ఒకరి మధ్య ఒకరికి అవగాహన లేకపోవడం, సమస్యలు లాంటివి వస్తున్నాయి. అందుకే ఎవరికీ శాంతి లేకుండా పోతుందని అంటారు, అనుకుంటారు. అందుచేత నెగెటివిటి గురించి నెగెటివ్ వైబ్రేషన్స్ గురించి కొద్దిగా తెలుసుకుందాం.

## "వంట్లో నెగెటివిటి"

ఇది ఎవరికి వారిలోనే వుంటుంది. దీని వల్ల చాలా రకాలుగా నష్టపోతారు. నెగిటివిటీ వున్న వాళ్ళు అన్నీ విరుద్ధంగా ఆలోచిస్తారు, ప్రతీ దానికి భయమే. ఎదుట వారి గురించి మంచి అభిప్రాయం వుండదు, అందరిని అనుమానిస్తారు, ఇతరులలోని దోషాలు చూస్తూ వుంటారు. అలాగే ఇతరులతో ప్రవర్తిస్తూ వుంటారు. వాళ్ళు కూడా వీళ్ళతో అలాగే ప్రవర్తిస్తారు.

దీనికంతటికి కారణం దోషం వారి వంట్లోనే వుంది, అంటే వారిలోనే వుంది. అదే వారి గుణం. కారణం ఎవరికైనా వారి గుణాన్ని బట్టే వారి ఆలోచనలు వుంటాయి. అంటే భావాలు వుంటాయి. ఆ భావాల్ని బట్టే ప్రవర్తన వుంటుంది. అందుచేత గుణం మారితే వంట్లోని నెగెటివిటీ పోయినట్టే. అది పోవాలంటే ధ్యానం చెయ్యాలి, మాంసం మానాలి అదే పరిష్కార మార్గం.

## "బ్లాక్స్"

మనకు కలిగే ఆటంకాల్నే, అవరోధాలనే బ్లాక్సు అంటారు.

తమోగుణం వల్ల కలిగే వినాశకర, రజోగుణం వల్ల కలిగే విరుద్ధమైన, వ్యతిరేకమైన ఆలోచనల వల్ల, సృష్టి విరుద్ధమైన పనులు చెయ్యడం వల్ల జీవితంలో విరుద్ధమైన ఫలితాలు, వస్తాయి. కష్టాలు వస్తాయి. అనుకున్నట్టు జరుగదు. అపుడు నేను ఏమి చేద్దామన్నా ఆటంకాలు వస్తున్నాయి అంటారు. కాబట్టి వాటిని ఒక రకంగా "బ్లాక్సు" అంటారు. అంటే వారి పురోభివృద్ధికి, వారి అభివృద్ధికి అవి ఆటంకాలు కాబట్టి. అలాంటి ఆటంకాల్ని, అడ్డుని "బ్లాక్" అనే కదా అంటాం.

అలాంటి బ్లాక్స్ దేని వల్ల వుంటాయి? అంటే ఇవి కూడా మనస్సు యొక్క గుణం వల్లనే. అందుచేత ఎవరిలో వున్న బ్లాక్సు అయినా సరే పోవాలంటే ముఖ్యంగా వారి గుణం మార్చుకోవాలి. అంతకు తప్ప వేరే మార్గం లేదు.

ఎందుచేతనంటే గుణం మారగానే వారి ప్రవర్తన మారిపోతుంది. చెడు చెయ్యరు, అన్నీ లాభం కలిగించే పనులు చేస్తారు. అపుడు అంతా మంచే జరుగుతుంది. ఇబ్బందులు వుండవు. అంటే బ్లాక్స్ పోయినట్టే కదా?

మరి గుణం మారాలంటే ఏం చెయ్యాలి. గుణం మనస్సుకు సంబంధించింది కాబట్టి మనస్సును శుద్ధి చెయ్యాలి. దానికి ఇంతకు ముందు చెప్పుకున్నట్లు రెండే మార్గాలు (1) సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి (2) శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం చెయ్యాలి.

ఇంతకు తప్ప వారిలోని నెగెటివిటీ కానీ, బ్లాక్సు ఎవరూ తొలగించలేరు. అందుచేత ధ్యానం చేస్తే ఎవరిలోనైనా నెగెటివిటీ పోతుంది, 'బ్లాక్సు' తొలగిపోతాయి. అంతే తప్ప ఎవరైనా మీలోని 'బ్లాక్సు' తీసేస్తాము అని చెప్పారంటే వారు మిమ్మల్ని మోసగిస్తున్నట్టే ఎందుచేతనంటే ఎవరి మనస్సు యొక్క గుణాన్ని వారే వారి సాధనతోనే మార్చుకోవాలి తప్ప ఇంకొకరికి ఆ శక్తి లేదు. అంటే "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి" ఎవరూ ఇంకొకరినీ ఉద్ధరించలేరు. ఇదే శ్రీ కృష్ణ భగవానుని సందేశం.

అలా ఆహార నియమాలు పాటిస్తూ ధ్యానం చేస్తూంటే ఎవరికైనా సరే మెల్లిగా గుణం మారుతూ వుంటుంది. తమోగుణంలో వున్నవారు తమోగుణం నుంచి రజోగుణంలోకి వస్తారు. అలా రజోగుణంలోకి రాగానే వారు కొన్ని లోపాలు సరిచేసుకోగలుగుతారు. అంటే వారి ప్రవర్తన కొంత మారుతుంది. అంటే వారిలోని కొన్ని బ్లాక్సు పోయినట్టే. ఇంకా ధ్యానం అలాగే కొనసాగిస్తూ వుంటే మెల్లిగా సాత్విక గుణంలోకి వస్తారు. అక్కడ రజోగుణ సంబంధమైన కొన్ని లోపాలు సరి చేసుకుంటారు. వారి ప్రవర్తన ఇంకా మారుతుంది. అంటే ఇక్కడ కూడా కొన్ని బ్లాక్స్ పోతాయి.

ఇంకా అలా అలా సాధన కొనసాగిస్తూ వుంటే మెల్లిగా శుద్ధ సాత్వికంలోకి చివరకు నిర్గుణ స్థితికి చేరుకుంటారు. అంటే వారి ప్రవర్తన పూర్తిగా మారిపోతుంది. అన్నీ సృష్టికి, సృష్టి ధర్మానికి అనుగుణంగా ప్రవర్తిస్తారు. మాటలలో కానీ, ఆలోచనా విధానంలో కానీ, ప్రవర్తనలో కానీ ఏ విధమైన లోపాలు, దోషాలు వుండవు. త్రికరణశుద్ధి కలుగుతుంది. చేసే పనులన్నీ తనకు, లోకానికి లాభం కలిగించే విధంగా వుంటాయి. అలా వారు ప్రవర్తించగలుగుతున్నారంటే వారిలోని బ్లాక్సు అన్నీ పూర్తిగా పోయినట్టే. అపుడు వారికి అన్నీ లాభాలే కలుగుతాయి. ఏ విధమైన ఆటంకాలు వుండవు.

అలాగే ప్రతి ఒక్కరిలో వుండే రకరకాల అపోహల్ని కూడా "బ్లాక్స్" అని అంటారు. సమాజంలో చాలా మందికి సృష్టి గురించి, సృష్టి ధర్మాల గురించి అవగాహన లేక సృష్టి విరుద్ధమైన, ధర్మ విరుద్ధమైన పనులు చేస్తూ వుంటారు. దాని ఫలితంగా కష్టాలు అనుభవిస్తారు, నష్టపోతుంటారు. మరి నష్టం కలిగించే అలాంటి పనులు ఎందుకు చేస్తారు? అంటే వారికి చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు, పెద్దలు కలిగించిన అభిప్రాయమే. అందుచేత వారు తాము చేసే పనులు తప్పు కాదన్న అభిప్రాయంతో వుంటారు. వారు చేయకూడని పనులు చేస్తూ కష్టాలు తెచ్చుకుంటారు. దీనంతటికీ కారణం వారిలోని అపోహలే. అందుచేత నష్టం కలిగించే ఇలాంటి అపోహల్ని కూడా "బ్లాక్సు" అని చెపుతారు.

ఉదాహరణకు మాంసాహారమే తీసుకోండి. హింసకు కారణమైన మాంసం తినడం తప్పు కాదని చాలా మంది అభిప్రాయం. కారణం చిన్న నాటి నుండి పెద్దలు వారికి అది అలవాటు చేసారు. అందుకే వారు దానిని తప్పుగా భావించరు. కానీ అది వారికి ఎంతో నష్టదాయకం. కారణం మాంసాహారం అన్నది హింసకు మూలమవుతుంది. హింస అన్నది సృష్టి ధర్మాలకు విరుద్ధం అందుచేత వారిలో నుండి ఈ అపోహ తొలగిస్తేనే తప్ప... అంటే వారిలోని ఈ 'బ్లాక్' తొలగిస్తే తప్ప వారు మాంసం తినడం మానరు, అలా తింటూనే వుంటారు. కష్టాలు తెచ్చుకుంటూనే వుంటారు. ఆ కష్టాలు వచ్చినపుడు నాలో ఏవో 'బ్లాక్సు' వున్నాయని అనుకుంటారు.

అటువంటి వారికి వారిలో వున్న అనుమానాల్ని, అపోహల్ని, అంటే సందేహాల్ని ఎవరైనా నివారించగలిగితే, అంటే మాంసం ఎందుకు తినకూడదు? తింటే వచ్చే నష్టాలేమిటి? తినకపోతే వచ్చే లాభాలేమిటి? అన్నది వివరించ గలిగినపుడు వెంటనే వారు మాంసం తినడం మానేస్తారు. అపుడు వారికి నష్టం కలిగించే ఒక 'బ్లాక్' పోయినట్టే.

అలాగే మానవులకు నష్టం కలిగించే సృష్టి విరుద్ధమైన మూఢ ఆచారాలు, మూఢ నమ్మకాలు ఎన్నో వున్నాయి. అవి వున్నవారు, వాటిని ఒక్కొక్కటి తొలగించుకుంటే తప్ప వారు సృష్టి నియమాలకు అనుగుణంగా, ధర్మయుక్తంగా ప్రవర్తించలేరు. జీవించలేరు.

ఈ రకమైన 'బ్లాక్సు' అంటే మూఢ నమ్మకాలు, మూఢ ఆచారాలు కూడా వివేకం వున్నప్పుడు, అంటే ఆలోచించగలిగినపుడే పోతాయి. అంటే తొలగించు కోగలుగుతారు. మరి అటువంటి వివేకం, ఆలోచనా శక్తి సాత్విక గుణం వున్నపుడే వస్తుంది. అంటే దీనికి కూడా ముఖ్యంగా మనస్సు యొక్క గుణం మారవలసిందే

అంటే ధ్యానం చెయ్యవలసిందే అంతకు తప్ప వేరే మార్గం లేదు.

ఎందుచేతనంటే అలాంటి నమ్మకంలో వున్న వారికి ఎవరు ఏమి చెప్పినా, వినరు, వినిపించుకోరు, అర్థం కాదు. ఎంతసేపూ జీవితంలో నష్టానికి, కష్టాలకు కారణం శని దృష్టి, శకునాలు, నక్షత్రాలు, జాతకాలు, వాస్తు అనుకుంటూ వాటిని సరిచేసుకునే ప్రయత్నం చేస్తారు. వాస్తు అంటూ ఇల్లు మారుస్తారు. రక్షా కవచాలు, శని విమోచన యంత్రాలు, దిష్టి నివారణ ఫోటోలు పెడతారు. గుమ్మడి కాయలు వేలాడ దీస్తారు. కొంతమంది వీధిలో పగలగొడతారు. కొంతమంది దానాలు ఇస్తారు. హోమాలు, శాంతులు చేయిస్తారు. జపాలు చేస్తారు. ఇన్ని చేస్తారు కానీ, తమ పనులు, ప్రవర్తన, ఆలోచనా విధానం మార్చుకునే ప్రయత్నం చెయ్యరు. అందువల్ల వీరు ఎవరో ఒకరి స్వార్థానికి బలై పోతారు, చివరకు ఎంతో నష్టపోతారు. జీవితంలో ఎంతో దుఃఖానికి లోనవుతారు. అందుచేత 'బ్లాక్సు' అన్నవి ధ్యానం ద్వారానే పోతాయి తప్ప వేరే మార్గం లేదు. అందుచేత ధ్యానం చెయ్యండి. గుణాలు మార్చుకోండి. జీవితంలో లాభాలు పొందండి.

## "నెగెటివ్ వైబ్రేషన్స్"

చాలా మంది ఇళ్ళలో గొడవలు, తగవులు, కొట్లాటలు ఎక్కువగా వుంటూ వుంటాయి. భార్యాభర్తల మధ్య కానీ, అత్తా కోడళ్ళ మధ్య కాని, అన్నదమ్ముల మధ్య కానీ, తండ్రి కొడుకుల మధ్య కానీ, సరైన బాంధవ్యాలు వుండవు. మాటా మాటా అనుకుంటారు. ప్రతీ చిన్న విషయానికి గొడవలు పడుతూ వుంటారు. ఒకరంటే ఒకరికి ఇష్టమే! కానీ కారణం తెలియదు. ఒకరి మాట ఒకరు వినరు. అర్థం చేసుకోరు.

అలాంటి వారు ఏమనుకుంటారంటే మా ఇంట్లో ఏదో తేడా వుందని, నెగెటివ్ వైబ్రేషన్స్ వున్నాయని భావిస్తూ వుంటారు. వారిని వీరిని ఆశ్రయిస్తూ వుంటారు. వారు ఏది చెప్తే అది చేస్తూంటారు. వీరి బలహీనత చూసి వీరిని ఎన్నో రకాలుగా మోసగించే వారు కూడా వున్నారు. అందుచేత వీరి ప్రవర్తన ఇలా వుండటానికి కారణం ఏమిటి? అసలు 'నెగెటివ్ వైబ్రేషన్స్' అంటే ఏమిటి? అవి ఎలా ఏర్పడతాయో తెలుసుకుందాం.

ముఖ్యంగా ఇలాంటి ప్రవర్తన వివేకం లేని వారికే వుంటుంది. అంటే ఆలోచనా విధానం సరిగా లేని వారికే వుంటుంది. అంటే ముందు అనుకున్నట్టు వారి యొక్క గుణమే ఒక కారణం. అందుచేత ఇలాంటి వారు ముందు కుటుంబమంతా కలిసి విశేషంగా ధ్యాన సాధన చెయ్యాలి. అలా ధ్యానం చేస్తే

మెల్లిగా వారి గుణం మారిపోతుంది. గుణం మారగానే వారి ప్రవర్తన మారిపోతుంది. అపుడు సమస్య చాలా వరకు పరిష్కారమవుతుంది.

దీనితో పాటు ఇంకొక విషయం తెలుసుకోవాలి. నెగెటివ్ వైబ్రేషన్స్ అంటే వ్యతిరేక తరంగాలు. అంటే ఏమిటి? ఎలా ఏర్పడతాయో తెలుసుకుందాం.

చూడండి ఎవరైనా ఏదైనా ఫంక్షన్ కానీ, పార్టీ కానీ, వేడుక గానీ, వినోదం కానీ అంటే వివాహాలు, శుభకార్యాలు చేసుకునేటపుడు అనుకోకుండా వారి కుటుంబంలో ఎవరైనా చనిపోతే వెంటనే ఆ వేడుక అంటే శుభకార్యం ఆపేస్తారు. వాయిదా వేస్తారు. ఒక్కసారిగా వాతావరణం మారిపోతుంది. వినోదమంతా విషాధంగా మారిపోతుంది. ఆ చనిపోయిన వారు ముఖ్యమైన వారైనా, దగ్గర వారైనా, ఆ ప్రాంగణమంతా రోదనలతో, ఆర్తనాదాలతో నిండిపోతుంది. ఆ ప్రాంగణమంతా విషాదచ్ఛాయలతో నిండిపోతుంది. అప్పటి దాకా వినోదంగా, ఆనందంగా గడిపిన వారంతా విషాధంగా మారిపోతారు.

అలాంటి సందర్భంలో ఎవరైనా నవ్వినా, జోక్సు వేసినా, పక్కవారు తిడతారు. బుద్ధి లేదా అని అంటారు. వాళ్ళు బాధపడుతుంటే నువ్వు నవ్వుతావా? వారు విషాధంలో వుంటే నువ్వు ఆనందిస్తావా? అని మందలిస్తారు కూడా.

ఇంతకీ అక్కడ జరిగిందేమిటంటే అక్కడ అందరూ విషాదంలో వుండటం వల్ల, రోదించటం వల్ల అక్కడ విషాద తరంగాలు ఏర్పడతాయి. అటువంటి విషాద తరంగాలనే 'నెగెటివ్ వైబ్రేషన్స్' అంటారు. ఆనంద తరంగాలను 'పాజిటివ్ వైబ్రేషన్స్' అంటారు.

అంటే అంతా విషాదంలో, ఏడ్పులతో వుంటే అక్కడ నెగెటివ్ వైబ్రేషన్స్ ఏర్పడతాయి. అంతా వినోదంలో, ఆనందంగా వుంటే అక్కడ పాజిటివ్ వైబ్రేషన్స్ ఏర్పడతాయి. అందుచేత విషాదంలో అంటే అలాంటి నెగెటివ్ వైబ్రేషన్స్‌లో వినోద కార్యక్రమాలు, శుభకార్యాలు చెయ్యరు. కారణం అలాంటి విషాదంలో వినోదిస్తే ఆ వినోదం వికటిస్తుందని, పెళ్ళి చేసుకుంటే ఆ పెళ్ళి పెటాకులవుతుందనే ఆ శుభకార్యం ఆపేయడానికి, వాయిదా వెయ్యటానికి ముఖ్య కారణం.

అంతేకాదు ఎవరి ఇంట్లోనైనా శుభకార్యం జరుగుతుంటే ఏ పిల్లలైనా ఏడుస్తుంటే పెద్దలు వారిని మందలిస్తారు. "శుభమా అని కార్యక్రమం చేసుకుంటుంటే నువ్వేమిటి నట్టింట్లో కూర్చుని శోకాలు తీస్తున్నావు?" అని మందలిస్తారు. అంటే శుభం జరిగేటపుడు ఎవరూ శోకించకూడదనే అలా మందలించడానికి కారణం.

అందుచేత దీనిని బట్టి మనం తెలుసుకోవలసింది, ఎవరైనా ఆఖరికి ఏ

ప్రాణి అయినా, ఏ జీవి అయినా సరే దుఃఖిస్తే అక్కడ నెగెటివ్ వైబ్రేషన్స్ అంటే దుఃఖతరంగాలు వ్యాపిస్తాయి. ఆ తరంగాలు అక్కడ వున్న వారికి జయం కలిగించవు. సరికదా నష్టాన్నే కలిగిస్తాయి.

సహజంగా చాలా కుటుంబాలలో స్త్రీలను వేధిస్తూ వుంటారు. వారిని దూషించడం, కొట్టడం, బాధించడం చేస్తూ వుంటారు. అలా చెయ్యడం వల్ల ఆ స్త్రీలు చాలా దుఃఖానికి లోనవుతారు. బాధకు గురవుతారు. కొంతమంది కన్నీరు మున్నీరుగా విలపించేవారు కూడా వున్నారు. అలాంటి ఇళ్ళలో నెగెటివ్ వైబ్రేషన్స్ ఎక్కువగా ఏర్పడతాయి. అటువంటి ఇళ్ళలో సహజంగా ఏదీ జయం కలిగించదు. అందుకే స్త్రీలను వేధించకూడదు బాధించకూడదు అంటారు.

అలాగే ఫంక్షన్సు అని, పార్టీలని చాలా మంది ఇళ్ళలో జంతువులను, పక్షులను చంపడం, చంపి వాటి మాంసాన్ని తినడం చేస్తూ వుంటారు. అపుడు వాటి బంధువులు అంటే సాటి జంతువులు ఎంతో దుఃఖానికి లోనవుతాయి. వాటి దుఃఖం కూడా అక్కడ నెగెటివ్ వైబ్రేషన్స్ ఏర్పడటానికి కారణమవుతాడు. చూడండి ఒక కాకి చనిపోతే ఎన్ని కాకులు రోదిస్తాయో!

అందుచేత ఇంట్లో నెగెటివ్ వైబ్రేషన్స్ ఏర్పడకూడదంటే స్త్రీలను, పిల్లలను వేధించకూడదు, బాధించకూడదు. జంతువులను, పక్షులను హింసించకూడదు, చంపకూడదు. అన్నిటిని, అందరినీ ఆనందంగా ఉండేటట్టు చెయ్యాలి. అపుడు ఇంట్లో అన్నీ పాజిటివ్ వైబ్రేషన్స్ వుంటాయి. అన్ని రకాలుగా జయం కలుగుతుంది.

## "నెగెటివ్ ఫోర్స్"

ఇంకొక విషయం తెలుసుకుందాం.

ఎవరైనా ఎవరి మీదనైనా, కోపంతో గానీ, కక్ష గట్టి కానీ హత్య చేసాడనుకుందాం. హత్య చేసిన వాడు తాను అనుకున్నది సాధించానని అనుకుంటాడు, కానీ అక్కడితో అయిపోదు. కారణమేమిటంటే జీవితంలో ప్రతి ఒక్కరూ ఎన్నో సంపాదించుకుంటారు, ఎన్నో సమకూర్చుకుంటారు, వాటితో జీవితంలో అనుభవించాలనుకుంటారు, కుటుంబంతో సరదాగా గడపాలనుకుంటారు. కానీ హత్య గావింపబడటం వల్ల వీరి కోరికలు, సరదాలు తీరకుండా మరణించవలసి వస్తుంది. అలా చనిపోయిన వారి శరీరం నుంచి ఆత్మ బయటకు వస్తుంది. బయటకు వచ్చిన ఆత్మ సహజంగా తనకు సంబంధించిన లోకాలకు వెళ్ళవలసి వుంటుంది.

కానీ ఇక్కడ హత్య చేయబడటం వల్ల ఆత్మ తన సరదాలు తీరకుండా చేసిన వారి మీద, అంటే హత్య చేసిన వారి మీద పగబడుతుంది. తాను వెళ్ళవలసిన లోకాలకు వెళ్ళకుండా హత్య చేసిన వాడి ఇంటి చుట్టూ తిరుగుతుంది. హత్య చేసిన వాడి మీద ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తుంది. అలాంటి ఆత్మలనే 'ప్రేతాత్మ' అంటారు, లేదా 'దెయ్యం' అని కూడా అంటారు. అలాంటి ఆత్మలు అంటే దెయ్యాలు తాను పగబట్టిన వారిని రకరకాలుగా ఇబ్బందులు పాలు చెయ్యడం మనం సినిమాలలో చూస్తున్నాం. అంటే కోరికలు తీరని, అసహజ మరణం చెందిన వారి ఆత్మలు దెయ్యాలుగా మారతాయని ఎన్నో పుస్తకాల ద్వారా, సినిమాల ద్వారా మనం తెలుసుకుంటున్నాం.

ఇక్కడ మనం గమనిస్తే ఆ ఆత్మలు మనకు కనిపిస్తాయా? అంటే కనిపించవు. కానీ మనకు వ్యతిరేకంగా పనిచేస్తూ వుంటాయి. అలా కనబడకుండా మనకు వ్యతిరేకంగా పనిచేసే వాటినే 'నెగెటివ్ ఫోర్స్' అంటారు. అలాంటి ఆత్మలు మానసికంగా చాలా బలహీనంగా వున్న వారిని ఆవహించి, అందరినీ ఇబ్బందులు పెడుతూ వుంటాయి. అందుకే చూడండి. కొంతమంది ప్రవర్తన సడన్‌గా మారిపోతుంది. విచిత్రంగా వుంటుంది. వూగి పోతూంటారు. పదజాలం మారిపోతుంది. చిత్రవిచిత్రంగా ప్రవర్తిస్తుంటారు. అటువంటి పరిస్థితులలో భూతవైద్యులను సంప్రదిస్తారు, తాయత్తులు కడతారు, దిష్టిబొమ్మలు పెడతారు. ఇదంతా మానవాత్మల గురించి చేసేది. మనకు ఇంత వరకే తెలుసు. అంటే మానవాత్మలే దెయ్యాలుగా మారతాయని మనకు తెలుసు. కానీ మనం తెలుసుకోవలసింది ఇంకా చాలా వుంది.

అంతేకాదు మనకు తెలియని, మనకు కనబడని 'నెగెటివ్ ఫోర్స్' ఇంట్లో ఏర్పడుతూ వుంటుంది. అవి కూడా మన మీద, మన ఇంట్లో వారి మీద కూడా పని చేస్తూ వుంటాయి. చూడండి ఎవరి ఇంటికైనా చుట్టాలు వస్తే ముందు ఆ ఇంట్లో ఎవరు కంగారుపడతారు? అంటే ముఖ్యంగా దొడ్లో వున్న కోడి కంగారు పడుతుంది. కారణం ఇక దాని పని అయిపోయినట్టే. ఎందుచేతనంటే ఆ చుట్టాలను సంతోష పరచడానికి ఆ కోడిని బలి చెయ్యడానికి ప్రయత్నిస్తారు. ఆ యింటి యజమాని చూపులు, భావాలు మారిపోతాయి. అవి ఆ కోడి గ్రహించగలదు. వెంటనే అది దాక్కునే ప్రయత్నం చేస్తుంది. కానీ యజమాని కోడిని వదిలిపెట్టడు. దారుణంగా చంపుతాడు. ఒకవేళ దొడ్లో కోడి లేకపోతే దుకాణంలో కోడిని బలిచేస్తారు. మొత్తం మీద చుట్టం వస్తే ఒక కోడి బలి కావలసిందే.

అలా కోడిని హత్య చేసి బంధువులతో సహా అంతా వినోదిస్తారు కానీ అక్కడితో అయిపోదు. ఎందుచేతనంటే ఏ కోడి అయితే హత్య గావింపబడిందో! ఆ కోడి నుంచి, కోడి ఆత్మ బయటకు వస్తుంది. అలా వచ్చిన ఆత్మ సహజంగా దానికి సంబంధించిన లోకాలకు వెళ్ళిపోవాలి. కానీ ఇక్కడ సహజ మరణం కాకపోవడం వల్ల... బలంతంగా చంపబడటం వల్ల... ఆ కోడి ఆత్మ తన చావుకు కారణమైన వారి మీద పగబడుతుంది. కారణం తన పిల్లలతో సరదాగా గడపడానికి వీలు లేకుండా చేసారు కాబట్టి. అందుచేత ఆ కోడిని ఎవరైతే చంపారో! చంపటానికి కారణమయ్యారో! ఆ కోడి ఆత్మ వారి ఇంటి చుట్టూ తిరుగుతూ వుంటుంది. ప్రతీకారం తీర్చుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తూ వుంటుంది.

మనకు సహజంగా మానవ దెయ్యాల గురించి తెలుసు కానీ, కోడి దెయ్యాలు, జంతువుల దెయ్యాలు గురించి తెలియవు. ఇవన్నీ తమకు జరిగిన అన్యాయానికి ఘోషిస్తూ వుంటాయి. దీనినే ఆత్మలఘోష అంటారు. మనకు ఆత్మలు కనబడవు, ఆత్మల ఘోష వినబడదు. అవి మనకు వ్యతిరేకంగా ఘోషిస్తూ వుంటాయి, రోదిస్తూ వుంటాయి, శాపనార్థాలు పెడుతూ వుంటాయి.

అంతేకాదు కొన్ని జంతువుల దెయ్యాలు చిన్న పిల్లల మీద, మానసికంగా బలహీనమైన వారి మీద తమ ప్రభావాన్ని చూపిస్తూ వుంటాయి. అందుకే కొంతమంది పిల్లలు వూరికే భయపడుతూ వుంటారు. వూరికే ఉలిక్కి పడతారు, కంగారు పడతారు. ఒక్కొక్కసారి విచిత్రంగా ప్రవర్తిస్తూ వుంటారు. అలాగే వీటి ప్రభావం వల్ల ఇంట్లో భార్యా, భర్తల మధ్య అనుకోని విధంగా గొడవలు జరుగుతూ వుంటాయి. కారణం లేకుండా వూరికే తగవు లాడుకుంటూ వుంటారు. భార్యాభర్తలే కాదు, మిగతా కుటుంబ సభ్యుల మధ్య కూడా అలాగే తగవులు, గొడవలు జరుగుతూ వుంటాయి. అలా ఎందుకు జరుగుతుందో వారికి అర్థం కాదు. అన్నీ అయిపోయిన తరువాత అనవసరంగా గొడవలు పడ్డామని బాధపడుతూ వుంటారు.

అంతేకాదు అలాంటి ఆత్మలు వారిలో నెగెటివ్ ఫోర్స్‌గా పని చేస్తాయి. అలాంటి ఆత్మలు అలా మన ఇంట్లో చేరి ఘోషిస్తూ మనకు వ్యతిరేకంగా పనిచేస్తూ వుంటాయి. అదే మన ఇంట్లో వుండే నెగెటివ్ వైబ్రేషన్స్. అలాంటి ఘోష వున్న ఇంట్లో సహజంగానే సుఖశాంతులు వుండవు, ఇంట్లో వున్న వారు అన్యోన్యంగా వుండలేరు, బాంధవ్యాలు సరిగా వుండవు, కారణం లేకుండా వూరికే గొడవలు పడుతుంటారు. ఇంకా చనిపోయిన జీవులు రోదించినా, అంటే ఆత్మలు ఘోషించినా, నెగెటివ్ వైబ్రేషన్స్ ఏర్పడతాయి. వైబ్రేషన్స్ మన కంటికి కనిపించవు. కానీ మనకు

వ్యతిరేకంగా పనిచేస్తూ వుంటాయి. చూడండి కొన్ని చోట్ల అసలు కూర్చోలేం. కూర్చున్నా ఏదో అసౌకర్యం ఫీలవుతాము. దానికి ముఖ్య కారణం అక్కడ వున్న వైబ్రేషన్సే. అందుకే చూడండి కొన్ని, కొన్ని ప్రదేశాలలో, ఆలయాలలో ఎంతో ప్రశాంతంగా వుంటుంది. అక్కడ ఎంత సేపు కూర్చున్నా ఇంకా ఇంకా కూర్చోవాలనిపిస్తుంది.

అలా ఏ ఇంట్లో ఎన్ని జంతువులు చంపబడితే అక్కడ అంత నెగెటివ్ వైబ్రేషన్స్ ఏర్పడుతూ వుంటాయి. అది ఆ యింటిలోని వారికి మంచిది కాదు. ఏదీ కలిసి రాదు. సహజంగా వారు వాస్తు దోషమనుకుంటారు. లేకపోతే జాతక దోషమనుకుంటారు. లేదా శని ప్రభావమనుకుంటారు. కానీ వీటన్నిటి కంటే ఆ జీవుల ఆత్మల ఆర్తనాదాలే ముఖ్య కారణం.

మరి అటువంటి నెగెటివ్ వైబ్రేషన్స్ ఇంట్లో నుంచి పోవాలంటే ఏం చెయ్యాలి? మార్గం లేదా? అంటే వుంది. మనం వెంటనే జీవుల హింసకు కారణమైన మాంసాహారం మానెయ్యాలి. అపుడు ఆ జంతువుల ఆత్మలు కొంత శాంతిస్తాయి. కారణం ఆ జంతువుల ఆత్మలు తమకు జరిగిన అన్యాయాన్ని తమ వారసులకు జరగకూడదని భావిస్తూ వుంటాయి. ఎప్పుడయితే మాంసం మానేస్తామో అవి సంతృప్తి చెందుతాయి. అంతేకాదు మనం ఇతరుల చేత మాంసం మాన్పించే ప్రయత్నం కనుక చేస్తే ఆ ఆత్మలన్నీ పూర్తిగా సంతృప్తి చెందడమే కాదు. తాము అనుకున్నది నెరవేరిందనే భావంతో ఆ యింటిని వదలి తమ లోకాలకు వెళ్ళిపోతాయి. అపుడు ఆ యింటిలో వున్న నెగెటివ్ వైబ్రేషన్స్ అన్నీ పోతాయి. ఎప్పుడయితే ఆ యింటిలో ఇలాంటి ఘోష వుండదో! తిరిగి ఆ యింటిలో సుఖ శాంతులు చేకూరతాయి.

అందుచేత తెలుసుకోండి. ఎవరయితే మాంసం మానేసి, మాంసం మాన్పించే ప్రయత్నం చేస్తారో! అంటే హింసను మానతారో! వారి ఇంటిలోని నెగెటివ్ వైబ్రేషన్స్ పోతాయి. అలాగే ఎవరయితే ధ్యానం చేస్తారో వారి వంట్లోని నెగెటివిటీ పోతుంది. అందుచేత హింస మానండి, ధ్యానం చెయ్యండి. అంతా మంచే జరుగుతుంది. ఇదే సుభాష్ పత్రిగారు అందరికీ బోధిస్తున్నారు. మన జీవితం బాగుండాలంటే ఇదే తేలికైన మార్గం.

అంతేకానీ హింస మానకుండా ఏమి చేసినా ప్రయోజనం ఉండదు. మన బలహీనతను చూసి చాలా మంది మనల్ని మోసగించే అవకాశం కూడా ఉంది. వారు ఏమంటారంటే మీ ఇంట్లో నెగెటివిటీ పోగొడతానని ఇంటిని తడుముతారు.

అంటే మీ ధనాన్ని అపహరిస్తారు. అలాగే వంట్లో నెగెటివిటీ పోగొడతానని చెప్పి ఒంటిని తడుముతారు. కానీ వీటివల్ల నష్టమే కానీ ప్రయోజనం వుండదు. అందుచేత **"హింస మానండి - మాన్పించండి". "ధ్యానం చెయ్యండి -చేయించండి".** అంతా మంచే జరుగుతుంది.

## "పరిసరాల్లో నెగెటివ్ వైబ్రేషన్స్"

నెగెటివ్ వైబ్రేషన్స్ దుఃఖం నుంచి ఏర్పడతాయని తెలుసుకున్నాం. ప్రస్తుతం మనం లోకంలో గమనిస్తే ఎక్కడ చూసినా హింస తాండవిస్తుంది. స్త్రీలపై అత్యాచారాలు, గృహ హింస పెరిగిపోయింది. అల్పులపై, బలహీనులపై దౌర్జన్యం పెరిగిపోయింది. దీని వల్ల ఎక్కువ మంది దుఃఖానికి లోనై వున్నారు. అందుచేత ఎక్కడ చూసినా నెగెటివ్ వైబ్రేషన్స్ ఎక్కువగా వున్నాయి.

అంతేకాదు ప్రతీ గ్రామంలో ప్రతి పట్టణంలో వందలాదిగా, వేలాదిగా, లక్షలాదిగా జంతువులు మాంసం కోసం ఘోరాతి ఘోరంగా చంపబడుతున్నాయి. వాటి రోదనలతో పరిసరాలలో నెగెటివ్ వైబ్రేషన్స్ ఏర్పడుతున్నాయి. అంతేకాదు ప్రతి పట్టణంపైనా, నగరంపైనా చంపబడిన జంతువుల ఆత్మలు మేఘాలుగా కమ్ముకుని వున్నాయి. ఆ ఆత్మలు నిత్యం ఘోషిస్తున్నాయి. తమకు మానవుల వల్ల జరుగుతున్న అన్యాయం నుంచి కాపాడమని, రక్షించమని భగవంతుని ప్రార్థిస్తున్నాయి. కనీసం తమ వారసులకైనా మాకు పట్టిన గతి పట్టకుండా చూడమని భగవంతుని వేడుకుంటున్నాయి. అలా అన్నిచోట్ల నెగెటివ్ వైబ్రేషన్స్ ఏర్పడి వున్నాయి.

ప్రకృతిలో వైపరీత్యాలు ఎక్కువగా జరుగుతూండటానికి ఇది కూడా ఒక ముఖ్యకారణం అకాల వర్షాలు, కరువు కాటకాలు, సునామీలు, భూకంపాలు, అడవుల దహనాలు లాంటివి తరచూ చూస్తున్నాం. లోకంలో ఎవరూ సుఖ శాంతులతో లేరు. ఇదంతా హింస వల్ల ఏర్పడిన నెగెటివ్ వైబ్రేషన్లు ప్రభావమే.

ఈ విషయాన్నే మహాయోగి C.W.Lead Beater తన గ్రంథంలో వివరంగా ఆవేదనా భరితంగా చెప్పడం జరిగింది. ఆ విషయం కొంచెం తెలుసుకుందాం.

ఆయన ఏమన్నారంటే "ప్రకృతి పట్ల మనిషి కర్తవ్యం అన్నింటి కన్నా ముఖ్యమైనది. ప్రతి మతం, మనిషి భగవంతుని వైపు తనను తాను మలచుకోవాలని, మంచి వైపు మరలాలనీ, అభివృద్ధి పథం వైపు ఎదగాలనీ బోధిస్తుంది. ఈ భౌతిక ప్రపంచంలో పాఠాలు నేర్చుకోవడానికి మనం ఎలాగైతే ఈ శరీరంలో ఉన్నామో, అలాగే అదే కారణం కోసం జంతువులు కూడా శరీరాన్ని తీసుకున్నాయని గ్రహించాలి. జంతువులలో కూడా దైవం ఉందనీ, సర్వప్రాణులూ దివ్యత్వాన్ని కలిగి

ఉన్నాయనీ తెలుసుకోవాలి. అందువల్ల అవి మన సోదరులు! మన జిహ్వా చాపల్యాన్ని తీర్చుకోవడానికి వాటిని చంపేహక్కు మనకు లేదని తెలుసుకోవాలి".

"ఈ జంతు వధను మనం ఎక్కడ వరకు తెచ్చామంటే, జంతువులన్నీ మన కళ్ళ ముందు నుండి మాయమయ్యే స్థితిని తెస్తున్నాము. ఇదేనా "విశ్వసౌభ్రాతృత్వం" అంటే? ఇదేనా మనం వస్తుందనుకుంటున్న కరుణామయ ప్రపంచం? ఇలాంటి క్రూరమైన జంతువధల ప్రభావం మనం ఉన్నత తలంలో పరిశీలిస్తే – ఈ చంపబడిన జంతువుల యొక్క ఆలోచనలు, భావాలు, భయం, బాధ, వాటి పట్ల జరిగిన అన్యాయం మనల్ని ఎలా చుట్టుముట్టాయో తెలుస్తుంది. మన చుట్టూ ఉన్న వాతావరణమంతా వీటితో నిండిపోయింది. చికాగో మరి అటువంటి పట్టణాల చుట్టూ కొన్ని మైళ్ళ దాకా పైన చెప్పినటువంటి "భయంకరమైన ఆరా (Aura)" కని పిస్తుందని అతీంద్రియశక్తులు కలవారి నుండి తెలుసుకున్నాను. ఇంగ్లాండు లో చాలా సంవత్సరాల క్రితమే Mrs. Ane Besent ఈ విషయం చెప్పారు. చికాగో చేరకముందే ఆమె దాని చుట్టూ వున్న భయంకరమైన ఆరాను చూసి ఆమెకు విచారం కలిగి "మనం ఎక్కడ ఉన్నాం? వాతావరణంలో ఇటువంటి భయంకరమైన పరిస్థితి ఏ కారణం వల్ల కలిగింది?" అని ప్రశ్నించుకుంది. Mrs. Ane Besent లాగా అందరూ దీన్ని గుర్తించలేకపోయినా వారు తమకు తెలియకుండానే దీని వల్ల కలిగే దుష్పరిణామాలను అనుభవిస్తూ ఉంటారు".

## "కనిపించని భయంకర ఫలితాలు!"

చికాగో పట్టణంలో జంతువులను చంపడం వల్ల ఏర్పడ్డ దుష్పరిణా మమే, ఆ పట్టణంలోని చాలా మంది, నరాల బలహీనత, మానసిక రుగ్మత లాంటి జబ్బులకు కారణం! రోజుకు ఎన్ని వేల జంతువులు చంపబడు తున్నాయో తెలియదు కానీ, ఆ సంఖ్య మాత్రం చాలా ఎక్కువగానే ఉంటుంది.

మనలా నిత్యమై, మరుజన్మ కలిగిన వ్యక్తులుగా కాకున్నా ఈ జంతువులు కూడా నిశ్చితమైన జీవితం భౌతికంగానే కాక, సూక్ష్మతలంలో కూడా కొంతకాలం జీవిస్తాయని గుర్తుంచుకోవాలి. తమ బాధ, భయం, తమకు జరిగిన అన్యాయం అంతా గుమ్మరించడానికి ఇవన్నీ సూక్ష్మతలంలో అలాగే ఉంటాయని గుర్తుంచుకోవాలి. జంతువులను చంపే కసాయి వాటికలలో ఎటువంటి భయంకర వాతావరణం నెలకొని వుంటుందో మనం తెలుసుకోవాలి. **"దివ్యదృష్టి కలిగిన వ్యక్తి జంతువుల ఆత్మలను చూడ గలడు. చంపబడ్డ వాటి అనుభూతులూ, భావాలూ ఎంత శక్తి వంతంగా ఉంటాయో అవి అన్నిచోట్ల నుండి మానవజాతిపై ఎంత**

**ప్రభావాన్ని చూపుతాయో కూడా అతను తెలుసుకోగలడు".** అవి తక్కువ నిరోధక శక్తి గల పిల్లలపై ఎక్కువగా తమ దుష్పరిణామాన్ని చూపుతాయి. అటువంటి భయంకర పట్టణంలో పిల్లలను పెంచడం చాలా దుర్భరం. ఎందుకంటే అక్కడి వాతావరణమంతా రక్తపు సెగలతో నిండి ఉంటుంది. భౌతిక తలం మాత్రమే కాదు, సూక్ష్మతలంపై కూడా ఈ ప్రభావం పడుతుంది.

కళేబరశాల నుండి వచ్చే వెగటు, వాసన అక్కడ చుట్టూ ఉన్న వాతావరణాన్ని భయంకరంగా చుట్టి ఉంచుతుంది. ఈ కసాయిశాలలు చిన్న పిల్లల శరీరాలకే కాక, పెద్దలకు కూడా ఉపద్రవాలను తెస్తాయి. చిన్నపిల్లల్ని ఇటువంటి క్రూరమైన పనులకు ఉపయోగించడం వల్ల వారి ఆలోచనలన్నీ చంపడం వైపే మరలుతాయి.

అంతేకాదు మనుషుల క్రూరమైన దాహానికీ, అమాయక జంతువుల అరుపులకూ మధ్య జరిగే భయంకరమైన యుద్ధాన్ని భరించలేని సున్నితమనస్కులైన పిల్లలు కూడా ఉంటారు. ఒక చర్చి ఫాదర్ ఒక అబ్బాయిని కసాయిశాలలో పనికి ఉంచగా అతడు రోజూ ఆ భయంకరమైన పనిని చేయలేక, చూడలేక జబ్బు పడి, నీరసించి, తినలేక, నిద్రలేక బాధపడి చివరకు ఆ ఫాదర్‌వద్దకు వచ్చి, "నేను ఆకలితో చావనైనా చస్తాను కానీ ఆ రక్తపు మడుగులో నేను పనిచేయలేను" అని అన్నాడని నేను చదివాను. ఆ జంతువధ ఆ అబ్బాయిని నిద్రపోనీయలేదు. చాలా మంది పిల్లల పరిస్థితి ఇదే. వారు ఈ పనిలోనే ఉండి మొద్దుబారిపోయి, ఏదో ఒక రోజు మేకపిల్లనో లేక పంది గొంతునో కత్తిరించడం పోయి, మనిషినే చంపే స్థితికొస్తారు. అప్పుడు మనం అతడు తప్పు చేశాడని శిక్షించి "న్యాయం చేశాం" అని అనుకుంటాం.

చాలా మంది అర్థం చేసుకోలేనంత ఎక్కువగా ఈ ప్రపంచంపై ఈ అమాయక జంతువుల వధ తన ప్రభావాన్ని చూపిస్తుంది. వాతావరణంలో నిరంతరం కారణంలేని భయాందోళనలు ఉంటాయి. మీ పిల్లలు చాలా మంది అనవసరంగా వివరించలేని భయాలతో ఉంటారు. ఎందుకు భయపడతారో తెలియకుండానే భయపడతారు. చీకటికి భయపడటం, కొన్ని క్షణాలు ఒంటరిగా ఉన్నా భయపడడం జరుగుతూ ఉంటుంది. దీనికంతటికీ కారణం హతమైన ఆ జీవుల యొక్క రోదనలే. మీ అమాయకమైన పిల్లలపై ఇదంతా ప్రభావం చూపుతుందని తెలుసు కోకుండా మీరు మీ సోదరులను (జంతువులు) హత్య చేస్తున్నారు. ఖచ్చితంగా ఒక మంచికాలం వస్తుంది. అపుడు ఈ భయంకరమైన పరిస్థితి నుండి మనం స్వేచ్ఛను పొంది, మన నాగరికతపై ఉన్న నల్లమచ్చను తొలగించుకుని, ఉన్నత దశలకు ఎదిగి,

భయాల నుండి ద్వేషాల నుండి స్వేచ్ఛను పొందుతామని ఆయన చెప్పడం జరిగింది.

మరి ఇటువంటి స్థితి నుంచి మనం బయట పడాలంటే ముఖ్యంగా ధ్యానం చెయ్యాలి. జీవ హింసకు కారణమైన మాంసం తినడం మానాలి. అందరి చేత మాన్పించాలి. ఎప్పుడైతే అంతా ధ్యానం చేస్తారో మనిషి హింస చెయ్యడానికి కారణమైన తమోగుణం, రజోగుణం అధిగమించి సాత్వికగుణంలోకి వస్తారు. అంతా ఆలోచించగలుగుతారు. స్త్రీలపై, బలహీనులపై జరిపే హింస మానేస్తారు. ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఆ రకంగా కొంతవరకు నెగెటివ్ వైబ్రేషన్స్ తగ్గిపోతాయి.

అలాగే మాంసం తినడం మానడం వల్ల, మాన్పించడం వల్ల జంతువులపై జరిగే హింస ఆగిపోతుంది. అపుడు ఆ జంతువుల ఆత్మలు చేసే ఘోష ఆగిపోతుంది. ఆ ఆత్మలన్నీ భూమి నుంచి పై లోకాలకు నిష్క్రమిస్తాయి. తద్వారా బయట వున్న నెగెటివ్ వైబ్రేషన్స్ కూడా పూర్తిగా తొలగిపోతాయి.

ఎప్పుడయితే సృష్టిలో నెగెటివ్ వైబ్రేషన్స్ వుండవో అపుడు అందరూ సుఖశాంతులతో జీవిస్తారు. ప్రకృతి వైపరీత్యాలు వుండవు. ప్రకృతి పూర్తిగా సహకరిస్తుంది. అందరూ ఆనందంగా జీవించగలుగుతారు.

**"ఓ ముల్లా! దైవం పేరుతో నువ్వు చేసే ప్రార్థన వల్ల జీవుల భ్రమ దూరం కాదు. బ్రతికి వున్న జీవులను తీసుకువచ్చి వాటిని నరికి బలి ఎందుకు ఇస్తున్నావ్? ప్రాణాలు పోయలేని నువ్వు ప్రాణాలు ఎందుకు తీస్తున్నావ్? నువ్వు సరిగా ఆలోచించడం మాని వేదాలు ఖురాన్‌లు చెప్పావంటున్నావ్!? అన్నింటిలోనూ ఒకే పరమాత్మ ఉన్నాడు అనే సత్యాన్ని వదలి కోళ్ళను, మేకలను చంపుతున్నావ్. ప్రాణులన్నీ భగవంతునికి ప్రియమైనవే. పాపం నుంచి నువ్వు ఎలా రక్షింపబడతావ్? హృదయ పవిత్రత లేని కారణంగా అంతటా ఉన్న పరమాత్మను గుర్తించలేకుండా వున్నావు.నువ్వు స్వర్గం వైపు నుంచి నరకం వైపుకు వెళుతున్నావు."**

**– కబీరు**

# కోరికలు అణచకూడదా ?

కొంతమంది కోరికలను అణచకూడదు. వాటిని తీరుస్తూ వుండాలి. లేకపోతే అవి పెరిగిపోతూ వుంటాయి. అవి తీరకపోతే అవి వాడిని చేయకూడని పనులు చేయిస్తుంది. అంతేకాదు కోరికలు వుండిపోతే వాటి కోసం మరల ఇంకొక జన్మ తీసుకోవలసి వస్తుంది. అందుచేత కోరికలు తీర్చుకోవాలి అని చెబుతూ వుంటారు.

కోరికలు అణచకూడదు, తీర్చుకోవాలి. కానీ ఎలాంటి కోరికలు తీర్చుకోవాలి? ఎలాంటి కోరికలు అణచకూడదు? అన్న విషయం అవగాహన చేసుకోవాలి. ఎందుచేతనంటే కోరికలు ధర్మయుక్తంగా, ప్రకృతికి, భగవంతునికి అనుగుణంగా వుండాలి. అంతేకాని విరుద్ధంగా వుండకూడదు. అంతేకాదు ప్రకృతి విరుద్ధమైన కోరికలు అణచకపోతే దుష్ఫలితాలు ఎదుర్కోవలసివస్తుంది. కొంచెం వివరంగా తెలుసుకుందాం.

ఆకలిని అణచకూడదు. ఆకలి తీర్చుకోవటానికి తినాలనే కోరిక వుదయిస్తుంది. ఇది సహజమైంది, అవసరం కూడా. ఆ కోరిక అణచకూడదు. ఆ కోరిక అణిచే కొద్దీ మానవుడు పని చేయలేని స్థితికి చేరుకుంటాడు. చివరకు మరణిస్తాడు కూడా. అందుచేత ఆకలిని అణచకూడదు. కానీ ఆకలి అనే కోరిక తీర్చడానికి ఏమి తినాలి? అన్నది ఆలోచించాలి. కారణం తినే పదార్థం ధర్మయుక్తంగా వుండాలి.

ఉదాహరణకు ఆకలి తీరడానికి మాంసం, చేపలు, గుడ్లు తినాలనే కోరిక అధర్మయుక్తం. అలాంటి కోరిక తీర్చుకోవడానికి ప్రయత్నిస్తే దుఃఖం పొందవలసి వస్తుంది. కారణం మాంసాహారం అన్నది హింస ద్వారా వచ్చే ఆహారం. హింస చెయ్యడం సృష్టి విరుద్ధం. కానీ శాకాహారం, ఫలాలు తీసుకోవచ్చు అది దుఃఖాన్ని కలిగించదు. అది మానవునకు ధర్మయుక్తం. ఆ కోరికను అణచవలసిన పని లేదు. అలాగే శాకాహారంలో కూడా అవసరానికి పరిమితమవ్వాలి. అంతేకానీ 5 స్టార్ మీల్స్ కావాలనుకునే కోరిక అసమంజసం. కారణం ఆ శక్తి లేనివాడు, ఆ కోరిక తీర్చుకోవాలని ప్రయత్నిస్తే అప్పుల పాలవుతాడు, ఇబ్బందులకు లోనవుతాడు.

అలాగే శారీరక వాంఛ అనే కోరికను కూడా అణచకూడదు. ఆ కోరిక కూడా తీర్చుకోవచ్చు. కానీ దాన్ని తీర్చుకోవడం అన్నది ధర్మయుక్తంగా

వుండాలి. భార్యతో, భర్తతో ఆ కోరిక తీర్చుకోవడమన్నది ధర్మయుక్తం. అంతేకానీ విచ్చలవిడి శృంగారం, అలాగే ఇతర స్త్రీలను, ఇతరుల భార్యలను అనుభవించాలనుకోవడం అలాంటి కోరికలు తీర్చుకోవాలనుకోవడం అధర్మమే కాదు, అనర్థాల పాలు కావలసివస్తుంది. ఇలాంటి కోరికల వల్లే రావణాసురుడు మొత్తం జీవితాన్ని నాశనం చేసుకున్నాడు. అలాగే భాగస్వామి సిద్ధంగా లేకపోయినా, అయిష్టంగా వున్నా, వారి ఇష్టానికి విరుద్ధంగా వారిని బలవంతం చేయకూడదు, బాధించకూడదు. అది అధర్మం అవుతుంది. ఎప్పుడూ ఎదుట వారిని ఆనందింప చేసి తాను ఆనందించాలి. అంతే కానీ హింసించి ఆనందించకూడదు.

అలాగే భార్య కానీ, భర్త కానీ వుండగా ఇతరులను ఆశ్రయించకూడదు, బలాత్కరించకూడదు, హింసించకూడదు. ఎందుచేతనంటే భార్య ద్వారా భర్తకు, భర్త ద్వారా భార్యకు ఆ అవసరం తీరుతుంది కాబట్టి.

అలాగే బట్ట కట్టుకోవడం, ఇల్లు సమకూర్చుకోవడం, ధనం సంపాదించడం లాంటి కోరికలన్నీ ధర్మయుక్తంగా వుండాలి, తీర్చుకోవచ్చు, అణచవలసిన పని లేదు, త్యాగం చేయవలసిన పని లేదు. కానీ అవసరాలకు పరిమితం కావాలి. అందుచేత ధనం సంపాదించుకోవచ్చు, సంసారం చేసుకోవచ్చు, సంసార సుఖాలు అనుభవించవచ్చు, కానీ ఏ విషయంలోను ధర్మాన్ని అతిక్రమించకూడదు.

కోరికే లేకపోతే మానవుడు ఏమీ సాధించలేడు. ఆఖరుకు భగవంతుని కూడా సాధించలేడు, పొందలేడు. అందుచేత కోరికలు ధర్మయుక్తంగా వుండాలి. గుర్తుంచుకోండి అవసరాలకు పరిమితమైనపుడు ఎవరికైనా ధర్మాన్ని అతిక్రమించే అవకాశమే ఏర్పడదు. అందుచేత అవసరాలకు పరిమితమవ్వాలి. అన్నీ సృష్టి ధర్మానికి అనుగుణంగా ప్రయత్నం చెయ్యాలి. అందుచేత అధర్మయుక్తమైన కోరికలు జయించే ప్రయత్నం చెయ్యాలి. అంతేకానీ తీర్చుకోవడానికి ప్రయత్నిస్తే నష్టపోయేది మనమే.

అలా వుండాలంటే మనస్సు శుద్ధంగా వుండాలి. మనస్సు శుద్ధమైనపుడే ధర్మయుక్తమైన కోరికలు ఉదయిస్తాయి. మనస్సు ఎంత మలినంగా వుంటే కోరికలు అంత అధర్మయుక్తంగా వుంటాయి, అనర్థాలు కలుగచేస్తాయి.

మనస్సు శుద్ధంగా వుండాలంటే శుద్ధమైన శాకాహారం తీసుకోవాలి, ధ్యానం చెయ్యాలి. అప్పుడు ధర్మయుక్తమైన కోరికలు జనిస్తాయి. అటువంటి

వాటిని అణచవలసిన అవసరం వుండదు.

పూర్వం చావకుండా వుండాలనే కోరిక కొంతమంది రాక్షసులకు వుండేది. కానీ ఇది సృష్టి విరుద్ధం. కాని ఆ కోరిక నెరవేర్చుకోవడం కోసం తపస్సు చేసేవారు ఎంత తపస్సు చేసినా, ఎన్ని వరాలు పొందినా ఆ కోరిక సాధించలేక పోయేవారు. ఏదో తమ తెలివి ఉపయోగించి అలాంటి కోరిక తీర్చుకోవాలని చూశారు కానీ చివరకు మరణించవలసివచ్చేది. అలా ఎంతో మంది రాక్షసులు మరణించారు. దీనిని బట్టి కోరికలు సృష్టి ధర్మాలకు అనుగుణంగా వుండాలని అర్థమవుతుంది కదా? అందుచేత ధర్మయుక్తమైన కోరికలు అణచనక్కరలేదు, తీర్చుకోవచ్చు కూడా!

చిలుకను పెంచాలనే రామదాసు కోరిక నెరవేరింది కానీ ఆ కోరిక ఆయనను కష్టాల పాలు చేసింది కదా? కారణం అది ధర్మ విరుద్ధం కాబట్టి.

అలాగే శ్రీరాముని తండ్రి దశరథుని వేటాడాలనే కోరిక అతనిని దుఃఖం పాలు చేసింది కదా? కారణం చేసిన పని ధర్మవిరుద్ధం కాబట్టి.

అలాగే చాలామంది పక్షులను సరదా కోసం పంజరాల్లో పెంచాలని, చేపలను తొట్టెలలో పెంచాలని, పావురాలను పెంచాలనే కోరిక వుంటుంది. అలా సరదా కోసం జంతువులను పెంచాలనే కోరికతో వాటి స్వేచ్ఛను హరించడం కూడా అధర్మమే. అలా చేస్తే వాటి ఫలితం భవిష్యత్‌లో అనుభవించవలసి వస్తుంది.

అందుచేత ఆలోచించండి. ఏ కోరికలు అణచకూడదు? ఏవి నెరవేర్చుకోవాలి? అన్నది ఆలోచించాలి. అలా సృష్టికి అనుగుణమైన ధర్మయుక్తమైన కోరికలు నెరవేర్చుకుంటూ జీవిత లక్ష్యాన్ని సాధించాలి. ఇవన్నీ అర్థం కావాలంటే ముఖ్యంగా ధ్యానం చెయ్యాలి.

**మనస్సు చెప్పినట్లు నడువకు. మనస్సులో అనేక కోరికలు వుంటాయి. ఎవరైతే మనస్సును తన ఆధీనంలో ఉంచుకుంటాడో వాడే నిజమైన సాధువు.**
**– పరమయోగి కబీరు**

# ఎందుకు ఈ వృద్ధులు? రోగగ్రస్తులు? ముష్టివాళ్ళు?

సమాజంలో మనకు వృద్ధులు, రోగగ్రస్తులు, ముష్టివాళ్ళు చాలా మంది కనిపిస్తారు. కొంతమంది వృద్ధులను చూస్తే వారు ఏమీ చెయ్యలేరు. ఆఖరికి తమ పని కూడా తాము చేసుకోలేరు. ఇతరుల మీద ఆధారపడి జీవిస్తూ వుంటారు. ఇంకా కొంతమంది వృద్ధులు రోగగ్రస్తులై వుంటారు. ఇలాంటి వారు అన్ని రకాలుగా ఇతరులకు భారంగానే వుంటారు. కొంతమంది ఇలాంటి వృద్ధులను చూడటానికి కూడా ఇబ్బంది పడతారు. కొంతమంది ఇష్టపడరు కూడా. ఒక రకంగా చూస్తే ఇలాంటి వృద్ధులు సమాజానికి భారంగానే కనిపిస్తారు. ఎందుచేతనంటే వీరి వల్ల సమాజానికి ఏ రకమైన ప్రయోజనం వుండదు.

అలాగే సమాజంలో మనకు ఎంతో మంది రోగగ్రస్తులు కూడా కనిపిస్తారు. చాలా మంది పుట్టుకతోనే భరించలేని రోగాలతో పుడుతూ వుంటారు. అలా కొంతమంది కుష్టువారు, కొంతమంది అంధులు, కొంతమంది చెవిటివారు, కొంతమంది అంగవైకల్యంతో పుడుతూ వుంటారు. కొంతమంది పుట్టుకతోటే మానసిక వైకల్యంతో పుడతారు. వీరికి ఏమీ తెలియదు. ఏమీ చెయ్యలేరు కూడా. ఎంత వయస్సు వచ్చినా చిన్న పిల్లల్లా ప్రవర్తిస్తూ వుంటారు. చిన్న పిల్లల కంటే హీనంగా ప్రవర్తిస్తారు. చాలా అమాయకంగా వుంటారు. వెర్రివాళ్ళలా వుంటారు. వీరు తమ తల్లిదండ్రులకు ఎంతో భారంగా వుంటారు. వీరి వల్ల ఆ తల్లిదండ్రులు నరకాన్నే చూస్తూ వుంటారు. ఇలా కొంతమంది జీవితాంతం సమాజానికి భారంగానే వుంటారు. సమాజానికి వీరి వల్ల కొంచెం కూడా ప్రయోజనం వుండదు.

సమాజంలో కొంతమంది ముష్టివాళ్ళు కూడా వుంటారు. వీరి వల్ల కూడా సమాజానికి ఏ ప్రయోజనం వుండదు. ఒక రకంగా వీరు సమాజానికి భారమే కాదు, ఇబ్బందికరం కూడా. వీరందరినీ చూస్తే ఎందుకు ఈ వృద్ధులు? ఈ రోగగ్రస్తులు? ముష్టివాళ్ళు? అని అనుకునే వాళ్ళు కూడా వున్నారు. ఒకరకంగా వీళ్ళ వల్ల సమాజానికి ఏమిటి లాభం? అంతా భారమే కదా? అని అనిపిస్తుంది. కానీ భగవంతుని సృష్టిలో జరిగే ప్రతీ దానికి కారణం వుంటుంది. ప్రతీ దానికి అర్థం వుంటుంది. ఏ కారణం లేకుండా ఏదీ జరగదు. ప్రస్తుతం వీరు లోకానికి భారంగా కనిపించవచ్చు. కానీ భవిష్యత్తులో అంటే భవిష్యత్తు జన్మలలో వీళ్ల వల్ల లోకానికి తప్పకుండా ప్రయోజనం వుంటుంది.

అసలు వీరు అలా ఎందుకు వున్నారు? వీరికి అలాంటి పరిస్థితి ఎందుకు

వచ్చింది? ఇంతటి హృదయ విదారకమైన జీవితం ఎందుకు జీవిస్తున్నారు? అన్న విషయాలు ఆలోచించాలి. భగవంతుని సృష్టిలో వారు అలా జీవిస్తున్నారంటే కచ్చితంగా వారు గతంలో ఏదో గొప్ప పాపం చేసి వుండాలి. ఏమీ చెయ్యకపోతే అలాంటి జీవితం ఎందుకు వస్తుంది? అందుచేత వీరంతా ఘోర పాపాలు చేసి వుంటారని తెలుసుకోవచ్చు. ఆ పాప ఫలితమే ప్రస్తుతం వారు అనుభవిస్తున్నారు. మరి ఎందుకు ఈ శిక్ష అనుభవించడం? అంటే తాము చేసిన తప్పు తెలుసుకోవడం కోసం. అలా ఒక జన్మంతా చేసిన పాపాల్ని ఇంకొక జన్మంతా అనుభవిస్తే, తాము చేసిన పాపం తెలుసుకుంటారు, పశ్చాత్తాపం చెందుతారు. భవిష్యత్తులో, భవిష్యత్ జన్మలలో తిరిగి అలాంటి పాపాలు చెయ్యరు. అంటే ఒకరకంగా ఈ వృద్ధులు, రోగగ్రస్తులు, ముష్టివాళ్ళంతా ఆ విధంగా ఈ సృష్టిలో పాఠాలు నేర్చుకుంటున్నట్టే.

గతంలో వీరు లోకాన్ని పీడించడం వల్ల, హింసించడం వల్ల, నరకాన్ని సృష్టించడం వల్ల, వారు ఈ బాధలు అనుభవిస్తున్నారు. ఎవరికీ ప్రయోజనం లేకుండా బ్రతకడమే కాదు. అందరికీ భారమయ్యారు. దీనికి ముఖ్య కారణం ఉపకారం చేయగలిగి కూడా గతంలో అందరికీ అపకారం చేయడం వల్లే. అందుకే ప్రస్తుత కష్టాలు. అలా ప్రస్తుతం కష్టాలు అనుభవించడం వల్ల, వీరు జీవితంలో పాఠాలు నేర్చుకుని, అనుభవం సంపాదించి మరల అలాంటి పనులు, అంటే పాపాలు చేయకుండా... భవిష్యత్తులో, భవిష్యత్తు జన్మలలో లోకానికి మేలు చేస్తారు.

ఆ కష్టాలే వారు అనుభవించకపోతే! ఆ బాధలే వారు పడకపోతే వారు పాఠాలు నేర్చుకోరు. మరలా అలాంటి పాపాలే చేస్తూంటారు, సమాజంలో ఎవరికి సుఖశాంతులు ఉండనివ్వరు. అలాంటి వారి వల్ల ఈ భూలోకం నరకంలా తయారవు తుంది. అందుచేత ఈ వృద్ధులు, రోగగ్రస్తులు, ముష్టివాళ్ళు వల్ల సమాజానికి లాభం లేదనుకోకండి! వారు కూడా లోకానికి అవసరమే కానీ, అనవసరం కాదు. వారుబాధ అనుభవిస్తేనే భవిష్యత్తులో ఇతరులను బాధించరు. ఇవన్నీ భగవంతునికి తెలుసు, మనకే తెలియదు. చూడండి జైళ్ళలో ఖైదీలను పోషిస్తారు. జైళ్ళను నిర్వహించడం ఎంతో ఖర్చుతో కూడుకున్నది. కానీ భరిస్తారు. కారణం వారిలో మార్పు తీసుకురావడానికి, వారు మంచి వారుగా మారడానికి, అలాగే ఈ సృష్టిలో కూడా!

పైగా వృద్ధుల అనుభవం కూడా యువకులకు అవసరం. యువకులు వారిని చూసి, వారి అనుభవాలు విని ఎన్నో నేర్చుకుంటారు. మంచిగా ప్రవర్తిస్తారు. అందుచేత రోగగ్రస్తులు, వృద్ధులు, ముష్టివాళ్ళు సమాజంలో వుండటం వల్ల సమాజానికి భవిష్యత్తులో లాభమే కానీ నష్టం కాదు. మానవులకు ప్రత్యక్ష కారణమే తెలుస్తుంది కానీ, సృష్టిలోని పరోక్ష కారణం తెలియదు. ప్రత్యక్ష కారణం చూస్తే దండగ అనిపిస్తుంది. కానీ పరోక్ష కారణం తెలుసుకుంటే అవసరమనిపిస్తుంది. అంతేకాదు ధ్యానం చేస్తే ఇవన్నీ బాగా అర్థమవుతాయి.

# ఆదర్శ గ్రామం

దేవతలు అందరికీ అంటే జంతువులతో సహా అందరికీ ఉపకారం చేస్తారు, అందరికీ ఆనందం కలిగిస్తారు. రాక్షసులు తమ ఆనందం కోసం జంతువులతో సహా అందరినీ హింసిస్తారు, అపకారం చేస్తారు. దేవతలు ఇష్టపడేది అమృతం. అంటే అమృతాహారమే దేవతల ఆహారం. రాక్షసులు ఇష్టపడేది రక్తమాంసాలు. అంటే మాంసాహారమే రాక్షసుల ఆహారం.

ఏ గ్రామంలోనైతే దేవతలు కొలువై వుంటారో, అక్కడ 'స్వర్గం' వున్నట్టు. అటువంటి గ్రామమే ఆదర్శ గ్రామం. ఏ గ్రామంలోనైతే రాక్షసులు కొలువై వుంటారో, అక్కడ నరకం వున్నట్టు. దానిని ఆదర్శ గ్రామం అనరు.

దేవతలు అందరినీ అన్నిటినీ ప్రేమిస్తారు, రక్షిస్తారు, స్నేహంగా వుంటారు, ఉపకారం చేస్తారు, సహకరించుకుంటారు. రాక్షసులు అందరినీ ద్వేషిస్తారు, శత్రువులుగా చూస్తారు, అపకారం చేస్తారు, మోసగించుకుంటారు. అన్నిటినీ భక్షిస్తారు.

దేవతలు ఆనందంగా వుంటారు, బుద్ధిని ఉపయోగిస్తారు, ఆలోచిస్తారు, సరైన నిర్ణయాలు తీసుకుంటారు. వారు చేసే పనులు ప్రకృతికి అనుగుణంగా వుంటాయి, లోక కళ్యాణకరంగా వుంటాయి, అందరికీ క్షేమకరంగా వుంటాయి, శాంతికాముకంగా వుంటాయి.

రాక్షసులు దుఃఖంలో వుంటారు, బుద్ధి ఉపయోగించరు, ఆలోచించరు, మూర్ఖంగా, మూఢంగా ప్రవర్తిస్తారు. సరైన నిర్ణయాలు తీసుకోరు, తీసుకునే నిర్ణయాలు చేసే పనులు ప్రకృతికి విరుద్ధంగా వుంటాయి. లోక కంటకంగా వుంటాయి. అందరికీ క్షామకరంగా వుంటాయి. అశాంతిని కలిగించే విధంగా వుంటాయి.

దేవతలు వుండే గ్రామం పాడి పంటలతో, సిరి సంపదలతో, సకాల వర్షాలతో, ప్రకృతి వైపరీత్యాలు లేకుండా సస్యశ్యామలంగా వుంటుంది. గ్రామమంతా కన్నుల పంటగా వుంటుంది. రాక్షసులు వుండే గ్రామం అన్నిటికి కరువే, సరైన సంపద వుండదు. ఆర్థిక ఇబ్బందులు వుంటాయి. అకాల వర్షాలు వుంటాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయి. అరిష్టాలతో గ్రామమంతా ఒక స్మశానాన్ని పోలి వుంటుంది.

దేవతలు వుండే గ్రామంలో, కుటుంబాలలో, సమాజంలో గొడవలు వుండవు. కక్షలు, పగలు, ప్రతీకారాలు వుండవు. ఒకరినొకరు ప్రేమించుకుంటారు.

ఆనందంగా జీవిస్తారు.  రాక్షసులు వుండే గ్రామంలో, కుటుంబంలో, సమాజంలో గొడవలు, కొట్లాటలతో వుంటుంది. కక్షలతో, పగలతో, ప్రతీకారాలతో ఒకరినొకరు ద్వేషించుకుంటారు. ఎప్పుడూ అశాంతితో దుఃఖంతో జీవిస్తారు.

దేవతలు శ్వాసాహారులు అంటే ధ్యానం చేస్తారు. కానీ రాక్షసులు మాంసాహారులు అంటే హింస చేస్తారు.

అందుచేత దేవతలు వుండే గ్రామమే ఆదర్శ గ్రామము. అంటే శాకాహారం తీసుకుంటూ ధ్యానం చేసే వారుంటే అదే ఆదర్శ గ్రామం.

దేవతలు వున్న గ్రామంలో దేవుళ్ళు నిలయమై వుంటారు. అందరికీ సాయం చేస్తారు, మంచి చేస్తారు, అందరినీ రక్షిస్తూ వుంటారు, స్వర్గాన్ని సృష్టిస్తారు. కానీ రాక్షసులు నిలయం వుండే గ్రామంలో దెయ్యాలు నిలయమై వుంటాయి. అందరి ఆనందాన్ని హరిస్తూ వుంటాయి, నరకాన్ని సృష్టిస్తాయి.

దేవతలు దేవుళ్ళతో స్నేహంగా వుంటారు. దేవుళ్ళు కూడా దేవతలను రక్షిస్తుంటారు. అందుకే దేవుళ్ళను దేవతల పక్షపాతి అంటారు. రాక్షసులు దేవుళ్ళను శత్రువులుగా భావిస్తారు. అందుకే ఏ పురాణం చూసినా దేవుళ్ళు రాక్షసులను శిక్షించడం కనిపిస్తుంది.

ఇదే మనం పురాణాల ద్వారా తెలుసుకునేది.

అందుచేత అందరూ శాకాహారులు కండి. ధ్యానం చెయ్యండి. దేవతలుగా మారండి. మీ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తయారు చెయ్యండి.

**కబీరు మనస్సును సంబోధిస్తూ అంటున్నాడు, "ఓ మనసా నువ్వు బుద్ధిమంతురాలివి జ్ఞానం యొక్క భాండాగారానివి. నువ్వు నీలో నీ విచారణ చేసి ఈ విషయాల గురించి చెప్పు. ఎవరు తెలివైనవాడు? ఎవరు పిచ్చివాడు? (ఈశ్వరుని పట్ల ప్రేమ వున్నవాడా? విషయ వాసనలను ప్రేమించేవాడా?) జీవుల దుఃఖానికి కారణమేమిటి? ఆ దుఃఖం ఎలా పోతుంది? ఏ వస్తువులో సారం వుంది? ఏది నిస్సారమైనది? నీకు కీడు చేసేవారెవరు? నిన్ను ప్రేమించే వారెవరు? ఏది తియ్యనైనది? ఎవరు వాసనల తాపంలో కాలిపోతున్నారు? ఎవరు ఆనంద భోగాల్ని పొందుతున్నారు? ముక్తి అంటే ఏమిటి? ఆలోచించి చెప్పు! జీవితం యొక్క మూలతత్వాలను గురించి అడుగుతున్నాను? మనస్సులోని సంశయం నన్ను శూలంలా గుచ్చుకుంటోంది. అర్థం చేసుకుని ఈ విషయాలన్నీ చెప్పు!"**

**– కబీరు**

# హింస

హింసలో రెండు రకాలు

(1) శారీరక హింస, (2) మానసిక హింస

ఎలాంటి హింస చేస్తే అలాంటి నరకమే అనుభవిస్తాం.

మానవులను రెండు రకాల గానూ హింస పెట్టవచ్చు, కానీ జంతువులను శారీరకంగా హింసించగలం, కానీ మానసికంగా హింసించలేం. కారణం జంతువులకు మనస్సు లేదు కాబట్టి.

మనస్సున్న మనిషిని విమర్శించినా, తిట్టినా ప్రతిస్పందిస్తాడు. బాధపడతాడు. కానీ జంతువును అంటే ఆవును, గేదెను, దున్నను, ఎద్దును, మేకను విమర్శించినా, తిట్టినా ప్రతిస్పందించవు. బాధపడవు. గట్టిగా అరుస్తే కొడతాడేమోనని కొద్దిగా కదులుతాయి. చూడండి దున్నపోతు మీద వర్షం కురిసినా ఎలా పట్టించుకోదో! అలాగే తిట్టినా జంతువులు పట్టించుకోవు.

కానీ తిడితే మానవులు విపరీతంగా స్పందిస్తారు. తిట్టుకి ప్రతిగా నాలుగు తిడతారు. అవకాశం వుంటే కొడతారు. ఏమీ చెయ్యలేకపోతే లోపలైనా తిట్టుకుంటారు. లేకపోతే అవకాశం వచ్చినపుడైనా ప్రతిగా ఏదో ఒకటి చేస్తారు.

అందుచేత ఒకరి గొడవలేని, ఒకరి గురించి పట్టించుకోని, ఒకరి గురించి ఆలోచించని, ఒకరికి హాని చెయ్యని జంతువులను హింసించకూడదు.

అందుకే జీవహింస మహాపాపం అంటారు. కారణం అవి అమాయకపు, హాని చేయని మూగ జీవులు. లోకానికి ఉపకారం చేసే సాధు జంతువులు. అలా ఉపకారం చేసే వాటికి అపకారం చెయ్యడం మహాపాపం. రక్షించవలసిన వాటిని, భక్షించడం మహాపాపం. మాంసాహారులే కాదు. శాకాహారులు కూడా హింస చేస్తున్నారు. చీమలు, దోమలు, బొద్దింకలు, ఎలుకలులాంటి వాటిని చంపుతున్నారు.

అంతేకాదు ప్రయోగాల పేరుతో ప్రయోగశాలలో ఎలుకలను, కోతులను, ఇంకా అనేక జంతువులను క్రూరంగా హింసిస్తున్నారు. మానవుల ఆనందం కోసం ప్రయోగాల పేరుతో హింస చేస్తూ వాటి ఆనందాన్ని హరిస్తూ చివరకు తాను రోగాల రూపంలో హింస అనుభవిస్తున్నారు. ఈ హింస నుంచి బయటపడటానికి ప్రయోగాల పేరుతో మరల హింస చేస్తున్నారు. అందుచేత హింస ఆపండి. అపుడు ఏ మానవుడు హింసింపబడడు. ముందు ధ్యానం చెయ్యండి. హింస చెయ్యమన్నా చెయ్యరు.

# జీవించు - జీవించనివ్వు

ఇది భగవాన్ వర్ధమాన మహావీరుని అద్భుత సందేశం. "జీవించు - జీవించనివ్వు" అన్నది సృష్టిలోని ఒక ముఖ్య ధర్మం. ఎందుచేతనంటే భగవంతుని సృష్టిలోని ప్రతీ జీవి భగవంతుని నుంచి ఉద్భవించినవే అన్నీ ఆయన రూపాలే అన్నిటిలో వున్నది ఆయనే. అందుచేత ఆయనకు అన్నీ సమానమే.

నీవు ఎలా జీవించాలని అనుకుంటావో సృష్టిలోని ప్రతీజీవి అలాగే జీవించాలని అనుకుంటాయి. సృష్టిలో జీవించే హక్కు నీకు ఎలా కల్పించబడిందో ప్రతీ జీవికి అలాగే కల్పించబడింది. జీవించే హక్కు నీకే కాదు ప్రతీ జీవికి వుంది. అందుచేత నువ్వు జీవించు–ఇతరులను, ఇతర జీవులను జీవించనివ్వు.

అంతేకాదు నువ్వు ఎలా ఆనందంగా, శాంతిగా జీవించాలనుకుంటావో! హింస వద్దనుకుంటావో! అలాగే అన్ని జీవులు జీవించాలనుకుంటాయి. హింస వద్దనుకుంటాయి. అందుచేత అలా అన్నిటినీ జీవించనివ్వు. అలా అన్ని జీవులను జీవించనివ్వకపోతే నువ్వు అలా జీవించే హక్కు కోల్పోతావు.

అందుచేత నువ్వు ఆనందంగా జీవించాలనుకుంటే అన్ని జీవులను ఆనందంగా జీవించనివ్వు. అలాగే నువ్వు శాంతిగా జీవించాలనుకుంటే నువ్వు వేటి శాంతిని హరించకు. నువ్వు రోగాలతో హింసపడకూడదనుకుంటే నువ్వు ఏ జంతువును హింసించకు, చంపకు. మాంసం తిని హింసకు కారకుడు అవ్వకు. అలా చేస్తే నువ్వు ఆ హక్కు కోల్పోతావు. అందుచేత "నువ్వు ఏది కోరుకుంటే అది ఇవ్వు, ఏది వద్దనుకుంటే ఈ సృష్టిలో అది ఇవ్వకు". ఇదే "జీవించు – జీవించనివ్వు" అన్న సందేశంలోని అర్థం.

అలాగే నువ్వు అన్నిటి ప్రేమను పొందాలనుకుంటే నువ్వు కూడా అన్నిటిని ప్రేమించు, అందరి నుంచి గౌరవం పొందాలనుకుంటే నువ్వు అందరిని గౌరవించు. నువ్వు అవమానించబడకూడదనుకుంటే ఎవరిని అవమానించకు. హేళన చేయబడకూడదనుకుంటే ఎవరినీ హేళన చెయ్యకు. నువ్వు తక్కువగా చూడబడ కూడదనుకుంటే నువ్వు ఎవరినీ తక్కువగా చూడకు. నువ్వు నష్టపోకూడదనుకుంటే ఎవరినీ నష్టపెట్టకు. కష్టాల పాలవకూడదనుకుంటే ఎవరినీ కష్టాల పాలు చెయ్యకు.

అలాగే నువ్వు అందరి నుంచి దయ, కరుణ పొందాలనుకుంటే, నువ్వు అందరి మీద, అన్ని జీవుల మీద దయ చూపించు, కరుణ కలిగి వుండు. మరొక్కసారి తెలుసుకో **"నువ్వు ఏది వద్దనుకుంటే అది ఇవ్వకు. ఏది కావాలనుకుంటే తప్పనిసరిగా**

**అది ఇవ్వవలసిందే".** వేరే దారి లేదు. ఇదే "జీవించు – జీవించనివ్వు"లోని అంతరార్థం.

కానీ లోకంలో అంతా ఆనందం కోరుకుంటున్నారు. కానీ హింసను ఇస్తున్నారు. అందుకే ఎవరూ ఆనందంగా జీవించలేకపోతున్నారు. అంటే కోరుకునేది ఒకటి. ఇచ్చేది ఒకటి. అందుచేతే మానవుని జీవితం తాను అనుకున్నట్టు వుండటం లేదు. అందుచేత తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తాడని భావిస్తారు. ఎప్పుడూ నిరాశ, నిస్పృహలతో జీవిస్తారు. అందుచేత మీరనుకున్నట్టు మీ జీవితం వుండాలంటే వర్ధమాన మహావీరుని సందేశం "జీవించు – జీవించనివ్వు" అర్థం చేసుకోండి. ఆయనలాగే ధ్యానం చెయ్యండి. మీరు ఆయన చెప్పినట్టు జీవించగలుగుతారు.




**బాధ అనేది ఏ జీవికైనా ఒక్కటే. మూర్ఖులైన ప్రజలు గ్రహించడం లేదు. బలి ఇచ్చే జంతువులు స్వర్గాన్ని చేరితే, తమను తామే బలి ఇచ్చుకుని స్వర్గాన్ని చేరవచ్చు కదా.**

**– కబీరు**

# రక్త, మాంసాలు చూడగలరా?

కొంతమంది ఏక్సిడెంట్లు చూసి భయపడతారు. కళ్ళు మూసుకుంటారు. దూరంగా వెళ్ళిపోతారు. అమ్మో, అయ్యబాబోయ్ అంటూ అరుస్తారు. ఆర్తనాదాలు చేస్తారు.

అలా ఏక్సిడెంట్లలో తల పగిలి మెదడు బయటకు రావడం, ఛాతి నలిగి గుండె బయటకు రావడం, ముఖం పచ్చడి పచ్చడి కావడం. కాళ్ళు చేతులు తెగిపోవడం జరుగుతూ వుంటాయి. శరీర భాగాలు కాలిపోవడం. శరీరం గుర్తు పట్టలేనంతగా కాలిపోవడం జరుగుతూ వుంటాయి. అలాంటి దృశ్యాలు చూడలేరనే వాటి మీద గుడ్డ కప్పుతారు. చూడగలిగితే వాటి మీద గుడ్డ కప్పరు కదా?

మరి అలాంటి దృశ్యమే చూడలేనపుడు కోళ్ళను, మేకలను, గొర్రెలను, చేపలను, పందులను చంపి వాటి మెదడు, గుండెలను ఎలా కోయగలరు? అసలు వాటిని ఎలా తినగలరు?

ఎవరో అలవాటు పడినవాడు కోసి తీసుకు వస్తే! ఎవడో వండితే! లొట్టలేసుకుని తింటున్నారు కానీ, ఇదంతా చూస్తే తినగలరా? అసలు చూడటానికే భయంకరంగా వుందే దానిని ఎలా తింటారు?

హాస్పిటల్స్‌లో ఆపరేషన్స్ చేసేటపుడు ఆ రక్తం, ఆ మాంసం చూస్తే చాలా మంది కళ్ళు తిరిగి పడిపోతారు, స్పృహ తప్పిపోతారు. అందుకే చూడనివ్వరు. కానీ అలా కోయడం అలవాటైన వైద్యులు మాత్రం ఆ పని చెయ్యగలుగుతున్నారు.

అలాగే క్రూరంగా జంతువులను చంపేవారు కూడా అలవాటు అయినందు వల్లనే చేయగలుగుతున్నారు. చిన్ననాటి నుండి వారికి ఆ అలవాటు చేయబడింది. కానీ అలా బతికి వున్న జంతువులు నన్ను చంపవద్దు అని మొరపెట్టుకుంటున్నా కూడా నిర్దాక్షిణ్యంగా, దారుణాతి దారుణంగా చంపడం చాలా భయంకరమైన పని, హృదయాన్ని కదిలించి వేసే పని. అందుకే ఏక్సిడెంటు జరిగినపుడు చాలా దారుణంగా చచ్చాడు అని కూడా అంటాం.

తెలుసుకోండి రక్తాన్ని చూస్తేనే కళ్ళు తిరిగేవారు రక్తమాంసాలు ఎలా ఇష్టపడతారు? ఎలా తినగలరు? అందుచేత భయంకరమైన, భీతి గొలిపే మాంస భక్షణ చేయకండి. హాయిగా శాకాహారం తినండి. శాకాహారులుగా మారండి. ధ్యానం చెయ్యండి వేటిని హింసించరు, హింస చేయలేరు కూడా.

# జీవ హింస

జీవహింసలో రెండు రకాలు వున్నాయి. (1) అవసరార్థం చేసే హింస, (2)వినోదం కోసం చేసే హింస.

అవసరార్థం చేసే హింసలో పాపం తక్కువగా వుంటుంది. కానీ వినోదం కోసం హింస చేస్తే ఫలితం తీవ్రంగా వుంటుంది.

మంచు ఖండాలలో పూర్తిగా ఆహారం దొరకని ప్రదేశాలలో ప్రాణం నిలబెట్టుకోవడానికి తప్పనిసరి పరిస్థితులలో మాంసం తింటే పాపం యొక్క తీవ్రత ఒక రకంగా వుంటుంది. కానీ శాకాహారం లభిస్తున్నప్పుడు మాంసం తిన్నా, అలాగే వినోదం కోసం, సరదా కోసం మాంసాహారం భుజించినా, హింస చేసినా, హింసకు కారణమైనా దాని ఫలితం తీవ్రంగా వుంటుంది. అలాంటి వారు దాని ఫలితం పూర్తిగా అనుభవించవలసివస్తుంది.

ముఖ్యంగా ప్రతీ జీవి భగవంతుని రూపాలేనని తెలుసుకోవాలి. ఈ విషయం మర్చిపోకూడదు. ఈ విషయమే షిరిడీ బాబా స్పష్టంగా చెప్పడం జరిగింది. సాయి సచ్చరిత్ర9వ అధ్యాయంలో 81వ పేజీలో బాబా ఈ విధంగా చెప్పారు.

ఒకరోజు షిరిడీలో ఆత్మారామ్‌తర్లడ్ అనే భక్తుని భార్య అందరికీ భోజనం పెడుతున్నప్పుడు ఒకకుక్క అక్కడికి వచ్చింది. ఆమె దానికి కూడా ఒక రొట్టె వేసింది. ఆ కుక్క ఎంతో ఇష్టంగా ఆ రొట్టెను తినడం జరిగింది.

మరునాడు ఆమె బాబా దర్శనం కోసం మసీదుకు వెళ్ళినపుడు ఆమెను చూడగానే బాబా ఆమెతో "నాకు సంతుష్టిగా భోజనము పెట్టినావు తల్లీ" అనగానే ఆమె ఆశ్చర్యపోయింది. నేను ఎక్కడ నీకు భోజనము పెట్టాను బాబా? అని అనగానే బాబా అన్న మాటలు ఇవి. **"నీవు ప్రేమ పూర్వకముగా పెట్టిన ఆ రొట్టె ముక్కను తిని ఇప్పటికీ త్రేన్పులు వస్తున్నాయి. నీ భోజనమునకు ముందు ఏ కుక్కను నీవు చూసి రొట్టె పెట్టావో అదియు నేను ఒకటే! ఆ విధంగానే పిల్లులు, పందులు, ఈగలు, ఆవులు మొదలైనవన్నీ నా అంశలే! నేను వాని ఆకారములో తిరుగుతున్నాను. ఎవరయితే సకల జీవకోటిలో నన్ను చూడగలుగుదురో వారే నా ప్రియ భక్తులు. కావున నేను వేరు, తక్కిన జీవరాసి అంతా వేరు అనే ద్వంద భావాన్ని, భేద భావాన్ని వదలి నన్ను సేవింపుము".**

బాబా చెప్పిన పై విషయాన్ని బట్టి ప్రతీ జీవి అంటే జంతువు అంటే ఆఖరుకు ఈగ, దోమ కూడా దైవ స్వరూపమేనని తెలుసుకోవాలి. ఈ విషయమే అంటే ప్రతీ జీవియందు దైవాన్ని చూడమని ఉపనిషత్తులు, భగవద్గీత, భాగవతం

మొదలైనవన్నీ ప్రబోధిస్తున్నాయి.

అందుచేత ఏ జీవిని సంతృప్తి పరిచినా, దేవుని సంతృప్తి పరచినట్లే! అలాగే ఏ జీవిని అంటే ఆఖరుకు, ఈగ, దోమలాంటి వాటిని హింసించినా దేవుడిని హింసించినట్టేనని బాబా చెప్పిన సందేశాన్ని బట్టి మనం తెలుసుకోవచ్చు. అందుచేత ప్రతీ జీవిని ప్రేమించాలి. అటువంటి వారు దైవాన్ని ప్రేమిస్తున్నట్టే.

ఈ విషయం చెప్పగానే చాలా మంది మరి మా ఇల్లు శుభ్రం చేసుకోవద్దా? అలా చేస్తున్నప్పుడు చీమలు చావకుండా వుంటాయా? అని ప్రశ్నిస్తారు. అలాగే దోమలను చంపకపోతే అవి మమ్మల్ని కుడతాయి కదా? బొద్దింకలు, ఎలుకలు మమ్మల్ని ఇబ్బంది పెడతాయి కదా? మేము ఏమి చెయ్యాలి? అని ప్రశ్నిస్తుంటారు.

కానీ తెలుసుకోండి ఎప్పుడైతే మీరు ప్రతీ జీవిలోను దైవాన్ని చూడగలుగుతారో! ప్రతీ జీవిని దైవంగా భావించగలుగుతారో! అపుడు మీ ప్రవర్తన మారిపోతుంది. ఆ జీవిని చంపేటపుడు మీకు దైవం గుర్తుకు వస్తాడు. అప్పుడు మీరు ఆ ప్రాణిని చంపగలరా? చంపలేరు కదా? వెంటనే మీరు చీమలను ఏ చాటలోకో ఎత్తి బయట వేస్తారు. సాలెగూడు వూడుస్తారు. కానీ సాలె పురుగును చంపరు. బొద్దింకలను, ఎలుకలను బయట దూరంగా వదిలేస్తారు. ఇలా చేస్తున్నామంటే వాటిని చంపే ఉద్దేశ్యం మనకు లేనట్టేగా.

అలాంటి ఉద్దేశ్యంలో అంటే వేటిని చంపే ఉద్దేశ్యంలో మనం లేనపుడు ఈ సృష్టిలో సహజంగానే వేటిని చంపే అవకాశమే మనకు రాదు. అంటే మెల్లి మెల్లిగా ఆ క్రిమి కీటకాలు మీ ఇంటిలోనికి ప్రవేశించవు. మీకు ఇబ్బంది కలిగించవు. ఎందుచేతనంటే ఈ సృష్టిలో హాని చేయని వారిని ఏవీ హాని చెయ్యవు. అందుచేత ఈ విధంగా చేస్తుంటే ఆశ్చర్యం గొలిపేవిధంగా అవి వేరే ప్రదేశం చూసుకుంటాయి. మన జోలికి రావు. అపుడు హింస చేసే అవకాశమే మనకు రాదు.

అంతేకాదు అలా చీమలు, దోమలలో దైవాన్ని చూడగలిగేవారు కోళ్ళను, మేకలను చంపగలరా? అంటే కచ్చితంగా చంపలేరు. వాటి మాంసం తినగలరా? అంటే కచ్చితంగా తినలేరు. అంతేకాదు అవి చంపబడుతుంటే చూస్తూ వూరుకోలేరు. ఆ హింస ఆపే ప్రయత్నం చేస్తారు. మాంసం మానడమే కాదు. మాంసం తినేవారి చేత, మాన్పించే ప్రయత్నం చేస్తారు. అలా వారు దైవానికి ఇష్టులవుతారు. మెల్లిగా వారే దైవస్వరూపులుగా మారిపోతారు. అందుచేత జీవహింస చెయ్యకండి, ప్రతీ ప్రాణిలో దైవాన్ని దర్శించండి. ఒక ప్రాణిని ప్రేమించడమంటే దైవాన్ని ప్రేమించడమేనని తెలుసుకోండి. అలా చేస్తుంటే మీ జీవితమే మారిపోతుంది, ధన్యమవుతుంది. ధ్యానం చెయ్యండి అన్నీ మీకే తెలుస్తాయి.

# మొక్కు

చాలా మంది తమ కష్టాలు తీరాలని, తమ ఇష్ట దైవానికి మనస్సులో మొక్కుకుంటారు. కష్టం తీరితే విగ్రహం దగ్గరకు వెళ్ళి మొక్కు తీర్చుకుంటారు. అలా అనుకున్న మొక్కు తీర్చకపోతే పాపమని భావిస్తారు. పెద్ద తప్పు చేసినట్లుగా నిత్యం మధన పడుతూ వుంటారు. ఆ మొక్కు తీర్చే దాకా వారికి శాంతి వుండదు. ఇదంతా దైవానికి మాట ఇచ్చామన్న భావంతో అనుకున్నది తీర్చడానికి అంత ప్రాముఖ్యం ఇస్తారు.

కానీ ఇతరుల విషయంలో మటుకు అంత ప్రాముఖ్యం ఇవ్వరు. ఎవరికైనా ఏమైనా ఇవ్వాలనుకుంటే! ఒకవేళ ఇవ్వకపోయినా ఇవ్వలేకపోయినా దాని గురించి పెద్దగా పట్టించుకోరు, తప్పుగా భావించరు, పాపమనుకోరు.

ప్రస్తుతం సమాజంలో మాట ఇచ్చినా దాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. అది పెద్ద తప్పుగా కూడా భావించడం లేదు. అందుచేత వూరికే ఎన్ని మాటలైనా ఇచ్చేస్తున్నారు, వాగ్దానాలు చేస్తున్నారు. కానీ వేటినీ నెరవేర్చడం లేదు. అసలు వాటిని పట్టించుకోవడమే లేదు. మరచిపోతున్నారు కూడా. అసలు ఇచ్చినట్టు గుర్తు కూడా వుండటం లేదు. ప్రస్తుతం ఇచ్చిన మాటకు విలువ లేకుండా పోయింది. అది చాలా చిన్న విషయంగా భావిస్తున్నారు. చాలా తేలికగా తీసుకుంటున్నారు. అసలు మాట ఎక్కడ ఇచ్చాను? నేను మాటే ఇవ్వలేదు అని కూడా అంటున్నారు. అలా చెప్పడం, చెప్పగలగటం తమ తెలివితేటలుగా భావిస్తున్నారు. ఎదుట వారిని తెలివి తక్కువ వారిగా భావిస్తున్నారు. అంతకన్నా ఆలోచించడం లేదు. కానీ ఆలోచించాలి.

కారణం అనుకోవడం వేరు, అనడం వేరు. అనుకోవడం కర్మ కిందకు రాదు! అనడమే కర్మ క్రిందకు వస్తుంది. సృష్టి లెక్క ప్రకారం మనస్సులో అనుకున్నది లెక్కించబడదు, రికార్డు చేయబడదు. కానీ అన్నది అంటే నోటి నుంచి వచ్చిన మాట మాత్రం కర్మ కింద లెక్కించబడుతుంది. కచ్చితంగా రికార్డు చేయబడుతుంది. అంతేకాదు ఏ కర్మకైనా ప్రతిఫలం వుండే తీరుతుంది. అందుచేత మనస్సులో అనుకున్నది కాదు కాని, నోటితో అన్నది నెరవేర్చకపోతే మాత్రం తప్పు చేసిన వారవుతారు, పాపం చేసిన వారవుతారు, ఫలితం

అనుభవిస్తారు. కానీ మానవులు ఈ విషయం పెద్దగా పట్టించుకోవడం లేదు.

ఒకరకంగా చూస్తే 'మొక్కు' మనసులో అనుకున్నది. అందుచేత అది చెల్లించకపోయినా సృష్టి లెక్కలో తప్పుకాదు. కానీ నోటితో అన్నది మాత్రం మాట ఇచ్చినట్టే, అది కర్మే. అందుచేత మాట చెల్లించకపోతే సృష్టి లెక్కలో తప్పే! పాపమే!

కానీ మానవులు మాత్రం నోటితో అన్న మాటకు ప్రాముఖ్యం ఇవ్వటం లేదు. పాపం కానట్టు, తప్పులేనట్టు భావిస్తున్నారు. కానీ మనస్సులో అనుకున్న మొక్కుకు మాత్రం ప్రాముఖ్యం ఇస్తున్నారు. అంటే సృష్టి ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు, భావిస్తున్నారు, తెలియకుండా ఎంతో నష్టపోతున్నారు. అందుకే మానవులకు ఇన్ని కష్టాలు.

మొక్కు అన్నది మేము దేవుడికి మనస్సులో ఇచ్చినదని కొంతమంది అనుకోవచ్చు. అందుచేత మనుషుల విషయంలో ఎలా వున్నా దేవుడికి మాట ఇచ్చి తప్పితే ఆ దేవుడు కోపగించుకోడా? మా కోరికలు తీరుస్తాడా? అందుచేత మొక్కులు తప్పనిసరిగా తీర్చుకోవాలి, తీర్చాలి అని అనుకుంటారు.

ఇక్కడ విచిత్రమేమిటంటే **"బొమ్మ దేవుడూ కాదు, మనస్సులో అనుకున్నది మాట ఇచ్చినట్టు కాదు".** ఇటువంటి మొక్కు తీర్చకపోయినా దోషమేమీ వుండదు. పైగా మొక్కు తీర్చుకోవాలంటూ బలి ఇచ్చే జంతువులే నిజమైన దైవాలు. అలా దైవాన్ని హింసించినందుకు, చంపినందుకు అంతులేని పాపాన్ని మూటగట్టుకుంటారు, జీవితంలో ఎంతో నష్టపోతారు. అందుచేత తెలుసుకోండి. అందరూ అనుకునే మొక్కు తీర్చకపోయినా నష్టం లేదు కానీ మొక్కు తీర్చుకోవడానికి చేసే జీవుల హత్య అంతా నష్టమే కలిగిస్తుంది.

తెలుసుకోండి సృష్టిలో దైవం వేరే ఎక్కడో లేదు. అన్నీ దైవస్వరూపాలే, దైవం కానిది ఎవరు? అందుచేత ఇతరులకు మాట ఇచ్చినా దైవానికి ఇచ్చినట్టే. ఒకరకంగా మొక్కు రాయి రూపంలో వున్న విగ్రహానికి ఇచ్చింది. కానీ నోటితో అనే మాట మానవ రూపంలో వున్న చైతన్య స్వరూపమైన దైవానికి ఇచ్చిన మొక్కు. మానవులు విగ్రహమే దైవమైనట్టు మానవుడు దైవం కానట్టు ప్రవర్తిస్తున్నారు. కానీ మానవుడు కూడా దైవమే. ఇది ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఏ మానవునికి మాట ఇచ్చినా దైవానికి మాట ఇచ్చినట్టే,

అందుకే “దైవం మానుష రూపేణా” అంటారు. అందుచేత “మనస్సులో అనుకున్న దాని కంటే అన్న మాటకే ప్రాముఖ్యం ఇవ్వబడుతుంది”. అందుచేత మాట చెల్లించకపోయినా, మాట అని తీర్చకపోయినా మొక్కు చెల్లించనట్టే! దైవం విషయంలో తప్పు చేసినట్టే. అది పాపమే అవుతుంది. దాని పర్యవసానం వెంటనే కనిపించకపోయినా, దాని ఫలితం తర్వాత అయినా అనుభించవలసి వస్తుంది! అనుభవిస్తారు కూడా.

తెలుసుకోండి **“అనుకున్నది మొక్కు కాదు అన్నదే మొక్కు”.** నోటితో అన్నదే అసలైన మొక్కు. అందుచేత అన్న మాట నిలబెట్టుకోండి. ఒక వేళ అన్నమాట నిలబెట్టుకోలేనట్లయితే అనకండి. మాట ఇవ్వకండి. మాటల విషయంలో జాగ్రత్త వహించండి. ఎరుకతో మాట్లాడండి. అందుకే పత్రిగారు **“నీ నోటి మాటే నీ నుదుటి రాత”** అన్నారు.

అందుచేత తెలుసుకోండి మాటల విషయంలో నష్టపోకూడదన్నా, జాగ్రత్తగా వుండాలన్నా, ఎరుకతో మాట్లాడాలన్నా ఎవరైనా సరే ధ్యానం చెయ్యాలి. ధ్యానం చేసే కొద్దీ మాటపై ఎరుక కలుగుతుంది. మాటల విషయంలో జాగ్రత్తగా వుంటారు. దానితో పాటు వీలైనంత మౌనం కూడా పాటిస్తూ అవసరమైనంత వరకే మాట్లాడుతూ వుండాలి. అపుడు మాట మీద పట్టు వస్తుంది. జాగ్రత్తగా మాట్లాడగలుగుతారు. అందుచేత ధ్యానం చెయ్యండి. ఏది అసలైన ‘మొక్కో’ అర్థమవుతుంది.

**ఏ ప్రాణియొక్క కంఠాన్ని ఎలా నువ్వు కోస్తున్నావో...**
**తిరిగి నీ గొంతు కూడా అలానే కోయబడుతుంది.**
**– కబీరు**

# బొమ్మ - అమ్మ

చాలామంది బొమ్మకి.. అమ్మకి వున్న తేడా తెలుసుకోలేకపోతున్నారు. బొమ్మనే అమ్మ అనుకుంటున్నారు. కొంతమంది పెద్దలు కూడా బొమ్మనే అమ్మ అని చెపుతూండడం వల్ల అంతా బొమ్మనే అమ్మ అని అనుకుంటున్నారు.

కానీ తెలుసుకోండి బొమ్మ.. బొమ్మే..., అమ్మ.. అమ్మే.. అంతే కానీ బొమ్మ అమ్మ ఎలా అవుతుంది? అందుచేత బొమ్మకు అమ్మకు తేడా తెలుసుకుందాం.

బొమ్మ అంటే ఎవరో ఒకరు దేనితోనైనా కావచ్చు అంటే రాయితోకానీ, చెక్కతో కానీ, లోహంతోకానీ తయారు చేసినది. అంటే ఒకరితో సృష్టించబడినది.

కానీ అమ్మ అంటే ఒకరికి జన్మనిచ్చినది. అంటే ఒకరిని సృష్టి చేసినది.

దీనిని బట్టి వీరిద్దరికి చాలా తేడా వుందని తెలుసుకోవచ్చు. అంటే **"సృష్టి చేయబడేది బొమ్మ. సృష్టి చేసేది అమ్మ".** ఇంకా స్పష్టంగా చెప్పాలంటే **"మనం సృష్టించినది బొమ్మ. మనల్ని సృష్టించినది అమ్మ".** ఒకరకంగా చూస్తే బొమ్మ కంటే అమ్మ చాలా చాలా గొప్పది. కారణం అమ్మ చేసే పని బొమ్మ చెయ్యలేదు. అమ్మ తాను సృష్టి చేసిన దానిని అంటే జన్మనిచ్చిన బిడ్డను పోషించగలదు, పెంచగలదు, రక్షించ గలదు. కానీ బొమ్మ అవేమీ చెయ్యలేదు. బొమ్మ వేటినీ పోషించలేదు, పెంచలేదు, రక్షించలేదు. అంతేకాదు అమ్మ కదులుతుంది. తన పిల్లలను సాకుతుంది. మంచి చెడ్డలు నేర్పుతుంది. తన పిల్లలను తనలాగే తయారు చేస్తుంది. కానీ బొమ్మ ఇవేమీ చెయ్యలేదు.

అందుచేత **"సృష్టింపబడిన బొమ్మ కంటే సృష్టి చేయగలిగిన అమ్మే ఎంతో గొప్పది".** విచిత్రం ఏమిటంటే పెద్దలనుకునేవారు కూడా ఈ తేడా గ్రహించలేక పోతున్నారు. బొమ్మను పెట్టి అమ్మ... అమ్మవారు అని బోధిస్తున్నారు, చెపుతున్నారు. అది అమ్మవారి బొమ్మే కానీ అమ్మ కాదు, అమ్మవారు కాదు అని తెలుసుకోలేక పోతున్నారు.

సామాన్యులు ఈ తేడా తెలుసుకోలేక చేయకూడని పనులు చేస్తున్నారు. సృష్టి నియమాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. బొమ్మనే అమ్మ అనుకుని, ఆ బొమ్మ కోసం అమ్మనే అవమానిస్తున్నారు, హింసిస్తున్నారు, చంపుతున్నారు, భక్షిస్తున్నారు.

చూడండి ఒక కోడినే తీసుకుందాం. కోడి అమ్మే కానీ బొమ్మ కాదు.

కారణం అది చాలా పిల్లలకు జన్మనిస్తుంది. అంటే సృష్టిస్తుంది. సృష్టించడమే కాదు. వాటిని పోషిస్తుంది, పెంచుతుంది. రక్షిస్తుంది. తనలా ఎదిగేటట్టు చేస్తుంది. ఈ సృష్టి క్రమం ఆగకుండా కొనసాగేలా చేస్తుంది. అలా చేయగలిగిన వారు ఎవరైనా అమ్మే అవుతారు. ఆ పిల్లలచే అమ్మ అని పిలువబడతారు.

అలాగే ఈ సృష్టిలో మేకలు, గొర్రెలు, పందులు, గేదెలు, ఆవులు, చేపలు ఏవైనా సరే అమ్మలే. కారణం ఇవన్నీ జన్మనివ్వగలవు. అంటే సృష్టించగలవు. అందుచేత ఈ సృష్టిలో జన్మనివ్వగల ప్రతీ తల్లి అంటే అమ్మ పవిత్రమైనదే, పూజింపదగ్గదే. ఆ అమ్మే లేకపోతే ఈ సృష్టే లేదు. ఈ సృష్టి ఆగిపోతుంది. ఈ సృష్టి ఇలా యుగ, యుగాలుగా కొనసాగటానికి కారణం అమ్మే! అసలు అమ్మే లేకపోతే బొమ్మలు ఎలా వస్తాయి. అసలు అమ్మతో పోల్చటానికి బొమ్మ ఏ రకంగానూ సరిపోదు. అందుచేత బొమ్మ కోసం అమ్మను అవమానించకండి, అమ్మను హింసించకండి.  అమ్మను చంపకండి. అమ్మ యొక్క గొప్పతనం తెలుసుకోండి. అమ్మను పవిత్రంగా చూడండి.

ఎందుచేతనంటే లోకంలో ఈ తేడా తెలుసుకోలేక, బొమ్మనే అమ్మవారంటూ, బొమ్మకి మొక్కుతున్నారు. మొక్కు తీర్చుకుంటున్నానంటూ అమ్మ అయిన కోడిని, మేకను, బొమ్మకు బలి ఇస్తున్నారు. ఘోరంగా చంపి భక్షిస్తున్నారు. తెలియకుండా అంతులేని పాపాన్ని మూటగట్టుకుంటున్నారు. తద్వారా భవిష్యత్తులో తమ జీవితాన్ని నరకప్రాయం చేసుకుంటున్నారు. జీవితంలో కష్టాలు కొని తెచ్చుకుంటున్నారు.

తెలుసుకోండి **"కోడిని అమ్మవారికి బలి ఇవ్వడం కాదు – అమ్మవారినే బొమ్మకు బలి ఇస్తున్నారు".** అంతులేని అపచారం చేస్తున్నారు.

ఇక్కడ కోడే అమ్మ, అంటే అమ్మవారు. అందరూ అనుకునే అమ్మవారే బొమ్మ. ఈ మూర్ఖ మానవులు రుచికి బానిస అవడం వల్ల, తినడం కోసం తాము ఏమి చేస్తున్నారో కూడా తెలుసుకోకుండా చేయకూడని పనులు చేస్తున్నారు. ఎంతో అపచారం చేస్తున్నారు. ఏదో ఒక కారణం చూపెట్టి ఈ రోగం వచ్చిందని, ఆ రోగం వచ్చిందని, మాంసం తినడం కోసం ఈ రకంగా అమ్మవారైన కోళ్ళను, మేకలను చంపుతున్నారని, క్రూరంగా హింసిస్తున్నారని యోగి వేమన గారు స్పష్టంగా చెప్పడం జరిగింది.


**బొమ్మ మాయ కొరకు అమ్మవారికి  వేట**
**లిమ్మటండ్రి. ఇదేమి రిమ్మ తెగులో!**

అమ్మవారి పేర అందరూ తినుటకా?
విశ్వదాభిరామ! వినురవేమ!

తా:- దొమ్మరోగం పోవటానికి అమ్మవారికి జంతువులను బలి ఇస్తూ వుంటారు. బుద్ధిలేని వీరికి ఇదేమి తెగులో! వూరికే అమ్మవారి పేరు చెప్పి వీరంతా తినటానికి తప్ప వేరేమీ కాదు అని, వేమన యోగీంద్రుల వారు స్పష్టంగా చెపుతున్నారు.

అందుచేత తెలుసుకోండి. దేనిని బలి ఇస్తున్నారో అదే అమ్మవారు. దేనికి బలి ఇస్తున్నారో అది బొమ్మ మాత్రమే. ఇలాంటి అపచారం జరుగుతూ వుండటానికి, సామాన్యులలో ఈ ఆచారం పెరిగిపోవటానికి ముఖ్య కారణం పెద్దలు, పండితులు, బొమ్మకు, అమ్మకు తేడా వివరించకపోవడమే. ఎంతసేపూ బొమ్మను పెట్టి అమ్మవారని బోధించడమే. అందుచేత తెలుసుకోండి లోకంలో దేనినైతే అమ్మవారనుకుంటున్నారో అది బొమ్మ, వేటినైతే కోడి, మేక, చేప అనుకుంటున్నారో అవే అమ్మవార్లు.

కారణం అన్ని జీవులలోనూ భగవంతుని స్వరూపమైన ఆత్మ వుంది. అందుచేత అన్ని జీవులు భగవత్ స్వరూపాలే అంటే అన్నీ అమ్మవార్లే. అందుచేత జంతువులను చంపకండి, బలి ఇవ్వకండి, వాటి మాంసం తినకండి. ఈ సత్యాన్ని తెలుసుకోండి. ధ్యానం చెయ్యండి. అంతా మీకే తెలుస్తుంది.



# ప్రాణదానం

సృష్టిలోని ముఖ్య ధర్మాలలో 'దాన ధర్మం' ఒకటి. దానం అంటే ఇవ్వడం. ఎవరికైనా ఇవ్వడమే సృష్టిలో లాభించే విషయం. ఎవరైతే ఎంత ఇస్తారో! అంటే దానం చేస్తారో! వారు అంత లాభం పొందుతారు.

దానాలలో ఎన్నో రకాలు వున్నాయి. మరి అన్ని దానాల కంటే ఏ దానం గొప్పది? ఏ దానం చేస్తే ఎక్కువ లాభం పొందుతామన్నది తెలుసుకోవాలి. సహజంగా అన్ని దానాల కంటే అన్నదానం గొప్పది అంటారు. కానీ అన్నదానం యొక్క విలువ కొన్ని గంటలు మాత్రమే వుంటుంది. కొన్ని గంటలు గడవగానే మరల అన్నం కావాలి, ఆకలి అంటాడు.

కొంతమంది ధనదానం గొప్పది అంటారు. కానీ ఆ ధనం కర్చు అయిపోతే ఆ దానం విలువ వుండదు. వాడు మరల ధనాన్ని ఆశిస్తాడు. అలాగే వస్త్రదానం కొన్ని నెలలు వుంటుంది. అలా చెప్పుకుంటే ఏ దానమైనా కొంతకాలమే. కొంతవరకే వుంటుంది. అంతేకాదు ఇలాంటివి ఎన్ని చేసినా మరల.. మరల కావాలంటూనే వుంటారు.

కానీ అన్నిటి కంటే జ్ఞానదానం గొప్పది అంటారు. కారణం ఏది ఇచ్చినా ఇంకా ఇంకా కావాలంటారు, వద్దని అనరు. కానీ జ్ఞానాన్ని ఇస్తే నాకు ఇంక ఏమీ వద్దు అంటారు. అంటే ఎవరిచేతనైనా వద్దు అని అనిపించగలిగేది జ్ఞానదానం మాత్రమే. అందుచేత జ్ఞానదానం గొప్పది అంటారు. మరి జ్ఞానాన్ని ఎలా దానం చెయ్యగలం అంటే ధ్యానాన్ని చెబితే జ్ఞానదానం చేసినట్టే. కారణం ధ్యానం చేసిన వారికి జ్ఞానం అన్నది దానంతట అదే వస్తుంది. అందుచేత ధ్యానం ఉచితంగా చెపితే వారు జ్ఞానదానం చేసినట్టే.

కానీ జ్ఞానదానం కంటే గొప్పదానం వుంది. అదే ప్రాణదానం. కారణం జ్ఞానాన్ని దానం చేసే వాళ్ళు వున్నారు. కానీ, ప్రాణాన్ని దానం చేసేవారు ఎవరూ లేరు. అంటే ప్రాణాన్ని ఇవ్వగలవారు, అంటే ప్రాణం పొయ్యగలవారు ఎవ్వరూ లేరు. అందుచేత "అన్ని దానాల కంటే ప్రాణదానమే గొప్పది". మరి ప్రాణం పొయ్యలేనపుడు ప్రాణదానాన్ని ఎలా చెయ్యగలం? అన్న సందేహం రావచ్చు. కానీ ప్రాణం పొయ్యలేకపోయినా, ప్రాణం పోకుండా చూస్తే వారికి ప్రాణ దానం చేసినట్టే!

మరి ప్రాణం పోకుండా చేయడమెలా? చంపబడే ప్రాణిని చావకుండా కాపాడగలిగితే ఆ జీవికి ప్రాణదానం చేసినట్టే. మరి ఆ ప్రాణులు అంటే జంతువులు

చావకుండా ఎలా చెయ్యగలం? అంటే వాటిని చంపటానికి కారణమైన మాంసభక్షణ మాన్పించడం. అంటే మాంసం తినే వారి చేత మాంసం తినడం మాన్పిస్తే చాలు, ఆ జీవుల హత్య ఆగిపోతుంది. కారణం ఆ జీవులు చంపబడటానికి కారణం మాంసం తినడమే. ఎందుచేతనంటే ఎవరూ మాంసం తినకపోతే చంపేవాడు ఎందుకు చంపుతాడు? చంపడు కదా? తినేవాడు వుండబట్టే చంపేవారు చంపుతున్నారు. అందుచేత తినేవాడి చేత మాంసం తినడం మాన్పిస్తే చాలు, వాడి జీవితంలో వాడు తినే ఎన్నో కోళ్ళు, పక్షులు బతుకుతాయి. మేకలు, గొర్రెలు బతుకుతాయి. చేపలు బతుకుతాయి. అపుడు వాటన్నిటికీ ప్రాణదానం చేసినట్టే.

అలా మాంసం మాన్పించిన వాడు ఎన్నో ప్రాణులకు, జంతువులకు ప్రాణదానం చేసినట్టే! వాడు ఈ సృష్టిలో చాలా గొప్పవాడవుతాడు. కారణం అంతులేని దానఫలితం సంపాదించుకున్నాడు కాబట్టి. కారణం వాడు అన్నిటికంటే గొప్పదైన ప్రాణదానం చేసాడు కాబట్టి. ఎన్నో జీవుల ప్రాణాలు పోకుండా చేశాడు కాబట్టి. అందుచేత మాంసం తినడం మాన్పించే వారే ఈ సృష్టిలో చాలా చాలా గొప్పవారు. గొప్ప కార్యం చేసిన వారవుతారు.

ఈ సృష్టిలో ప్రాణం పొయ్యగలవాడు భగవంతుడు ఒక్కడే. అలా ఏ జీవికైనా ప్రాణం పోకుండా చేసేవాడు ఆ జీవికి ప్రాణం పోసినట్టే. అలాంటి వాడు దేవునితో సమానం.

తెలుసుకోండి. **"ప్రాణాన్ని తీస్తే రాక్షసుడు. తియ్యకపోతే మానవుడు. ప్రాణం పోకుండా చూస్తే మహాత్ముడు. ప్రాణాన్ని పోస్తే పరమాత్ముడు"** అవుతాడు.

అందుచేత ప్రాణం పోకుండా చూడండి. ఆ అమాయకపు మూగ జీవులకు ప్రాణదానం చెయ్యండి. అందరి చేత మాంసం తినడం మాన్పించండి. అన్నింటికంటే గొప్పదానమైన ప్రాణదానాన్ని చెయ్యండి.

**1) కడుపు నిండా చేపల్ని తిని కోటి ఆవులను దానం ఇచ్చినా, కాశీ వెళ్ళి మరణించినా, నరకానికే వెళతావు.**

**2) అన్ని వర్ణాలు కలిసి శక్తిపూజ పేరుతో జంతువులను బలి ఇచ్చి తింటున్నారు. హరిజనులను అంటరానివారుగా భావిస్తున్నారు. వారు నరకాన్నే పొందుతారు.**



# పాత్ర శుద్ధి - పదార్థ శుద్ధి - పాకశుద్ధి

- తటవర్తి రాజ్యలక్ష్మి

మానవులు దుఃఖం నుంచి బయటపడాలంటే ఆధ్యాత్మికంగా ఎదగాలి. ఆధ్యాత్మికంగా ఎదగాలంటే ముఖ్యంగా "శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం" చెయ్యాలి. ఆధ్యాత్మిక ఎదుగుదలకు ధ్యానం ఒక్కటే సరిపోదు. ధ్యానంతో పాటు ఆహార నియమాలు కూడా అవసరమే. ఆహార నియమాలు పాటించకుండా ఆధ్యాత్మిక ఎదుగుదల ఎప్పటికీ సాధ్యం కాదు. అందుచేత ఎటువంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకుందాం.

ముఖ్యంగా శుద్ధమైన ఆహారం తీసుకోవాలి. ఎందుచేతనంటే ఆహారం శుద్ధంగా వుంటేనే ధ్యానంలో మనస్సు శుద్ధమవుతుంది. దానిని బట్టే మనిషి ఆధ్యాత్మిక ఎదుగుదల వుంటుంది. మరి ఆహారంలో ఎలాంటి శుద్ధత వుండాలో చూద్దాం. ముఖ్యంగా మూడు రకాల శుద్ధత వుండాలి. (1) పాత్రశుద్ధి, (2) పదార్థ శుద్ధి, (3)పాక శుద్ధి.

**1) పాత్రశుద్ధి :-**

ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మికంగా ఎదగాలంటే పత్రిగారు ఆహార నియమాలను ఎంతో చక్కగా చెబుతారు. మాంసాహారం అంటే మృతాహారమని అంటే కుళ్ళు పోయే, కంపు కొట్టే, పురుగులు పట్టే ఆహారమని ముందు మాంసాహారం మానమని చెపుతారు. మాంసాహారం మానడమే కాదు అవి వండిన పాత్రలు కానీ, అలాంటి ఆహారానికి ఉపయోగించిన పాత్రలు కానీ వాడవద్దంటారు. ఎందుకంటే వాటి దోషం ఆ పాత్రలో కూడా వుంటుంది కాబట్టి. ఉదాహరణకి మనం పొలంలో వాడిన ఎండ్రిన్ డబ్బా పారవేస్తాము కానీ, శుభ్రం చేసి ఇంట్లో వాడకానికి ఉపయోగించం. కారణం అది ఎంత శుభ్రం చేసినా అది మనకు ఎంతో కొంత హాని చేస్తుందనే. మనం కనిపించేవి చూస్తాం కానీ, కనిపించనివి చూడం, చూడలేం కూడా. మాంసాహారం వండిన పాత్రలలో దోషం వుంటుందని పత్రిగారికి తెలుసు. ఆయనకి కనిపించేవే కాదు, కనిపించని సూక్ష్మాతి, సూక్ష్మమైన దోషాలు కూడా

తెలుసు. అలాంటి పాత్రలలో వండిన ఆహారం తినడం వల్ల మన మనస్సు రజోగుణంలోకి మారిపోతుంది. తమోగుణం, రజోగుణం వున్నవారికి సాధన కుదరదు. అందువల్ల మన ఆధ్యాత్మిక అభివృద్ధికి పాత్రశుద్ధి చాలా ముఖ్యమని తెలుసుకోవాలి.

**2) పదార్థ శుద్ధి :-**

అంటే మనం తినే పదార్థం కూడా శుద్ధంగా వుండాలి. మృతాహారమైన మాంసాహారం, గుడ్లు తినకూడదు. ఇవి తింటే మనస్సు రజోగుణంలోకి మారుతుంది. అందుచేత సాత్వికమైన శాకాహారమే తీసుకోవాలి. శాకాహారంలో కూడా కొన్ని నియమాలు పాటించాలి. అంటే కుళ్ళినవి, నిల్వ వుంచిన ఆహార పదార్థాలు తినవద్దని పత్రిగారు చెబుతారు. యాపిల్ కానీ, అరటి పండు కానీ, ఏ పండైనా కుళ్ళడం మొదలు పెడితే అది పాడైపోయినట్టే. ఒక ప్రక్క పాడైపోయిందని కోసి మిగిలినది తినేస్తుంటాం. కానీ అటువంటివి కూడా తినకూడదు. అలాగే ఉదయం వండినవి వేడి చేసి సాయంత్రం తినకూడదు. ఒకరకంగా వండి ఫ్రిజ్‌లో వుంచినవి ఏవీ తినకూడదు. అలాంటివి తినడం వల్ల మనలో తమోగుణం పెరగడమే కాకుండా మన సాధనకు కూడా చాలా అవరోధం కలుగుతుంది. అందుచేత తాజాగా వేడివేడిగా వండుకుని తినాలి. అంతేకాదు శాకాహారంలో వెల్లుల్లి వాడకూడదు. ఇది కూడా రజోగుణాన్ని పెంచుతుంది. అలా రజోగుణం, తమోగుణం ఆధ్యాత్మిక ఎదుగుదలకు అవరోధం అంటే ఆత్మకు దగ్గర కావటానికి అవరోధం అందుచేత శాకాహారంలో కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే పత్రిగారు ఎలక్ట్రిక్ ఓవెన్ వాడవద్దంటారు. అందుచేత పాత్ర శుద్ధితో పాటు పదార్థ శుద్ధి కూడా చాలా చాలా అవసరం.

**3) పాక శుద్ధి :-**

ఇక పాక శుద్ధి కూడా ఉండాలని పత్రిగారు చెబుతారు. అలా వండకపోతే ఆ రుచి పోతుంది అంటారు. ధ్యానం చేసి శుద్ధ మనస్సుతో వంట చేస్తే అది తిన్న వారికి ఆరోగ్యం, ఆనందం కలుగుతుంది. పదార్థం ఎంతో రుచిగా వుంటుంది. చెడు ఆలోచనలతో వంట చేస్తే అది తిన్నవారి మీద కూడా ప్రభావం చూపెడుతుంది. ఒక ఉదాహరణ చూద్దాం.


ఒక రాజు గారు ఒక రోజు ఒక సాధువును భోజనానికి పిలిచారు. ఆ

సాధువుకు భోజనం తయారు చేసే వంట వాడు రాజుగారి వెండి వంట పాత్రలు చూస్తూ ఇంత సామానం వుంది కదా? నేనొక చెంచా తీస్తే ఎవరికి తెలుస్తుంది అనే భావంతో ఒక చెంచా తీసి జేబులో వేసుకున్నాడు. వంటవాడు అటువంటి స్వార్థ భావంతోటే వంట చేశాడు.

ఆ రోజు భోజనానికి వచ్చిన ఆ సాధువు భోజనం చేస్తూ ఒక వెండి గ్లాసును సంచిలో వేసుకుని ఆశ్రమానికి వెళ్లాడు. ఆశ్రమానికి వెళ్లి సంచి బోర్లించి చూస్తే అందులోంచి వెండి గ్లాసు బయట పడింది. అప్పుడు ఆ సాధువు ఆలోచించాడు. నేను అన్నిటినీ, అందరినీ వదలి ఈ ఆశ్రమానికి వచ్చానే మరలా ఇలాంటి కర్మ ఎందుకు చేశాను? అని ఆశ్చర్యపోయాడు. తన దివ్యదృష్టితో చూస్తే కారణం తెలిసింది. ఆ రోజు వంట చేసిన వంటవాడు ఎటువంటి ఆలోచనతో వంట చేసాడో! ఆ ఆహారం తిన్న తాను కూడా అలా ప్రవర్తించానని తెలుసుకున్నాడు. వెంటనే రాజు గారి వద్దకు వెళ్ళి జరిగినదంతా చెప్పి మీ వంట వాడి దగ్గర చెంచా వుంటుంది చూడండి అని చెప్పాడు. రాజుగారు చూస్తే వంటవాడి దగ్గర వెండి చెంచా దొరికింది.

మన ఆలోచనల ప్రభావం మనం చేసే వంట మీద వుంటుందని తెలుసుకోవాలి. అందుచేత అది తిన్న వారు కూడా అలానే ప్రవర్తిస్తారు.

అందువల్ల మనం వంట చేసేటప్పుడు మంచి ఆలోచనలతో అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా, బాగుండాలనే మనస్తత్వంతో ఎటువంటి కృత్రిమ భావాలు లేకుండా వంట చేస్తే అది తినే వారిపై ఆ ప్రభావం పడి, పదార్థం రుచిగా వుండడమే కాదు. అందరూ ఆనందంగా వుంటారు. అందుకే పత్రిగారు అందరి ఇళ్ళల్లో ముఖ్యంగా మాంసాహారుల ఇళ్ళలో భోజనం చెయ్యరు. ఆయనకు అన్నీ తెలుసు. అందుకే సూక్ష్మమైన లోపాలు కూడా సహించరు. కారణం అవి మన సాధనకు, ఆధ్యాత్మికత ఎదుగుదలకు అడ్డుపడతాయి. అందువల్ల పాకశుద్ధి కూడా సాధకునికి బాగా అవసరమని తెలుసుకోండి. పత్రిగారి బాటలో నడిచి ప్రతీ ఒక్కరూ పాత్రశుద్ధి, పదార్థశుద్ధి, పాకశుద్ధి పాటించండి. ఆధ్యాత్మికంగా ఎదగండి. దుఃఖం నుంచి బయటపడండి.



# ధ్యానం చేసే పద్ధతి
# శ్వాసమీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమ క్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీ మండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండల శుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.

# పిరమిడ్ ధ్యానుల తత్వ సారం




**ఆత్మే పరబ్రహ్మం**

| | |
|---|---|
| జీవుడే దేవుడు | దేహమే దేవాలయం |
| శ్వాసే గురువు | సమయమే సాధన |
| సహనమే ప్రగతి | అనుభవమే జ్ఞానం |
| దానమే ధర్మం | ధర్మమే పుణ్యం |

**ధ్యానం .. అంటే .. శ్వాసధార .. మీద ..ధ్యాసధార**



"రేపు చేయాల్సిన పనిని ఈ రోజే చేయి. ఈ రోజు చేయాల్సిన పనిని ఇప్పుడే చేయి. క్షణంలో ప్రళయం రావచ్చు. ఇక ఎప్పుడు చేస్తావు?"

* * *

"పడవలో నీరు నిండినప్పుడు, ఇంటిలో ధనం ఎక్కువ వున్నప్పుడు వెంటనే రెండు చేతులతో దానిని బయటకు పారద్రోయాలి. ఇదే బుద్ధిమంతుల పని"

* * *

"ఇతరుల దోషాలను చూసి నవ్వే ప్రజలు, తమ చిత్తాన్ని ఒక్కసారి చూసుకుంటే తమలోని అనంత దోషాలను గుర్తించగలరు".

* * *

"మనిషి ఖర్జూర చెట్టులా ఎత్తుగా వుండి లాభమేమిటి? బాటసారికి అది నీడ ఇవ్వలేదు, ఫలాలేమో చాలా దూరంలో వుంటాయి".

* * *

"ప్రజలు సత్యాన్ని నమ్మకుండా, అసత్యం పట్ల విశ్వాసంగా వున్నారు. లోకంలో మద్యం కూర్చుని అమ్ముతుండగా, పాలు, పెరుగును వీధి, వీధి తిరిగి అమ్మవలసి వస్తోంది."

* * *

"ఎవరైతే నీ మార్గంలో ముళ్ళు జల్లి నీకు అపకారం చేస్తారో, వారికి నీవు పూలు చల్లి ఉపకారమే చేయి, నీ మార్గంలో పూలకు పూలే వస్తాయి, వారికి ముళ్ళే లభిస్తాయి".

* * *

"తలవెంట్రుకలను 100 సార్లు ఎందుకు కత్తిరించుకుంటున్నావు? అంతకంటే మనస్సులో వున్న విషయ, వికారాలను కత్తిరించుకో!"

– కబీరు

రూ.120/-